ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి



విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక

VISION ANDHRA TELUGU DAILY



బుధవారం, 11 నవంబర్ 2026 | Wednesday 11 November 2026 | హైదరాబాద్ | పేజీలు: 12+12 | వెల: రూ.1.00 | PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA

సంపుటి: 28 సంచిక: 201 | Vol.No 28 Issue No .201 | Hyderabad | www.visionandhra.in



మీ నేపథ్యాన్ని మరిచిపోవద్దు..





నిటారుగా నిలబడి డ్యూటీ చేయండి!

112 మంది నూతన డీఎస్పీలకు సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశం

ఎంసీఆర్ హెచ్ఆర్డీలో ఉద్వేగభరిత ప్రసంగం



తెలంగాణ స్టేట్ బ్యూరో, నవంబర్ 10 (విజన్ ఆంధ్ర):

ఎంసీఆర్ హెచ్ఆర్డీలో నూతనంగా నియమితులైన 112 మంది డీఎస్పీలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. సంక్లిష్టమైన పరిస్థితుల్లో, ఎన్నో అడ్డంకులను అధిగమించి ఈ నియామకాలు చేపట్టామని సీఎం స్పష్టం చేశారు. నోటిఫికేషన్ నుంచి నియామకాల వరకు ఈ ప్రభుత్వమే పూర్తి చేసిందని, ఇది తమ చిత్తశుద్ధికి నిదర్శనమని చెప్పారు.

13 ఏళ్లు ఆగిన గ్రూప్-1.. బాధితులే మీరు! 2011లో గ్రూప్-1 నియామకాలు చేపట్టారని, ఆ తర్వాత 2025 వరకు దాదాపు 13 ఏళ్లు తెలంగాణలో గ్రూప్-1 నియామకాలు చేపట్టలేదని సీఎం గుర్తుచేశారు. కొన్ని నెలలు ఆలస్యమైతేనే ఏళ్లు కోల్పోయామన్న బాధ అనిపిస్తుందని, 13 ఏళ్లు ఎదురుచూసిన వారి బాధ ఎంత ఉంటుందో ఊహించవచ్చని అన్నారు. టీజీపీఎస్సీ ద్వారా నోటిఫికేషన్ ఇచ్చినా ప్రశ్నాపత్రాలు, ఇతర అంశాల్లో జరిగిన గందరగోళం అందరికీ తెలుసని, మీరు ఆ రోజు బాధితులని అన్నారు. ఆనాటి

02



చలి వచ్చేసింది..

పిల్లల జాగ్రత్త మర్చిపోవద్దు!

- జంక్‌ఫుడ్, కూల్‌డ్రింక్స్ వద్దే వద్దు..
- వెచ్చని ఆహారమే ముద్దు వైద్య నిపుణుల హెచ్చరిక

తెలంగాణ స్టేట్ బ్యూరో, నవంబర్ 10 (విజన్ ఆంధ్ర):



చలికాలం మొదలైంది. ఉదయం పూట చల్లని గాలులు, సాయంత్రం కాగానే చలి ముసురుకుంటున్న వాతావరణం చిన్నారుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ కాలంలో పిల్లలకు జలుబు, దగ్గు, జ్వరం, గొంతునొప్పి, శ్వాసకోశ ఇన్ఫెక్షన్లు, న్యుమోనియా, ఆస్తమా వంటి వ్యాధులు సులభంగా సోకే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. అందుకే తల్లిదండ్రులు ఈ కాలంలో మరింత అప్రమత్తంగా ఉండాలని, పిల్లల ఆరోగ్యం విషయంలో ఏ మాత్రం నిర్లక్ష్యం చేయవద్దని సూచిస్తున్నారు.

02

చామల వర్సెస్ మహేష్ గౌడ్..

కాంగ్రెస్‌లో ముదురుతున్న ముసలం!

- మీడియా ప్యానలిస్టుల జాబితాపై స్టే..
- గాంధీభవన్‌లో హాట్ టాపిక్‌గా మారిన అంతర్గత పోరు



తెలంగాణ కాంగ్రెస్‌లో మరోసారి అంతర్గత విభేదాలు భగ్గుమన్నాయి. మీడియా ప్యానలిస్టుల నియామకాల వ్యవహారం ఇప్పుడు పార్టీలో పెద్ద వివాదంగా మారింది. మీడియా & పబ్లిసిటీ డిపార్ట్‌మెంట్ చైర్మన్, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి విడుదల చేసిన జాబితాను టీపీసీసీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్ నిలిపివేయడంతో గాంధీభవన్ వర్గాల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. ఒకే పార్టీలో ఇద్దరు కీలక నేతల మధ్య జరిగిన ఈ పరిణామం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

తెలంగాణ స్టేట్ బ్యూరో, నవంబర్ 10 (విజన్ ఆంధ్ర):

చామల ప్రకటించిన జాబితా ఏంటి?

కాంగ్రెస్ పార్టీ తరపున టీవీ డిబేట్లలో పాల్గొనే మీడియా ప్యానలిస్టులు, మీడియా కోఆర్డినేటర్లు, సీనియర్ అధికార ప్రతినిధులు, అధికార ప్రతినిధుల జాబితాను చామల కిరణ్ కుమార్ రెడ్డి సోమవారం విడుదల చేశారు. టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ మీడియా అండ్ పబ్లిసిటీ విభాగం చైర్మన్ పవన్ ఖేరా ఆదేశాల మేరకు ఈ నియామకాలు చేసినట్లు చామల తన ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొన్నారు. ఈ నియామకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని కూడా ప్రకటించారు. ఈ జాబితాలో 16 మంది మీడియా ప్యానలిస్టులు, 49 మంది అధికార ప్రతినిధులు, నలుగురితో మీడియా

02

కరీంనగర్‌కు

నితిన్ నబీన్..

- లక్ష మందితో బీజేపీ మహా పాదయాత్ర
- బండి సంజయ్ నేతృత్వంలో కార్యక్రమ నిర్వహణ
- గాంధీ సర్కిల్ నుంచి కమాన్ వరకు యాత్ర

02

- పాదయాత్రలో పాల్గొననున్న రాంచందర్‌రావు

అందెశ్రీ రచనలు చిరస్థాయిగా నిలిచిపోతాయి

- రవీంద్రభారతిలో ఘనంగా అందెశ్రీ వర్ధంతి

తెలంగాణ ప్రజాకవి, ఉద్యమ గాయకుడు అందెశ్రీ సేవలు, రచనలు, పాటలు తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని, తెలంగాణ సమాజానికి, సాహిత్యానికి ఆయన లేని లోటు తీరనిదని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంగళవారం రవీంద్రభారతిలో నిర్వహించిన అందెశ్రీ వర్ధంతి కార్యక్రమంలో మంత్రి జూపల్లి పాల్గొని, ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమం భావోద్వేగభరితంగా, అందెశ్రీ పాటల స్మరణతో సాగింది.

- ఆయన ఆశయాలు, ఆలోచనా విధానాన్ని ముందుకు తీసుకెళ్లడమే నిజమైన నివాళి - మంత్రి జూపల్లి

తెలంగాణ స్టేట్ బ్యూరో, నవంబర్ 10 (విజన్ ఆంధ్ర):



ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమ సమయంలో తన రచనలు, పాటల ద్వారా యావత్ తెలంగాణ సమాజాన్ని ఏకతాటిపైకి తీసుకొచ్చి, ఉద్యమానికి స్ఫూర్తిని నింపిన ప్రజాకవి అందెశ్రీ అని ఆయన చేసిన సేవలను కొనియాడారు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో లి"జయ జయహే తెలంగాణ"లి గేయం కోట్లాది ప్రజల గొంతుకై నిలిచిందన్నారు. ఆ పాట లేకుండా తెలంగాణ ఉద్యమాన్ని ఊహించలేమని, ఆ పాటే ఉద్యమానికి జాతీయ గీతంలా మారిందని చెప్పారు. తెలంగాణ ఉద్యమ సమయంలో అందెశ్రీ తన కలం, గళం ద్వారా ప్రజల్లో చైతన్యం నింపారని, ఆయన పాటలు తూటాల్లా పేలి ఉద్యమానికి కొత్త ఊపిరి పోశాయని అన్నారు. తెలంగాణ సమాజాన్ని సంఘటితం చేయడంలో ఆయన రచనలు, పాటలు కీలక పాత్ర పోషించాయని గుర్తుచేశారు. అందెశ్రీ కేవలం కవి మాత్రమే కాదని, ఆయన ఒక ఉద్యమకారుడని, ప్రజల మనిషని మంత్రి జూపల్లి అన్నారు. పల్లెపల్లెనా తిరిగి, ప్రజల బాధలను, కష్టాలను, ఆకాంక్షలను తన పాటల్లో పొందుపరిచారని చెప్పారు. రైతుల కన్నీళ్లు, కూలీల కష్టం, విద్యార్థుల ఆవేశం, మహిళల ఆత్మగౌరవం.. ఇవన్నీ అందెశ్రీ పాటల్లో

12

ఢిల్లీలో రాహుల్ గాంధీతో మహేష్ గౌడ్ కీలక భేటీ!

అరగంట పాటు సాగిన సమావేశం

- 13 లేదా 14న హైదరాబాద్‌కు రాహుల్ రాక
- భారత్ సమ్మిట్, గిగ్ వర్కర్ల సమావేశంలో పాల్గొననున్న అగ్రనేత



తెలంగాణ స్టేట్ బ్యూరో, నవంబర్ 10 (విజన్ ఆంధ్ర):

తెలంగాణ కాంగ్రెస్‌లో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఢిల్లీలో లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సమావేశం ముగిసింది. దాదాపు అరగంట పాటు జరిగిన ఈ సమావేశంలో తెలంగాణ రాజకీయాలు, పార్టీ సంస్థాగత కార్యక్రమాలు, ఓబీసీ ప్రాతినిధ్యం, రాహుల్ గాంధీ హైదరాబాద్ పర్యటన తదితర అంశాలపై విస్తృతంగా చర్చ జరిగింది. సమావేశం అనంతరం మహేష్ కుమార్ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ కీలక విషయాలను వెల్లడించారు. రాహుల్ గాంధీ త్వరలోనే హైదరాబాద్‌కు రానున్నారని, 13 లేదా 14 తేదీల్లో ఆయన పర్యటన ఉండే అవకాశం

02



ఓయూ వీసీ ప్రభుత్వానికి గులాంగిరి చేస్తున్నారు

- ఉస్మానియా యూనివర్సిటీలో నాన్ టీచింగ్ ఉద్యోగుల మహాధర్నా
- సిబ్బంది ఆందోళనకు మద్దతు తెలిపిన కవిత
- వర్సిటీకి ఇస్తానన్న రూ.1,000 కోట్ల నిధులు ఎక్కడంటూ ప్రభుత్వాన్ని నిలదీసిన వైనం

హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ అడ్మినిస్ట్రేటివ్ భవనం ఎదుట నాన్‌టీచింగ్ ఉద్యోగులు చేపట్టిన మహాధర్నాకు తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మంగళవారం మద్దతు తెలిపారు. కాంట్రాక్ట్ సిబ్బంది సర్వీసుల

02

ఏపీపీఎస్సీ గ్రూప్-2 సమగ్ర నోటిఫికేషన్ విడుదల..

- గతంలో ప్రకటించిన 686 పోస్టులను 720కి పైగా పెంచిన ఏపీపీఎస్సీ
- డిసెంబర్ 11 వరకు ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ
- 2027 ఫిబ్రవరి 21న గ్రూప్-2 స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహణ
- ఏదైనా డిగ్రీ అర్హతతో దరఖాస్తు చేసుకునే అవకాశం

02



కీచక వైస్ ఛాన్సలర్ మీద చర్యలు తీసుకోవాలి!

- రాజేంద్రనగర్ అగ్రికల్చర్ యూనివర్సిటీలో లైంగిక వేధింపుల కలకలం
- బాధిత మహిళా ప్రొఫెసర్లను పరామర్శించిన సబితా, సత్యవతి, సునీత - పట్లోళ్ల కార్తీక్ రెడ్డి అరెస్ట్



తెలంగాణ స్టేట్ బ్యూరో, నవంబర్ 10 (విజన్ ఆంధ్ర):

రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో లైంగిక వేధింపుల వ్యవహారం తీవ్ర కలకలం రేపుతోంది. మహిళా ప్రొఫెసర్లను వేధించిన కీచక వైస్ ఛాన్సలర్ అల్లాడ్ జానయ్యపై చర్యలు తీసుకోవాలని ప్రొఫెసర్లు, విద్యార్థులు, విద్యార్థినులు పెద్ద ఎత్తున నిరసన తెలుపుతున్నారు. బాధిత మహిళా ప్రొఫెసర్లను

02

ఏపీ కేబినెట్ కీలక నిర్ణయాలు.. భారీ ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్!

రూ.35 వేల కోట్లకు పైగా పెట్టుబడులకు ఆమోదం.. పారిశ్రామిక పాలసీలకు కేబినెట్ ఓకే



- చంద్రబాబు అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం
- ఏఐ డేటా సెంటర్లు, బ్యాటరీ తయారీ ప్లాంట్లకు ఆమోదం
- కొత్త పరిశ్రమలతో వేలాది మందికి ఉపాధి అవకాశాలు
- రోడ్డు భద్రతకు ప్రత్యేక డైరెక్టరేట్.. తిరుమలలో కొత్త పోస్టులు

అమరావతి సంవంబర్ 10 (విజన్ ఆంధ్ర):

ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామికాభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి కల్పనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన వెలగపూడి సచివాలయంలో జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో పలు పారిశ్రామిక ప్రాజెక్టులు, కొత్త విధానాలు, పరిపాలనాపరమైన ప్రతిపాదనలకు ఆమోదముద్ర పడింది. ఏఐ, రోబోటిక్స్, సెమీ కండక్టర్లు, బ్యాటరీ తయారీ వంటి రంగాలకు ప్రాధాన్యమిస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్రంలో ఆధునిక సాంకేతిక రంగాలను ప్రోత్సహించేందుకు AVGC-XR

02

ఏపీ కేబినెట్ కీలక నిర్ణయాలు..

భారీ ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్!

పాలసీ 202631, ఏపీ రోబోటిక్స్‌ఫిజికల్ ఏఐ విధానాలకు మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సెమీ కండక్టర్ పాలసీ సవరణలకు కూడా ఆమోదం తెలిపింది. ఈ విధానాల ద్వారా రాష్ట్రానికి మరిన్ని పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు సాంకేతిక రంగాల్లో ఉపాధి అవకాశాలను పెంచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. విశాఖపట్నం జిల్లా భీమునిపట్నంలో ఏఎం ఇంటెలిజెన్స్ ఆధ్వర్యంలో రూ.31,387 కోట్ల పెట్టుబడితో 512 మెగావాట్ల గ్రీన్ ఇంటిగ్రేటెడ్ ఏఐ డేటా సెంటర్ ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. నాయుడుపేటలో రూ.4,000.20 కోట్లతో కార్బన్ కాస్మో బ్యాటరీ మెటీరియల్ తయారీ ప్లాంట్ ఏర్పాటుకు కూడా ఆమోదం తెలిపింది. భోగాపురంలో రిలయన్స్ గిగా స్కేల్ ఏఐ డేటా సెంటర్ ఏర్పాటుకు 25 ఎకరాల భూమి కేటాయింపునకు, తిరుపతిలో డిక్సన్ టెక్నాలజీస్‌కు స్థలం కేటాయించేందుకు ఆమోదం లభించింది. ఈ ప్రాజెక్టులు రాష్ట్రంలో సాంకేతిక, ఎలక్ట్రానిక్స్ తయారీ రంగాల అభివృద్ధికి దోహదపడనున్నాయి. అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో రూ.570.20 కోట్లతో ఈపాక్ యూనిట్ ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు ద్వారా 2,565 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. పశ్చిమ గోదావరి జిల్లాలో రూ.236.92 కోట్లతో రవళి స్పిన్నర్స్ పరిశ్రమ విస్తరణకు అనుమతి ఇచ్చింది. ఈ విస్తరణతో 1,569 మందికి ఉపాధి లభించనుంది. అలాగే నక్కపల్లి బల్క్ డ్రగ్ పార్కులో హెటిరో సంస్థలకు 173.82 ఎకరాల భూమి కేటాయింపునకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఔషధ తయారీ రంగంలో పెట్టుబడులను ప్రోత్సహించేందుకు ఈ నిర్ణయం ప్రాధాన్యం సంతరించుకుంది. రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాల నివారణ, రహదారి భద్రత చర్యల సమన్వయం కోసం డీజీపీ ఆధ్వర్యంలో ప్రత్యేక డైరెక్టరేట్ ఏర్పాటు చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. తిరుమల శ్రీవారి ఆలయంలో 'ప్రధాన సన్నిధి యాదవ', 'సన్నిధి యాదవ' పోస్టుల సృష్టికి కూడా ఆమోదం తెలిపింది. థర్మల్ విద్యుత్‌కు ప్రత్యామ్నాయంగా ఎస్ఎంఆర్ సాంకేతికతతో అణు విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు ఉన్న సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని నిర్ణయించింది. రాజధాని ప్రాంతంలోని శాఖమూరులో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు భూ కేటాయింపునకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

ఓయూ వీసీ ప్రభుత్వానికి గులాంగిరి చేస్తున్నారు

క్రమబద్ధీకరణతో పాటు దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగులు చేపట్టిన ఈ ఆందోళనలో ఆమె స్వయంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులను ఉద్దేశించి ప్రసంగించిన కవిత... రాష్ట్ర ప్రభుత్వంపై, విశ్వవిద్యాలయ ఉపకులపతి (వీసీ)పై తీవ్ర విమర్శలు గుప్పించారు. విశ్వవిద్యాలయ పరిపాలన తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ... ఉద్యోగులను ఓయూ వీసీ పట్టించుకోవడం లేదని, ఆయన ప్రభుత్వానికి గులాంగిరి చేస్తున్నారంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. దాదాపు ఏడాదిన్నర కాలంగా ఉద్యోగులు నిరసనలు తెలుపుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం అన్యాయమని కవిత అన్నారు. సుమారు 35 ఏళ్లుగా ఉద్యోగులు వివిధ ప్రభుత్వాల హయాంలో దోపిడీకి గురవుతున్నారని పేర్కొన్నారు. నాన్‌టీచింగ్ సిబ్బంది పోరాటానికి పర్మినెంట్ ఉద్యోగులు కూడా మద్దతు తెలపడాన్ని ఆమె ప్రశంసించారు. విశ్వవిద్యాలయానికి ఛాన్సలర్‌గా వ్యవహరిస్తున్న రాష్ట్ర గవర్నర్ వెంటనే ఈ అంశంలో జోక్యం చేసుకోవాలని, నాన్‌టీచింగ్ సిబ్బంది న్యాయమైన సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా ఆదేశాలు ఇవ్వాలని కవిత డిమాండ్ చేశారు. ఉస్మానియా యూనివర్సిటీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇస్తానన్న రూ.వెయ్యి కోట్లు ఎక్కడ? అని ఆమె సూటిగా ప్రశ్నించారు. నిధులు మంజూరు చేస్తామని ప్రకటించి నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు ఎలాంటి పురోగతి లేదని తప్పుబట్టారు.

ఏపీపీఎస్సీ గ్రూప్-2 సమగ్ర నోటిఫికేషన్ విడుదల..

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (APPSC) గ్రూప్-2 ఉద్యోగాల భర్తీకి సంబంధించిన సమగ్ర నోటిఫికేషన్‌ను అధికారికంగా విడుదల చేసింది. రాష్ట్రంలో ఉద్యోగార్థులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ నోటిఫికేషన్‌లో ఖాళీల సంఖ్య పెరగడం విశేషం. గతంలో వెలువడిన సంక్షిప్త ప్రకటనలో 686 పోస్టులను పేర్కొనగా, తాజా నివేదికల ప్రకారం ఈ ఖాళీల సంఖ్య 720కి చేరింది. వీటిలో 471 ఎగ్జిక్యూటివ్ పోస్టులు, 249 నాన్-ఎగ్జిక్యూటివ్ పోస్టులు ఉన్నాయి. ఈ నోటిఫికేషన్‌లో కీలకమైన పలు కీలక శాఖల్లోని ఉద్యోగాలను భర్తీ చేయనున్నారు. వీటిలో ప్రధానంగా 203 డిప్యూటీ తహసీల్దార్ పోస్టులు, 176 డిప్యూటీ మండల పరిషత్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (Dy. MPDO) పోస్టులు ఉన్నాయి. అలాగే 91 సీనియర్ అకౌంటెంట్, 80 అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ (ASO) పోస్టులతో పాటు జూనియర్ అకౌంటెంట్, జీఎస్టీ ఆఫీసర్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ వంటి ఇతర ముఖ్యమైన పోస్టులు కూడా ఉన్నాయి.


విద్యార్హతలు మరియు ఎంపిక విధానం:

గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదైనా బ్యాచిలర్స్ డిగ్రీ (గ్రాడ్యుయేషన్) పూర్తి చేసిన అభ్యర్థులు ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. అయితే కొన్ని నిర్దిష్ట పోస్టులకు ప్రత్యేక విద్యార్హతలు లేదా నిబంధనలు వర్తిస్తాయి. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో భాగంగా తొలుత స్క్రీనింగ్ టెస్ట్ (ప్రిలిమ్స్) నిర్వహిస్తారు. అందులో అర్హత సాధించిన వారికి మెయిన్స్ పరీక్ష ఉంటుంది. ఆ తర్వాత పోస్టుల స్వభావాన్ని బట్టి కంప్యూటర్ ప్రొఫిషియెన్సీ టెస్ట్ (CPT), చివరగా సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఆధారంగా తుది ఎంపిక పూర్తి చేస్తారు.

ముఖ్యమైన తేదీలు:

ఈ నోటిఫికేషన్‌కు సంబంధించిన ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. దరఖాస్తుల సమర్పణకు చివరి తేదీగా 2026 డిసెంబర్ 11 రాత్రి 11:59 గంటల వరకు గడువు నిర్ణయించారు. అనంతరం అభ్యర్థులకు స్క్రీనింగ్ టెస్ట్‌ను 2027 ఫిబ్రవరి 21న ఆఫ్‌లైన్ (OMR) పద్ధతిలో నిర్వహించనున్నట్లు సమాచారం. అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ ద్వారా తమ దరఖాస్తులను సమర్పించాల్సి ఉంటుంది. పోస్టుల వారీగా ఖాళీల వివరాలు, వయోపరిమితి, రిజర్వేషన్లు, పే-స్కేల్స్, పరీక్షా సిలబస్ మరియు ఇతర పూర్తి మార్గదర్శకాల కోసం ఏపీపీఎస్సీ అధికారిక వెబ్‌సైట్ (psc.ap.gov.in) లోని సమగ్ర నోటిఫికేషన్‌ను పరిశీలించాలని అధికారులు సూచిస్తున్నారు.

కరీంనగర్‌కు నితిన్ నబీన్..



తెలంగాణలో పార్టీని మరింత బలోపేతం చేసి, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం దక్కించుకోవడమే లక్ష్యంగా బీజేపీ దూకుడు పెంచుతోంది. ఇందులో భాగంగా జాతీయ నాయకుల రాష్ట్ర పర్యటనలకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. తాజాగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ కరీంనగర్ పర్యటన ఖరారైంది. ఈ నెల 18న ఆయన నగరానికి రానున్నారు. ఈ సందర్భంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ నేతృత్వంలో లక్ష మందితో భారీ పాదయాత్ర నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 'సర్' అంశంపై కాంగ్రెస్, ఇండీ కూటమి పార్టీలు రాజ్యాంగ సంస్థలపై తప్పుడు ప్రచారం చేస్తున్నాయని బీజేపీ ఆరోపిస్తోంది. ఈ ప్రచారాన్ని తిప్పికొట్టి ప్రజలకు వాస్తవాలు వివరించడమే లక్ష్యంగా పాదయాత్ర చేపడుతున్నట్లు పార్టీ నేతలు చెబుతున్నారు. నితిన్ నబీన్ తొలిసారి కరీంనగర్‌కు వస్తుండటంతో కార్యక్రమాన్ని భారీ స్థాయిలో నిర్వహించాలని బండి సంజయ్ నిర్ణయించారు. గాంధీ సర్కిల్, వైశ్య భవన్ నుంచి టవర్ సర్కిల్ మీదుగా కమాన్ వరకు పాదయాత్ర సాగనుంది. ఇందులో నితిన్ నబీన్‌తో పాటు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు, బండి సంజయ్ పాల్గొననున్నారు. ఈ కార్యక్రమానికి లక్ష మంది హాజరయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు బండి సంజయ్ వెల్లడించారు. దేశవ్యాప్తంగా కరీంనగర్ పేరు మారుమోగేలా మహా పాదయాత్ర నిర్వహిస్తామని చెప్పారు. పాదయాత్ర ఏర్పాట్లపై చర్చించేందుకు బండి సంజయ్ కరీంనగర్ ఎంపీ కార్యాలయంలో పార్లమెంట్ నియోజకవర్గ కోర్ కమిటీ నేతలతో సమావేశమయ్యారు. బూత్ స్థాయి నుంచి మండలాల వారీగా సమావేశాలు నిర్వహించి కార్యకర్తలను సమీకరించాలని సూచించారు. మీడియా, సామాజిక మాధ్యమాల ద్వారా కార్యక్రమానికి విస్తృత ప్రచారం కల్పించాలని కోరారు.

మీ నేపథ్యాన్ని మరిచిపోవద్దు..

ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు, నిర్లక్ష్యం చాలా మందికి కష్టనష్టాలు మిగిల్చిందని విమర్శించారు.

టీజీపీఎస్సీని యూపీఎస్సీ స్థాయికి తీసుకెళ్లాం..

నేను ముఖ్యమంత్రిగా కాగానే టీజీపీఎస్సీ ప్రక్షాళన చేయాలని నిర్ణయించానని సీఎం చెప్పారు. గతంలో టీజీపీఎస్సీలో సభ్యులుగా పనిచేసిన వారిలో ఆర్ఎంపీ డాక్టర్లు లాంటి వాళ్లు ఉన్నారని, ఉన్నత స్థాయిలో నియామకాలు చేపట్టే బోర్డులో అవగాహన లేని వాళ్లను, కింది స్థాయి వాళ్లను నియమించడమే అప్పటి ప్రభుత్వ తప్పని అన్నారు. రాజకీయ పునరావాసానికి కేంద్రంగా టీజీపీఎస్సీ తయారైందని మండిపడ్డారు. యూపీఎస్సీ తీసుకుంటున్న విధానాలను అధ్యయనం చేసి టీజీపీఎస్సీని ఆ తరహాలో రూపొందించామని, యూపీఎస్సీకి స్వయంగా వెళ్లి అక్కడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నామని చెప్పారు. టీజీపీఎస్సీ మొదటి ఛైర్మన్‌గా రిటైర్డ్ డీజీ మహేందర్ రెడ్డిని నియమించామని, పోటీ పరీక్షలు నిర్వహించడంలో అనుభవం కలిగిన వాళ్లను, చిత్తశుద్ధి ఉన్నవాళ్లను బోర్డు సభ్యులుగా నియమించామని తెలిపారు. భవిష్యత్తు నిర్ణయించే వ్యవస్థపై విశ్వాసం సన్నగిల్లితే నియామకాల పట్ల అపనమ్మకం ఏర్పడుతుందని అన్నారు. ప్రస్తుతం సీనియర్ ఐఏఎస్ అధికారి వెంకటేశంను టీజీపీఎస్సీ ఛైర్మన్‌గా నియమించామని, ఈ ప్రాంతం, విద్యార్థుల పట్ల చిత్తశుద్ధి ఉన్న అధికారి ఛైర్మన్‌గా ఉంటే భవిష్యత్తు బాగుంటుందని చెప్పారు.

పారదర్శకతకు నిదర్శనం - ఉపాధి హామీ కూలీ పిల్లలు కూడా డీఎస్పీలు!

563 పోస్టులకు నోటిఫికేషన్ ఇస్తే 562 మంది జాయిన్ అయ్యారని, 112 మంది డీఎస్పీల నియామకం చాలా పెద్ద విషయమని సీఎం అన్నారు. నియామకాల్లో ప్రభుత్వం పూర్తి స్థాయిలో పారదర్శకతను పాటించిందని, ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న వారి పిల్లలు కూడా ఈ నియామకాల్లో ఉన్నారంటే మా పారదర్శకత అర్థమవుతుందని చెప్పారు. ఈ నియామకాల పట్ల కొందరు పని గట్టుకుని ఎన్నో ఆరోపణలు చేశారని, అవినీతి జరిగిందని, కోట్ల రూపాయలు చేతులు మారాయని ఆరోపించారని అన్నారు. రాజకీయ ఆరోపణలు మాకు కొత్త కాదని, కానీ మీకు చాలా ఆందోళన కలిగించాయని, ఈ అవకాశం కూడా జారిపోతుందేమోనని ఆందోళన చెందారని చెప్పారు. డీఎస్పీల తరపున సుప్రీంకోర్టు వరకు రాష్ట్ర ప్రభుత్వం వెళ్లిందని, నిష్ణాతులైన న్యాయవాదులతో వాదించి డీఎస్పీల నియామకాన్ని సాధించామని తెలిపారు.

రెండో అధ్యాయం మొదలైంది - వచ్చే 30 ఏళ్లు మీ చేతుల్లోనే!

నాలెడ్జ్, చిత్తశుద్ధి, అంకితభావం మీ అందరినీ ఇక్కడ కూర్చోబెట్టిందని సీఎం అన్నారు. మీ నేపథ్యాన్ని మరిచిపోవద్దని, మన నేపథ్యాన్ని మరిచిపోతే మన హోదాకు న్యాయం చేయలేమని హితవు పలికారు. మీరు ఏ ఉద్దేశంతో పోలీస్ శాఖలో చేరారో దాన్ని మరిచిపోవద్దని సూచించారు. లక్ష్యం పెట్టుకుని ప్రయత్నం చేస్తే అసాధ్యం ఏదీ ఉండదని, లక్ష్యం పెట్టుకుని కష్టపడ్డారు కాబట్టే ఈ హోదాకు చేరుకున్నారని అన్నారు. ఇక ముందు రెండో అధ్యాయం ప్రారంభం కాబోతుందని, ఇది మీ జీవితాల్లో చాలా ముఖ్యమని చెప్పారు. వచ్చే ముప్పై ఏళ్లు తెలంగాణ భవిష్యత్తును ఏ దిశగా నడిపించాలో అది మీ చేతుల్లోనే ఉందని అన్నారు. ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు ఉండే పెద్ద హోదా మీదని, మీ ఫీడ్‌బ్యాక్, నిర్ణయాలే ప్రభుత్వ పనితీరుకు గీటురాయిగా మారుతుందని చెప్పారు. మీరు నిటారుగా నిలబడి డ్యూటీ చేస్తే రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ట పెరుగుతుందని, నిజాయితీగా డ్యూటీ చేయాలని, బాధ్యతను గుర్తించి పనిచేయాలని ప్రభుత్వం కోరుకుంటోందని అన్నారు.

తల్లిదండ్రుల కంటే ముందు గుర్తుకు వచ్చేది పోలీసు!

ప్రజలకు ఏ సమస్య వచ్చినా మొదట గుర్తుకు వచ్చేది పోలీసు వ్యవస్థ అని, తల్లిదండ్రుల కంటే ముందుగా గుర్తుకు వచ్చేది పోలీసు వ్యవస్థ అని సీఎం అన్నారు. సర్వం ఒడ్డి శాంతిభద్రతలను కాపాడారు కాబట్టే ప్రజలు పోలీసు వ్యవస్థను విశ్వసిస్తున్నారని, అనేక మంది సీనియర్ పోలీసు అధికారులు నిక్కచ్చిగా పనిచేయడం వల్లనే సమాజంలో పోలీసు వ్యవస్థకు గుర్తింపు వచ్చిందని, దాన్ని మీరు కాపాడాలని సూచించారు. మీ హోదాను ఎంత జాగ్రత్తగా ప్రజల కోసం వాడితే అంత బాగుంటుందని, అతిగా, వ్యక్తిగత ప్రయోజనాల కోసం వాడితే దీర్ఘకాలికంగా ఉండదని హెచ్చరించారు. సమస్యను పరిష్కరించాలంటే ఆ సమస్యను ముందుగా అర్థం చేసుకోవాలని, సమస్యను వినాలి, అర్థం చేసుకోవాలని, అప్పుడే పరిష్కారం పెద్ద విషయం కాదని చెప్పారు. సమస్య పరిష్కారంలో సమయం, రిసోర్సెస్, టెక్నికల్ సపోర్ట్ అత్యంత ముఖ్యమని అన్నారు. బాధితులు వచ్చినప్పుడు కూర్చోబెట్టి వాళ్లతో ప్రేమపూర్వకంగా మాట్లాడాలని, అప్పుడే సమస్య అర్థం చేసుకోగలుగుతారని సూచించారు.

సైబర్ క్రైమ్, డ్రగ్స్ పై యుద్ధం - ఈగల్ ఫోర్స్!

రాజ్యాంగం రాసే సమయంలో దేశంలో అత్యాచారాలు, హత్యలు, ఆహార కొరత అనే మూడు సమస్యలు అధికంగా ఉన్నాయని, పీవీ నరసింహారావు ఓపెన్ ఎకానమీ తీసుకువచ్చిన తర్వాత ప్రపంచంలోని అన్ని సమస్యలు మన దగ్గరకు వచ్చాయని సీఎం అన్నారు. అందులో ముఖ్యమైనవి సైబర్ క్రైమ్ అని, వ్యక్తుల మధ్య పరిచయం లేకుండా, కనీసం చూడకుండా సర్వం దోచుకునే పరిస్థితి సైబర్ క్రైమ్‌లో ఉందని చెప్పారు. ఇప్పుడు నేరాలు, వాటి ప్రవృత్తి మారిపోయాయని అన్నారు. డ్రగ్స్ సరఫరాను నియంత్రించడంలో యుద్ధవీరులను ఇచ్చిన పంజాబ్ కూడా విఫలమైందని, సిక్కు రెజిమెంట్‌లో ఇప్పుడు సిక్కులు లేరని, బ్రిటీషర్లు కూడా భయపడిన సిక్కు జాతి డ్రగ్స్ విషయంలో నిర్వీర్యమైందని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రగ్స్ నియంత్రణలో ఈగల్ ఫోర్స్‌ను తీసుకువచ్చి అత్యంత కఠినంగా వ్యవహరిస్తున్నామని, ఫుడ్ సేఫ్టీ, ట్రాఫిక్, డ్రగ్స్ కంట్రోల్, సైబర్ క్రైమ్‌ల కోసం సరికొత్త వ్యవస్థలను తీసుకువచ్చామని చెప్పారు. అవసరమైతే నూతన డీఎస్పీలను అధ్యయనం కోసం విదేశాలకు పంపిస్తామని, విద్యా ప్రమాణాల అధ్యయనం కోసం ప్రభుత్వ ఉపాధ్యాయులను విదేశాలకు పంపిస్తున్నామని తెలిపారు. డీఎస్పీలు తమ ఫిట్‌నెస్‌పై మరింత ఫోకస్ పెట్టాలని, గరం, నరం, బేషరమ్ పరిస్థితి మీకు

చలి వచ్చేసింది..

పిల్లల జాగ్రత్త మర్చిపోవద్దు!

చిన్నారుల శరీరం పెద్దలతో పోలిస్తే చాలా సున్నితంగా ఉంటుంది. వాతావరణంలో చిన్న మార్పు వచ్చినా వారిపై వెంటనే ప్రభావం చూపుతుంది. పగలు ఎండ, రాత్రి చలి.. ఉదయం మంచు, సాయంత్రం చల్లని గాలి.. ఇలాంటి హెచ్చుతగ్గుల వల్ల పిల్లల శరీర ఉష్ణోగ్రత అదుపు తప్పి, రోగనిరోధక శక్తి తగ్గుతుంది. దీంతో వైరస్‌లు, బ్యాక్టీరియా సులభంగా దాడి చేస్తాయి. ముఖ్యంగా 5 ఏళ్ల లోపు చిన్నారులు, స్కూలుకు వెళ్లే పిల్లలు, అప్పటికే ఆస్తమా, అలర్జీ, సైనస్ సమస్యలు ఉన్న పిల్లలు ఈ కాలంలో మరింత జాగ్రత్తగా ఉండాలని వైద్యులు చెబుతున్నారు. ప్రస్తుతం ఆసుపత్రులకు వస్తున్న చిన్నారుల్లో ఎక్కువ మంది జలుబు, దగ్గు, జ్వరంతోనే వస్తున్నారని వైద్యులు చెబుతున్నారు. పిల్లలు ఒకరి నుంచి మరొకరికి సులభంగా వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయి. స్కూళ్లలో, ట్యూషన్లలో, ఆట స్థలాల్లో కలిసి ఉండటం వల్ల ఇన్ఫెక్షన్లు వేగంగా వ్యాపిస్తున్నాయి. అందుకే వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచిస్తున్నారు. చేతులు తరచూ సబ్బుతో కడుక్కోవడం, దగ్గేటప్పుడు, తుమ్మేటప్పుడు నోటికి రుమాలు అడ్డుపెట్టుకోవడం, జలుబు ఉన్న పిల్లలకు దూరంగా ఉండటం వంటి అలవాట్లు నేర్పించాలని చెబుతున్నారు.

చల్లని పదార్థాలకు దూరంగా ఉండండి

చలికాలంలో పిల్లలకు కేక్స్, ఐస్‌క్రీమ్‌లు, కూల్‌డ్రింక్స్, చాక్లెట్లు, చిప్స్, బర్గర్లు, పిజ్జాలు వంటి జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉంచాలని వైద్యులు గట్టిగా సూచిస్తున్నారు. ఈ ఆహార పదార్థాలు పిల్లల గొంతులో ఇన్ఫెక్షన్‌కు కారణమవుతాయి. చల్లని ఐస్‌క్రీమ్‌లు, కూల్‌డ్రింక్స్ తాగడం వల్ల గొంతులో మంట, దగ్గు, జలుబు వెంటనే వస్తాయి. జంక్‌ఫుడ్‌లో పోషకాలు ఉండవు. పైగా అధికంగా నూనె, ఉప్పు, చక్కెర ఉండటం వల్ల పిల్లల్లో రోగనిరోధక శక్తి తగ్గి, తరచూ అనారోగ్యానికి గురవుతారని హెచ్చరిస్తున్నారు. బయట అమ్మే పానీపూరి, ఫ్రైడ్ వస్తువులు, బజ్జీలు వంటివి కూడా ఈ కాలంలో ప్రమాదకరమని చెబుతున్నారు. వాటికి బదులుగా పిల్లలకు ఇంట్లో తయారుచేసిన వేడి వేడి ఆహారం, పౌష్టికాహారం అందించాలని వైద్యులు సూచిస్తున్నారు. ఉదయం పూట వేడి పాలు, గుడ్డు, ఇడ్లీ, దోశ, ఉప్మా వంటి టిఫిన్‌లు, మధ్యాహ్నం అన్నం, పప్పు, ఆకుకూరలు, కూరగాయలు, సాయంత్రం సూప్‌లు, పండ్లు ఇవ్వడం మంచిదని చెబుతున్నారు. బాదం, జీడిపప్పు, కిస్మిస్, వాల్‌నట్స్ వంటి డ్రై ఫ్రూట్స్, నానబెట్టిన బాదం పిల్లల మెదడు, శరీర ఎదుగుదలకు ఎంతో మేలు చేస్తాయని చెబుతున్నారు. జామ, బత్తాయి, ఆరెంజ్, దానిమ్మ, యాపిల్ వంటి పండ్లలో విటమిన్-సి ఎక్కువగా ఉండి జలుబును తట్టుకునే శక్తిని పెంచుతాయని సూచిస్తున్నారు.

వెచ్చని దుస్తులు తప్పనిసరి

చలికాలంలో పిల్లలకు తగినంత వెచ్చని దుస్తులు వేయడం చాలా ముఖ్యమని వైద్యులు చెబుతున్నారు. ఉదయం స్కూలుకు వెళ్లేటప్పుడు స్వెటర్లు, జాకెట్లు, టోపీలు, సాక్సులు, చేతి గ్లౌజులు తప్పనిసరిగా వేయాలని, చల్లని గాలిలో తలను కప్పి ఉంచాలని సూచిస్తున్నారు. చల్లని నీటితో స్నానం చేయించవద్దని, గోరువెచ్చని నీటితోనే స్నానం చేయించాలని, స్నానం తర్వాత తలను, శరీరాన్ని సరిగా తుడిచి వెంటనే వెచ్చని దుస్తులు వేయాలని చెబుతున్నారు. రాత్రి పడుకునేటప్పుడు కూడా వెచ్చని దుప్పటి కప్పాలని, ఫ్యాన్ వేగాన్ని తగ్గించాలని, చల్లని గాలి నేరుగా శరీరానికి తగలకుండా చూడాలని సూచిస్తున్నారు.

అలాగే పిల్లలకు రోజూ గోరువెచ్చని నీరు తాగించాలని, చల్లని నీరు, ఫ్రిజ్‌లో పెట్టిన పదార్థాలు ఇవ్వవద్దని చెబుతున్నారు. పిల్లల గదిని శుభ్రంగా ఉంచాలని, దుమ్ము, ధూళి లేకుండా చూడాలని, దోమలు, క్రిములు రాకుండా జాగ్రత్త పడాలని సూచిస్తున్నారు. పిల్లలకు తగినంత నిద్ర ఉండేలా చూడాలని, రాత్రి త్వరగా పడుకోబెట్టి ఉదయం త్వరగా లేపే అలవాటు చేయాలని చెబుతున్నారు. మంచి నిద్ర వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుందని వైద్యులు చెబుతున్నారు.

ఈ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుడిని కలవండి

పిల్లల్లో 2-3 రోజులకు మించి జ్వరం, తీవ్రమైన దగ్గు, వేగంగా శ్వాస తీసుకోవడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, ఛాతీలో గురగుర శబ్దం, ఆహారం తీసుకోకపోవడం, నిరంతరం నీరసంగా ఉండటం, పెదవులు నీలంగా మారడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని వైద్యులు సూచిస్తున్నారు. ఇంట్లోనే మందులు వాడి నిర్లక్ష్యం చేయవద్దని, ముఖ్యంగా యాంటీబయాటిక్స్, దగ్గు మందులను వైద్యుల సలహా లేకుండా వాడవద్దని గట్టిగా హెచ్చరిస్తున్నారు. చిన్నారులకు సొంత వైద్యం చాలా ప్రమాదకరమని చెబుతున్నారు. తల్లిదండ్రులే పిల్లలకు రోల్ మోడల్ కావాలని, వారు ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుంటేనే పిల్లలు కూడా అలవాటు చేసుకుంటారని వైద్యులు చెబుతున్నారు. పిల్లలకు చిన్నప్పటి నుంచే మంచి ఆహారపు అలవాట్లు, పరిశుభ్రత అలవాట్లు నేర్పిస్తే భవిష్యత్తులో ఆరోగ్యంగా ఉంటారని సూచిస్తున్నారు. జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉంచండి.. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు నేర్పించండి.. చిన్నారుల ఆరోగ్యాన్ని కాపాడండి అని వైద్యులు పిలుపునిచ్చారు.

ఢిల్లీలో రాహుల్ గాంధీతో మహేష్ గౌడ్ కీలక భేటీ!

ఉందని తెలిపారు. భారత్ సమ్మిట్‌లో పాల్గొనడంతో పాటు గిగ్ వర్కర్లతో ప్రత్యేక సమావేశంలో పాల్గొననున్నారని చెప్పారు. హైదరాబాద్‌లో గిగ్ వర్కర్లతో సమావేశం పెట్టాలని స్వయంగా రాహుల్ గాంధీ కోరారని మహేష్ గౌడ్ తెలిపారు.

ఓబీసీలపై ప్రత్యేక చర్చ

ఈ సమావేశంలో ఓబీసీల విషయంలో, ఓబీసీ ప్రాతినిధ్యంపై ప్రత్యేకంగా చర్చ జరిగిందని మహేష్ గౌడ్ వెల్లడించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఓబీసీల కోసం చేపడుతున్న కార్యక్రమాలు, బీసీలకు ఇస్తున్న ప్రాధాన్యత, రిజర్వేషన్ల అంశంపై రాహుల్ గాంధీకి వివరించినట్లు చెప్పారు. తెలంగాణలో కాంగ్రెస్ పీసీసీ అమలు చేస్తున్న కార్యక్రమాలపై రాహుల్ గాంధీకి నివేదిక ఇచ్చానని తెలిపారు. సంస్థాగతంగా తెలంగాణలో కాంగ్రెస్ బూత్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు చేపట్టిన కార్యక్రమాలను రాహుల్‌కు వివరించామని చెప్పారు.

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని బూత్ స్థాయి నుంచి బలోపేతం చేసేందుకు చేపడుతున్న చర్యలు, సభ్యత్వ నమోదు, కమిటీల ఏర్పాటు, ప్రజల్లోకి వెళ్లే కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే తీరుపై రాహుల్ గాంధీ సంతృప్తి వ్యక్తం చేసినట్లు మహేష్ గౌడ్ తెలిపారు. ముఖ్యంగా తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే గిగ్ యాక్ట్ తీసుకువచ్చిన విషయాన్ని రాహుల్ గాంధీకి వివరించామని, దేశంలోనే తొలిసారిగా తెలంగాణలో గిగ్ వర్కర్ల కోసం చట్టం చేయడం గర్వకారణమని చెప్పారు. గిగ్ వర్కర్ల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న చర్యలను రాహుల్ గాంధీ ప్రశంసించినట్లు తెలిపారు.

13 లేదా 14న హైదరాబాద్‌కు రాహుల్

రాహుల్ గాంధీ 13 లేదా 14 తేదీల్లో హైదరాబాద్‌కు రానున్నారని మహేష్ గౌడ్ ప్రకటించారు. భారత్ సమ్మిట్‌తో పాటు గిగ్ వర్కర్ల సమావేశంలో పాల్గొననున్నారని చెప్పారు. హైదరాబాద్‌లో గిగ్ వర్కర్లతో సమావేశం పెట్టాలని రాహుల్ గాంధీ స్వయంగా కోరారని, దానికి అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. గిగ్ వర్కర్ల సమస్యలు, వారి హక్కులు, సంక్షేమంపై రాహుల్ గాంధీ నేరుగా వారితో మాట్లాడనున్నారని చెప్పారు. అలాగే హైదరాబాద్‌లో ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా సభ, మెగా బీసీ ర్యాలీకి రాహుల్ గాంధీని రావాలని కోరినట్లు మహేష్ గౌడ్ తెలిపారు. ఇంకా తేదీలు ఖరారు కాలేదని, త్వరలోనే తేదీలను ఖరారు చేస్తామని చెప్పారు. ఎస్ఐఆర్ వల్ల సామాన్య ప్రజలకు జరుగుతున్న ఇబ్బందులు, ఓటర్ల జాబితా నుంచి పేర్లు తొలగింపు వంటి అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ సభ ఉపయోగపడుతుందని చెప్పారు. బీసీల హక్కుల కోసం మెగా బీసీ ర్యాలీని భారీ ఎత్తున నిర్వహించాలని యోచిస్తున్నట్లు తెలిపారు.

నేతల మధ్య గొడవలపై చర్చ లేదు..

తెలంగాణ కాంగ్రెస్‌లో నేతల మధ్య గొడవలు, పంచాయితీలపై రాహుల్‌తో చర్చ జరగలేదని మహేష్ గౌడ్ స్పష్టం చేశారు. ఆ వ్యవహారం పార్టీ సంస్థాగత ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ చూసుకుంటారని తెలిపారు. మీడియా ప్యానలిస్టుల జాబితా వివాదంపై రాహుల్‌తో చర్చ జరిగిందా? అని విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆ వ్యవహారం వేణుగోపాల్ పరిధిలో ఉందని, ఆయనే చూసుకుంటారని సమాధానమిచ్చారు. దీంతో ఆ వివాదంపై రాహుల్ స్థాయిలో చర్చ జరగలేదని స్పష్టమైంది.

నవంబర్‌లో నామినేటెడ్ పోస్టుల భర్తీ పూర్తి

నవంబర్ నెలలోనే నామినేటెడ్ పోస్టుల భర్తీ పూర్తి చేస్తామని మహేష్ గౌడ్ ప్రకటించారు. చాలా కాలంగా ఎదురుచూస్తున్న నాయకులకు, కార్యకర్తలకు ఈ నెలలోనే పదవులు దక్కనున్నాయని చెప్పారు. పార్టీ కోసం కష్టపడిన వారికి, అన్ని వర్గాల వారికి న్యాయం జరిగేలా నామినేటెడ్ పోస్టులను భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆశావాహుల్లో మళ్లీ ఆశలు చిగురించాయి.

సోనియా గాంధీ ఆత్మకథపై ప్రత్యేక కార్యక్రమం

సోనియా గాంధీ ఆత్మకథను స్వాగతిస్తున్నామని మహేష్ గౌడ్ తెలిపారు. తెలంగాణలో సోనియా గాంధీ ఆత్మకథ పుస్తకంపై ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. తెలంగాణ ఇచ్చిన తల్లిగా సోనియా గాంధీకి తెలంగాణ ప్రజల హృదయాల్లో ప్రత్యేక స్థానం ఉందని, ఆమె ఆత్మకథను తెలంగాణ ప్రజలకు చేరువ చేయడం తమ బాధ్యత అని చెప్పారు. ఆ పుస్తక ఆవిష్కరణ, చర్చా కార్యక్రమాలను రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తామని తెలిపారు.

మొత్తంగా ఢిల్లీలో జరిగిన ఈ సమావేశం తెలంగాణ కాంగ్రెస్‌కు ఎంతో కీలకమైనదని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. రాహుల్ గాంధీ హైదరాబాద్ పర్యటన, భారత్ సమ్మిట్, గిగ్ వర్కర్ల సమావేశం, ఎస్ఐఆర్ వ్యతిరేక సభ, మెగా బీసీ ర్యాలీ, నామినేటెడ్ పోస్టుల భర్తీ వంటి అంశాలతో రానున్న రోజుల్లో తెలంగాణలో కాంగ్రెస్ మరింత దూకుడుగా ముందుకు వెళ్లనుందని మహేష్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు.

చామల వర్సెస్ మహేష్ గౌడ్.. కాంగ్రెస్‌లో ముదురుతున్న ముసలం!

సమన్వయ కమిటీ ఉన్నారు. ప్యానలిస్టుల జాబితాలో ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, అద్దంకి దయాకర్, వేముల వీరేశం, బీర్ల ఐలయ్య, డాక్టర్ జె. రామచంద్ర నాయక్, బల్మూరి వెంకట్‌లతో పాటు ఎమ్మెల్యేలు డాక్టర్ సి. వంశీకృష్ణ, టి. రామ్మోహన్ రెడ్డి, యెన్నం శ్రీనివాస్ రెడ్డి, ఎం.ఎస్. రాజ్ ఠాకూర్, మేడిపల్లి సత్యం, కూచుకుళ్ల రాజేశ్ రెడ్డి ఉన్నారు. అలాగే మాజీ విప్ అనిల్ ఈరవత్రి, మాజీ ఛైర్మన్ టి. బెల్లయ్య నాయక్, సామ రామ్మోహన్ రెడ్డి, కార్పొరేషన్ ఛైర్మన్ డాక్టర్ ఎస్. చరణ్ కౌశిక్ యాదవ్‌లను ప్యానలిస్టులుగా నియమించారు. మీడియా కోఆర్డినేటర్లుగా తుమ్మల పద్మ, మొగిలి సత్యారెడ్డిలను నియమించారు. ప్రస్తుతం కొనసాగుతున్న అధికార ప్రతినిధులందరినీ సీనియర్ అధికార ప్రతినిధులుగా పదోన్నతి కల్పిస్తున్నట్లు కూడా చామల ప్రకటించారు. పార్టీ చేపడుతున్న కార్యక్రమాలు, ప్రభుత్వం ప్రజల కోసం చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడమే ఈ నియామకాల లక్ష్యమని చామల వర్గం చెబుతోంది. త్వరలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పార్టీ గొంతుకను మరింత దూకుడుగా వినిపించాలనే ఉద్దేశంతోనే ఈ జాబితాను విడుదల చేసినట్లు తెలుస్తోంది. అన్ని సామాజిక వర్గాలకు, అన్ని ప్రాంతాల నాయకులకు, మహిళా నేతలకు, యువతకు, సీనియర్లకు, న్యాయవాదులకు, తెలంగాణ ఉద్యమకారులకు ఈ జాబితాలో చోటు దక్కినట్లు చామల వర్గం చెబుతోంది.

కొన్ని గంటల్లోనే మహేష్ గౌడ్ స్టే.. ఎందుకు?

అయితే ఈ జాబితా విడుదలైన కొన్ని గంటల్లోనే టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్ హుటాహుటిన స్టే విధించారు. చామల కిరణ్ కుమార్ రెడ్డి ఇచ్చిన ఈ నియామకాల జాబితాను నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ నియామకాల ప్రక్రియపై స్పష్టత వచ్చే వరకు, తదుపరి ఉత్తర్వులు జారీ చేసేదాకా జాబితాను నిలిపివేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. పార్టీలోని అంతర్గత సమన్వయం, సీనియర్ నేతల అభిప్రాయాల సేకరణ మరియు ఇతర సాంకేతిక కారణాల దృష్ట్యానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు టీపీసీసీ వర్గాలు చెబుతున్నాయి.

కానీ అసలు కారణం వేరే ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సీనియర్ లీడర్లతో సంప్రదించకుండా జాబితా విడుదల చేశారన్న అసంతృప్తి వ్యక్తమైంది. జాబితాలో పేర్లు చేర్చడంలో కొందరు సీనియర్లను పక్కన పెట్టారని, కొందరు నమ్మకస్తులకు చోటు దక్కలేదని, మరికొందరికి అన్యాయం జరిగిందని ఫిర్యాదులు వెల్లువెత్తినట్లు తెలుస్తోంది. దీంతోనే మహేష్ గౌడ్ స్టే విధించక తప్పలేదని గాంధీభవన్ వర్గాలు చెబుతున్నాయి.

మరోవైపు అధికారం ఎవరిది? అన్న ప్రశ్న కూడా తెరపైకి వచ్చింది. మీడియా విభాగం ఛైర్మన్‌గా చామలకు జాబితా విడుదల చేసే అధికారం ఉందా? లేక టీపీసీసీ అధ్యక్షుడి ఆమోదం తప్పనిసరా? అన్న దానిపై కూడా చర్చ జరుగుతోంది. చామల తన ఉత్తర్వుల్లో మహేష్ గౌడ్, పవన్ ఖేరా ఆదేశాల మేరకే నియామకాలు చేశానని చెప్పినా, మహేష్ గౌడ్ మాత్రం తనకు తెలియకుండా జాబితా వచ్చిందన్నట్లుగా వ్యవహరించడం చర్చనీయాంశమైంది.

అధిష్ఠానం వైపు చూపు

ఈ పరిణామంతో తెలంగాణ కాంగ్రెస్‌లో మీడియా విభాగం నియామకాలు హాట్ టాపిక్‌గా మారాయి. చామలకు షాక్.. మహేష్ గౌడ్ ఎం చామల కిరణ్ అంటూ రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇప్పటికే స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న వేళ పార్టీ గొంతుకను బలంగా వినిపించాల్సిన సమయంలో ఈ వివాదం పార్టీకి ఇబ్బందిగా మారిందని కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

త్వరలోనే అధిష్ఠానం పరిశీలన అనంతరం పూర్తిస్థాయి కొత్త జాబితాను ప్రకటించనున్నట్లు సమాచారం. ఢిల్లీ పెద్దలు జోక్యం చేసుకుని ఇద్దరి మధ్య సయోధ్య కుదిర్చి, సవరించిన జాబితాను విడుదల చేస్తారని పార్టీ నేతలు ఆశిస్తున్నారు. లేకపోతే ఈ వివాదం మరింత ముదిరి పార్టీలో వర్గ పోరుకు దారితీసే ప్రమాదం ఉందని సీనియర్లు హెచ్చరిస్తున్నారు.

అధిష్ఠానం జోక్యం చేసుకుని ఈ వివాదానికి తెరదించుతుందా? లేక మరింత ముదురుతుందా? అన్నది ఇప్పుడు అందరిలో ఆసక్తికరంగా మారింది.

కీచక వైస్ ఛాన్సలర్ మీద చర్యలు తీసుకోవాలి!

పరామర్శించడానికి వెళ్లిన బీఆర్ఎస్ నేతలను పోలీసులు అడ్డుకోవడం, అరెస్ట్ చేయడంతో ఈ వ్యవహారం మరింత ముదిరింది.

బాధితులను పరామర్శించిన బీఆర్ఎస్ మహిళా నేతలు లైంగిక వేధింపులకు గురైన బాధిత మహిళా ప్రొఫెసర్లను పరామర్శించడానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి రాజేంద్రనగర్ అగ్రికల్చర్ యూనివర్సిటీకి వెళ్లారు. బాధితులను కలిసి వారికి ధైర్యం చెప్పారు. వారి నుంచి జరిగిన వేధింపుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు అండగా ఉంటామని, న్యాయం జరిగే వరకు పోరాడుతామని హామీ ఇచ్చారు.

ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ, ఒక విశ్వవిద్యాలయానికి వైస్ ఛాన్సలర్‌గా ఉండి మహిళా ప్రొఫెసర్లను లైంగికంగా వేధించడం సిగ్గుచేటని మండిపడ్డారు. విద్యను బోధించాల్సిన చోటే ఇలాంటి ఘటనలు జరగడం దురదృష్టకరమని అన్నారు. బాధిత మహిళలు ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయడం అభినందనీయమని, వారికి పూర్తి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. వైస్ ఛాన్సలర్ అల్దాస్ జానయ్యను వెంటనే పదవి నుంచి తొలగించి, ఆయనపై క్రిమినల్ కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ, తెలంగాణలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. యూనివర్సిటీలోనే మహిళా ప్రొఫెసర్లకు రక్షణ లేకపోతే సామాన్య మహిళల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బాధితులకు న్యాయం చేయాలని, నిందితుడిని కాపాడే ప్రయత్నం చేయవద్దని హెచ్చరించారు.

ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, విద్యార్థినులు, మహిళా ప్రొఫెసర్లు భయం లేకుండా యూనివర్సిటీకి రావాలంటే కీచక వైస్ ఛాన్సలర్‌పై కఠిన చర్యలు తప్పనిసరని అన్నారు. విచారణ పేరుతో కాలయాపన చేయకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ప్రొఫెసర్లు, విద్యార్థుల నిరసన

మహిళా ప్రొఫెసర్లను వేధించిన వైస్ ఛాన్సలర్ అల్దాస్ జానయ్యపై చర్యలు తీసుకోవాలని ప్రొఫెసర్లు, విద్యార్థులు, విద్యార్థినులు పెద్ద ఎత్తున నిరసన తెలుపుతున్నారు. యూనివర్సిటీ ప్రాంగణంలో ఆందోళన చేపట్టారు. "కీచక వీసీ డౌన్ డౌన్", "బాధితులకు న్యాయం చేయాలి" అంటూ నినాదాలు చేశారు. వీసీని వెంటనే తొలగించాలని, ఆయనపై విచారణ జరిపి శిక్షించాలని డిమాండ్ చేశారు.

విద్యార్థినులు మాట్లాడుతూ, యూనివర్సిటీలో తమకు భద్రత లేదని, వీసీ వ్యవహారంతో భయంతో చదువుకోవాల్సిన పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రొఫెసర్లకే రక్షణ లేకపోతే తమ పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోవాలని కోరారు.

పట్లోళ్ల కార్తీక్ రెడ్డి అరెస్ట్ - ఉద్రిక్తత

ఇదే సమయంలో బాధిత మహిళా ప్రొఫెసర్లను పరామర్శించడానికి వెళ్లిన బీఆర్ఎస్ నేత పట్లోళ్ల కార్తీక్ రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారు. యూనివర్సిటీలోకి వెళ్లకుండా పోలీసులు అడ్డుకోవడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. పోలీసుల తీరుపై కార్తీక్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

మహిళా ప్రొఫెసర్లను వేధించిన వైస్ ఛాన్సలర్ అల్దాస్ జానయ్యపై చర్యలు తీసుకోకుండా రేవంత్ రెడ్డి ప్రభుత్వం మద్దతుగా ఉందని కార్తీక్ రెడ్డి ఆరోపించారు. నిందితుడిని కాపాడటానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, బాధితులకు అండగా వెళ్లిన వారిని అరెస్ట్ చేయడం దారుణమని మండిపడ్డారు. బాధితులను పరామర్శించడం నేరమా? అని ప్రశ్నించారు. ప్రభుత్వం ఇలా నిందితుడికి అండగా నిలబడితే ప్రజలు సహించరని హెచ్చరించారు.

రేవంత్ ప్రభుత్వంపై విమర్శలు

ఈ ఘటనతో రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వీసీపై ఫిర్యాదులు వచ్చి చాలా రోజులైనా చర్యలు తీసుకోకపోవడం వెనుక ప్రభుత్వ అండదండలు ఉన్నాయా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బాధిత మహిళలు ధైర్యం చేసి ఫిర్యాదు చేసినా, ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని బీఆర్ఎస్ నేతలు విమర్శిస్తున్నారు. వెంటనే వీసీని సస్పెండ్ చేసి, స్వతంత్ర విచారణ జరిపించాలని, బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

మొత్తంగా రాజేంద్రనగర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ వ్యవహారం ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వం ఈ విషయంలో ఎలా స్పందిస్తుందో, కీచక వీసీపై చర్యలు తీసుకుంటుందో లేదో అన్నది ఆసక్తికరంగా మారింది.

సంపాదకీయం

ఎల్ నినో కేంద్రసాయం ఎక్కడ

ప్రకృతి ప్రకోపిస్తే పంటలు ఎండిపోతాయి. వర్షాలు ముఖం చాటేస్తే పొలాలు బీళ్లుగా మారతాయి. కానీ ప్రకృతి వైపరీత్యాల కంటే ప్రభుత్వాల నిర్లక్ష్యం రైతులను ఎక్కువగా కుంగదీస్తుంది. ఎల్ నినో పరిస్థితులు దేశవ్యాప్తంగా వ్యవసాయ రంగాన్ని తీవ్ర ప్రభావితం చేస్తున్నాయి. పంటలు చేతికందక రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతుంటే, పాలకుల ప్రకటనలు మాత్రం కాగితాలకే పరి మితమవుతున్నాయనే విమర్శలున్నాయి.రైతు నష్టపోతున్నాడు. వ్యవసాయం సంక్షోభంలో పడుతోంది. పేద కుటుంబాల బడ్జెట్ తలకిందులవుతోంది. అయి నా కేంద్రం నుంచి స్పష్టమైన కార్యాచరణ ఎక్కడ? రైతు కన్నీటికి విలువ లేదా? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. తెలంగాణలో 365 మండలాలను కరు వు ప్రాంతాలుగా ప్రకటించి రూ.30 వేల కోట్ల ఆర్థిక సాయం కేంద్రాన్ని కోరినట్లు నివేదికలు వెల్లడించాయి. ఆంధ్రప్రదేశ్‌లో 388 మండలాలు కరువు ఎదుర్కొంటున్నాయి. కర్ణాటకలో 57.93 లక్షల హెక్టా ర్లలో పంట నష్టం జరిగినట్లు ఆ రాష్ట్ర ప్రభుత్వం అంచనా. నష్టం విలువ రూ.62 వేల కోట్లకు పైగా ఉంటుందని పేర్కొంది. ఇవి ఆయా రాష్ట్రాలు వెల్లడించిన గణాంకాలు మాత్రమే. దేశంలోని అన్ని రాష్ట్రాల కు సంబంధించిన నష్టాలపై ఒకే విధమైన తుది కేంద్ర నివేదిక ప్రజల ముందుకు రావాల్సి ఉంది. రాష్ట్రాలు నిధులు కోరడం, కేంద్రం పరిశీలిస్తామని చెప్పడం, అధికారులు నివేదికలు తయారు చేయడం.. ఈ తంతు పూర్తయ్యేసరికి రైతు చేతిలో మిగిలేది అప్పులేనా? నష్టాన్ని అంచనా వేయ డానికే నెలలు పడితే రైతు కుటుంబాలు ఎలా జీవించాలి?రైతు ఎకరాకు పెట్టే పెట్టుబడి రోజురోజుకూ పెరుగుతోంది. విత్తనాలు, ఎరువు లు, పురుగుమందులు, కూలీల ఖర్చులు ఆకాశాన్నంటుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో పంట పూర్తిగా నష్టపోతే ఇచ్చే పరి మిత పరిహారం రైతును ఎలా ఆదుకుంటుంది? నష్టాన్ని అంచనా వేసే విధానం పారదర్శకంగా ఉండాలి. భూమి యజమానులకే కాకుండా కౌలు రైతులకు కూడా న్యాయం జరగాలి. పంటల బీమా పరిహారాన్ని నెలల తరబడి పెండింగ్లో పెట్ట కుండా తక్షణమే చెల్లించాలి. వ్యవసాయ రుణాల వసూళ్లను వాయిదా వేయాలి. తదుపరి పంట సాగుకు పెట్టుబడి సాయం అందించాలి. కరువు ప్రభావం పొలాలకే పరిమితం కాదు. పంటల దిగుబడులు తగ్గితే ఆహార ధాన్యాల ధరలు పెరిగే ప్రమాదం ఉంది. రైతు ఆదాయం పడిపోతుంది. కూలీలకు పనులు తగ్గుతాయి. చివరకు పేద, మధ్యతరగతి కుటుంబాల వంటగదిపై ధరల భారం పడుతుంది. ప్రస్తుతం ప్రజా పంపి ణీ వ్యవస్థ ద్వారా అర్హులైన కుటుంబాలకు బియ్యం, గోధుమలు ఉచితంగా అందుతున్నాయి. కానీ బియ్యం ఒక్కటే కుటుంబా నికి సంపూర్ణ ఆహార భద్రత కల్పించదు. కందిపప్పు, శనగపప్పు, వంటనూనె, చక్కెర వంటి నిత్యావసర సరుకులను కూడా సబ్సిడీపై అందించాల్సిన అవసరం ఉంది. కేంద్రం కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రకటించిన ప్రణాళికలు క్షేత్రస్థా యిలో అమలుకావాలి. నీటి సంరక్షణ, చెరువుల పునరుద్ధరణ, కాలువల మరమ్మతులు, భూగర్భ జలాల పెంపునకు ప్రత్యేక నిధులు కేటాయించాలి. తక్కువ నీటితో పండే పంటలకు ప్రోత్సాహం ఇవ్వాలి. విత్తనాలు, ఎరువులు అందించాలి. పశువులకు పశుగ్రాసం,గ్రామాలకు తాగునీరు అందిం చాలి. ఉపాధి పనులను విస్తరించి గ్రామీణ కుటుంబాలకు ఆదాయం కల్పించాలి. కరువు అనేది ఏ ఒక్క పార్టీకి, ఏ ఒక్క రాష్ట్రానికి సంబంధించిన సమస్య కాదు. ఇది దేశ ఆహార భద్రతకు సంబంధించిన సంక్షోభం. ఇలాంటి సమయంలో రాజకీయ విభేదాలు, నిధుల విషయంలో వివక్ష, అధికారుల కాలయాపనకు తావుండకూడదు. కేంద్రం రాష్ట్రాలకు అండగా నిలవాలి. రాష్ట్రాలు రైతులకు నేరుగా సహా యం అందించాలి. ప్రకటించిన పథకాల అమలుపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి.ప్రకృతి వైపరీత్యాలను ఆపడం ప్రభుత్వాల చేతుల్లో ఉండకపోవచ్చు. కానీ వాటి ప్రభావంతో ప్రజలు ఆకలితో అలమటించకుండా చూడటం మాత్రం ప్రభుత్వాల చేతుల్లోనే ఉంది. రైతు పంట పండిస్తేనే దేశానికి అన్నం అందుతుంది. రైతు నష్టపోతే దేశ ఆర్థిక వ్యవస్థపైనా ప్రభావం పడుతుంది. ప్రకటనలతో రైతు కడుపు నిండదు.అప్పులు తీరవు. సమీక్షలతో పం టలు పండవు. కేంద్రం ఇప్పటికైనా మేల్కొనాలి. నష్టాలపై సమగ్ర నివేదిక విడుదల చేయాలి. తక్షణమే నిధులు మంజూరు చేయాలి. రైతులకు న్యాయమైన పరిహారం అందించాలి. పేదలకు నిత్యావసర సరుకులను సబ్సిడీ ధరలకు పంపిణీ చేయాలి. రైతు కన్నీరు తుడవని పాలనకు ప్రజల సమస్యలు పరిష్కరించిన ఘనత ఎలా దక్కుతుంది? రైతుకు భరోసా.. పేదలకు ఆహార భద్రత.. ఇవి హామీలు కాదు, ప్రభుత్వాలు నెరవేర్చాల్సిన కనీస బాధ్యతలు.

ఇది ప్రజల విజయం మాధవరం కృష్ణారావు

నేటి నుంచే కార్తీక మాసం ప్రారంభం

కెపిహెచ్బి లోఎట్టకేలకు ప్రభుత్వ పాఠశాల నిర్మాణానికి 2.39 ఎకరాల భూమి విద్యాశాఖకు బదిలీ,కలెక్టర్ మనూ చౌదరికి కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మాజీ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నవంబర్ 10 (విజన్ ఆంధ్ర బ్యూరో):కూకట్‌పల్లి నియోజకవర్గంలోని కేపీహెచ్‌బీ డివిజన్ రమ్యా గ్రౌండ్ వద్ద ప్రభుత్వ పాఠశాల నిర్మాణం కోసం గతంలో కేటాయించిన 2.39 ఎకరాల స్థలాన్ని ఎట్టకేలకు హౌసింగ్ బోర్డు నుంచి విద్యాశాఖకు బదిలీ చేయడంతో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మంగళవారం మాజీ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు తో కలిసి కలెక్టర్ మనూ చౌదరి ని మర్యాదపూర్వకంగా కలిసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.సుమారు మూడు సంవత్సరాల క్రితం రమ్యా గ్రౌండ్ వద్ద ప్రభుత్వ పాఠశాల నిర్మాణానికి చర్యలు చేపట్టి పాఠశాల పునాదులు కూడా వేయడం జరిగింది. అయితే అనంతరం ప్రభుత్వం మారడంతో వివిధ కారణాల వల్ల పాఠశాల నిర్మాణ ప్రక్రియ ముందుకు సాగలేదు. ముఖ్యంగా హౌసింగ్ బోర్డు పరిధిలో ఉన్న 2.39 ఎకరాల స్థలాన్ని విద్యాశాఖకు బదిలీ చేయడంలో జాప్యం జరగడంతో పాఠశాల నిర్మాణానికి ఆటంకం ఏర్పడింది.ఈ నేపథ్యంలో నియోజకవర్గంలోని పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన ప్రభుత్వ విద్య అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, పలుమార్లు కలెక్టర్‌తో పాటు సంబంధిత ప్రభుత్వ అధికారులను కలిసి ఈ సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలకు ఎంతో ఉపయోగపడే ప్రభుత్వ పాఠశాల నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని నిరంతరం కృషి చేశారు. స్థానిక ప్రజలు, కాలనీ వాసులు సైతం ఈ అంశంపై తమ పోరాటాన్ని కొనసాగించారు.ఎట్టకేలకు ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా, ప్రజల పోరాటం, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు నిరంతర కృషి ఫలితంగా 2.39 ఎకరాల స్థలాన్ని హౌసింగ్ బోర్డు నుంచి విద్యాశాఖకు బదిలీ చేయడం జరిగింది. దీంతో ప్రభుత్వ పాఠశాల నిర్మాణానికి మార్గం సుగమమైంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కలెక్టర్ మనూ చౌదరి ని పాఠశాల నిర్మాణ పనులను వీలైనంత త్వరగా ప్రారంభించి, విద్యార్థులకు అందుబాటులోకి వచ్చేలా చూడాలని, పాఠశాలను కూడా త్వరితగతిన ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ప్రత్యేకంగా కోరారు.ఈ సందర్భంగా సానుకూలంగా స్పందించి భూమి బదిలీ ప్రక్రియ పూర్తయ్యేలా సహకరించిన కలెక్టర్ మనూ చౌదరి కి ఎమ్మెల్యే కృష్ణారావు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ప్రభుత్వానికి కూడా ధన్యవాదాలు తెలియజేశారు. నియోజకవర్గంలోని పలు కాలనీలకు సంబంధించిన భూములను 22-ఏ నిబంధనల పరిధిలో ఉంచడం వల్ల స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా విద్యార్థులు ఉన్నత చదువుల కోసం విద్యా రుణాలు పొందడంలో, ఇతర అవసరాలకు బ్యాంకు రుణాలు తీసుకోవడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు. ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఆయా భూముల అంశాన్ని కూడా పరిశీలించి తగిన పరిష్కారం చూపాలని కలెక్టర్‌ను కోరారు.ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ సభ్యులు,నాగేశ్వర రావు, కేపీహెచ్‌బీ డివిజన్ అధ్యక్షులు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కీసరగుట్టకు పోటెత్తిన భక్తులుశ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి దర్శనం కోసం భారీగా తరలివచ్చిన భక్తులుహరహర మహాదేవ.. శంభో శంకర నామస్మరణతో మార్మోగిన కీసరగుట్టమేడ్చల్? మల్కాజిగిరి నేటి నుంచి పవిత్ర కార్తీక మాసం ప్రారంభం కావడంతో ప్రముఖ శైవక్షేత్రమైన కీసరగుట్టకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామివారిని దర్శించుకునేందుకు తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయానికి చేరుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకుంటున్నారు.కార్తీక మాసం ప్రారంభం కావడంతో కీసరగుట్టలో భక్తి సందడి నెలకొంది. స్వామివారి దర్శనం కోసం భక్తులు బారులు తీరగా, ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడుతోంది. హరహర మహాదేవ.. శంభో శంకర నామస్మరణతో కీసరగుట్ట మార్మోగుతోంది. కార్తీక మాసం ఆరంభంతో శివభక్తులతో కీసరగుట్ట ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

ఢిల్లీతో పోటీపడుతున్న భాగ్యనగరం!

రాయపూడి నుండి మంగళగిరి వరకు రియల్ ఎస్టేట్ 'గోల్డ్ రష్'

హైదరాబాద్, నవంబరు 10, ఒకప్పుడు ప్రశాంత వాతావరణానికి చిరునామాగా ఉన్న హైదరాబాద్ నగరం ఇప్పుడు వాయు కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి అవుతోంది. దేశ రాజధాని ఢిల్లీని తలపించేలా గాలి నాణ్యత అత్యంత ప్రమాదకర స్థాయికి పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది. నగరం మొత్తం మీద ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 410గా నమోదవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఈ స్థాయి కాలుష్యం ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.తాజా గణాంకాల ప్రకారం.. గాలిలోని అతి సూక్ష్మ ధూళి కణాలైన పీఎం 2.5 స్థాయిలు సురక్షిత పరిమితి అయిన 60 మైక్రోగ్రాములకు బదులుగా 278 మైక్రోగ్రాములుగా నమోదయ్యాయి. అదేవిధంగా పీఎం 10 పరిమితి 100 మైక్రోగ్రాములు కాగా, ప్రస్తుతం 326 మైక్రోగ్రాములుగా ఉంది. ఇది సాధారణం కంటే దాదాపు మూడు నుంచి నాలుగు రెట్లు అధికం. ఈ స్థాయిలో కాలుష్యం కొనసాగితే ప్రజల ఆరోగ్యంపై, ముఖ్యంగా పిల్లలు, వృద్ధులపై తీవ్ర ప్రభావం పడుతుందని పర్యావరణ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.నగరంలోని అన్ని ప్రాంతాల్లో కాలుష్య తీవ్రత ఉన్నప్పటికీ, ముఖ్యంగా పశ్చిమ హైదరాబాద్‌లోని ఐటీ కారిడార్ పరిధిలో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. డిఫెన్స్ కాలనీలో ఎఖిఏ ఏకంగా 685గా రికార్డయింది. శేరిలింగంపల్లిలో 666, మణికొండలో 602, యాంబియన్స్ ఫోర్ట్‌లో 596, ఎన్‌బీటీ నగర్‌లో 582గా కాలుష్య సూచీ నమోదైంది. ఈ ప్రాంతాలు కాలుష్య హాట్‌స్పాట్‌లుగా మారుతుండటం స్థానికులను భయాందోళనలకు గురిచేస్తోంది.హైదరాబాద్‌లో గాలి నాణ్యత ఇంతలా క్షీణించడానికి ప్రధాన కారణాలు పెరిగిన వాహనాల రద్దీ, అదుపులేని నిర్మాణ కార్యకలాపాలు, రోడ్లపై పేరుకుపోయిన దుమ్ముధూళి, పారిశ్రామిక ఉద్గారాలేనని అధికారులు భావిస్తున్నారు. ముఖ్యంగా ఐటీ కారిడార్‌లో నిరంతరాయంగా సాగే నిర్మాణాలు, వాహనాల రాకపోకలు కాలుష్య తీవ్రతను మరింత పెంచుతున్నాయి.ఈ నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టాలని పౌరులు, పర్యావరణవేత్తలు కోరుతున్నారు. రోడ్లను నీటితో శుభ్రపరచడం, నిర్మాణ ప్రాంతాల్లో దుమ్ము లేవకుండా చర్యలు తీసుకోవడం, వాహన కాలుష్య తనిఖీలను కఠినతరం చేయడం వంటివి వెంటనే ప్రారంభించాలని సూచిస్తున్నారు. లేకపోతే హైదరాబాద్ కూడా ఢిల్లీ లాగా గ్యాస్ ఛాంబర్‌గా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

విజయవాడ, నవంబరు 10, ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణం వేగవంతం కావడం, మౌలిక వసతుల కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించడంతో రాజధాని ప్రాంతంలో రియల్ ఎస్టేట్ రంగానికి ఊహించని క్రేజ్ వచ్చింది. ముఖ్యంగా ఐటీ కంపెనీల ఏర్పాటు,ప్రభుత్వ పరిపాలనా భవనాలు, నాలెడ్జ్ హబ్‌ల పనులు తుది దశకు చేరుకుంటుండటంతో అమరావతి పరిసర ప్రాంతాల్లో భూములు, స్థిరాస్తుల కొనుగోలుకు విపరీతమైన పోటీ నెలకొంది. రాయపూడి, తుళ్లూరు, మంగళగిరి , విజయవాడ-గుంటూరు జాతీయ రహదారి పొడవునా ఓపెన్ ప్లాట్లు, విల్లాల విక్రయాలు జోరందుకున్నాయి.రాజధాని కోర్ సీఆర్డీఏ పరిధిలోని రాయపూడి, తుళ్లూరు ప్రాంతాల్లో లేఅవుట్ల నిర్మాణం, ప్రైవేటు గృహ నిర్మాణ ప్రాజెక్టులు వేగంగా ఊపందుకున్నాయి. ఒకప్పుడు మందగించిన రియల్ ఎస్టేట్ వ్యాపారం ఇప్పుడు సరికొత్త రికార్డులను నమోదు చేస్తోంది. ప్రధాన రహదారుల అనుసంధానం, నిరంతర విద్యుత్, డ్రైనేజీ , తాగునీటి వ్యవస్థల పనులు క్షేత్రస్థాయిలో వేగంగా జరుగుతుండటంతో పెట్టుబడిదారులు, సామాన్య గృహ కొనుగోలుదారులు అమరావతిలో ప్లాట్లు కొనుగోలు చేయడానికి అమితాసక్తి చూపుతున్నారు.మరోవైపు మంగళగిరి రీజియన్ నుంచి విజయవాడ-గుంటూరు హైవే బెల్ట్ ఆస్తి కొనుగోలుదారులకు ప్రధాన కేంద్రంగా మారింది. ఐటీ పార్కులు, అంతర్జాతీయ విద్యా సంస్థలు, ఆసుపత్రులు సమీపంలోనే ఉండటంతో ఈ ప్రాంతంలో గేటెడ్ కమ్యూనిటీ విల్లాలు,లగ్జరీ అపార్ట్‌మెంట్ ప్రాజెక్టులకు డిమాండ్ ఆకాశాన్నంటింది. జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న ఓపెన్ ప్లాట్ల ధరలు గత కొద్ది నెలల్లోనే గణనీయంగా పెరిగాయి. రాబోయే కాలంలో ఈ కారిడార్ ఐటీ , వాణిజ్య రంగానికి ప్రధాన హబ్‌గా మారనుండటంతో పెట్టుబడులపై అధిక రాబడి వస్తుందని బయ్యర్లు భావిస్తున్నారు.మొత్తానికి ఆంధ్రప్రదేశ్ నూతన రాజధాని నగరం రూపుదిద్దుకుంటున్న వేళ.. అమరావతి పరిసర ప్రాంతాలు రియల్ ఎస్టేట్ హబ్‌గా సరికొత్త కాంతిని సంతరించుకున్నాయి. స్థానిక బిల్డర్లు, జాతీయ స్థాయి డెవలపర్లు భారీ ప్రాజెక్టులతో అమరావతిలో ల్యాండ్ అవుతుండటంతో ఉపాధి అవకాశాలు కూడా విపరీతంగా పెరుగుతున్నాయి. రాయపూడి నుండి మంగళగిరి వరకు సాగుతున్న ఈ రియల్ ఎస్టేట్ 'గోల్డ్ రష్' రాబోయే రోజుల్లో తెలుగు రాష్ట్రాల్లోనే అత్యంత ఖరీదైన, ఆధునికమైన మైక్రో మార్కెట్‌గా రూపాంతరం చెందడం ఖాయంగా కనిపిస్తోంది!

కృష్ణా జలాల్లో తెలంగాణ న్యాయమైన వాటా సాధించాలి

సుప్రీంకోర్టులో సమర్థంగా వాదనలు వినిపించాలి
డిండి, అచ్చంపేట పనులు వేగవంతం చేయాలి
నీటిపారుదల శాఖపై ముఖ్యమంత్రి సమీక్ష



కృష్ణా జలాల పంపిణీలో తెలంగాణకు రావాల్సిన న్యాయమైన వాటాను సాధించేందుకు సుప్రీంకోర్టులో సమర్థంగా వాదనలు వినిపించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఏపీతో వివాదం ఉన్న అన్ని అంశాలపై అవసరమైన ఆధారాలను సమర్పించాలని సూచించారు. ఈ నెల 18వ తేదీ తర్వాత సుప్రీంకోర్టులో కేసు విచారణకు రానున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి న్యాయ నిపుణులతో చర్చించారు.

ఎంసీఆర్ హెచ్ఆర్డీ బోధి పెవిలియన్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నీటిపారుదల శాఖపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, నీటిపారుదల సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, సీఎంఓ కార్యదర్శి మాణిక్ రాజ్, నీటిపారుదల శాఖ కార్యదర్శి ఈ. శ్రీధర్, జాయింట్ సెక్రటరీ కె. శ్రీనివాస్, అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సి.ఎస్. వైద్యనాథన్, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.డిండి, అచ్చంపేట ఎత్తిపోతల పథకాల పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఇంజనీర్లను ఆదేశించారు. ఇప్పటికే నిర్ణయించిన ప్రకారం ఏదుల నుంచి డిండి, అచ్చంపేట పథకాలకు నీటిని అందించాలని స్పష్టం చేశారు. ఈ రెండు పథకాలకు అవసరమైన 0.6 టీఎంసీల నీటిని నార్లపూర్ నుంచి ఏదుల వరకు తరలించేందుకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని సూచించారు. ఎక్కడ టన్నెల్, ఎక్కడ కాలువ అవసరమో గుర్తించి సమగ్ర ప్రాజెక్టు నివేదిక సిద్ధం చేయాలని, అందుకు అనుగుణంగా పనులు ప్రారంభించాలని ఆదేశించారు.కాళేశ్వరం అదనపు టీఎంసీ పనుల విషయంలో తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని ముఖ్యమంత్రి అధికారులను హెచ్చరించారు. గత ప్రభుత్వం చేసిన తప్పులు పునరావృతం కాకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న రెండు టీఎంసీల నీటినే తరలించలేని పరిస్థితి ఉన్నందున అదనపు టీఎంసీ పనుల విషయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ముందుగా సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుల పురోగతిని పరిశీలించి, భూసేకరణ చేపట్టాలని ఆదేశించారు. కేంద్ర జల సంఘం నుంచి అవసరమైన అన్ని అనుమతులు పొందడంతో పాటు సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) సిద్ధం చేసుకోవాలని అధికారులకు సూచించారు.

ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే బియ్యం విక్రయించాలి

అదనపు కలెక్టర్ వినోద్ కుమార్



ఎవనపర్తి జిల్లా ప్రతినిధి, నవంబర్ 10 (విజన్ ఆంధ్ర)వనపర్తి జిల్లాలో ప్రజలకు నాణ్యమైన బియ్యాన్ని ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు అందుబాటులో ఉంచేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టినట్లు అదనపు కలెక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. ఎమంగళవారం పెబ్బేరు మండలంలోని సాయి గణేష్ రైస్ మిల్ వద్ద, వనపర్తి మండలంలోని నాగవరం గ్రామంలో ఉన్న శ్రీ రాఘవేంద్ర ఇండస్ట్రీస్ వద్ద ఏర్పాటు చేసిన రెండు నూతన బియ్యం విక్రయ కేంద్రాలను ఆయన లాంఛనంగా ప్రారంభించారు.ఎఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలకు నాణ్యమైన బియ్యాన్ని సరసమైన ధరలకు అందించాలనే సత్సంకల్పంతోనే ఈ విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. బియ్యం వ్యాపారులు ఎవరూ కూడా ప్రభుత్వం నిర్దేశించిన ధరల కంటే అధిక ధరలకు విక్రయించి ప్రజలపై భారం మోపరాదని స్పష్టం చేశారు. ప్రతి ఒక్క వ్యాపారి ప్రభుత్వ నిబంధనలను, మార్గదర్శకాలను విధిగా పాటించాలని హెచ్చరించారు. ఎప్రజలకు ఎటువంటి అంతరాయం లేకుండా ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే బియ్యం అందేలా సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, కేంద్రాల నిర్వహణ సజావుగా సాగేలా చూడాలని ఆదేశించారు. నిబంధనలను ఉల్లంఘించి ఎవరైనా అధిక ధరలకు బియ్యం విక్రయిస్తే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎమరోవైపు, జిల్లాలో ఏర్పాటు చేసిన ఈ విక్రయ కేంద్రాల ద్వారా ప్రస్తుతం బియ్యం పంపిణీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాఫీగా కొనసాగుతోందని, ప్రజలందరూ ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు తెలిపారు.

హైదరాబాద్ వాసుల తాగునీటి కష్టాలకు చెక్?

హోటల్స్ కు మద్దతుగా ఓవైసీ

హైదరాబాద్, నవంబర్ 10, ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో సింగూరు?మంజీరా జలవనరుల్లో నీటి లభ్యత తగ్గుతున్న దృష్ట్యా హైదరాబాద్ నగరానికి తాగునీటి సరఫరాలో అంతరాయాలు తలెత్తకుండా జలమండలి ముందస్తు చర్యలను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా రోజుకు 40 మిలియన్ గ్యాలన్ల (ఎంజీడీ) గోదావరి అదనపు జలాలను నగరానికి తరలించేందుకు ఘన్‌పూర్ వద్ద చేపడుతున్న పైప్‌లైన్ అనుసంధాన పనులను జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి పరిశీలించారు. ఈ నందర్భంగా వనుల వురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నవంబర్ 15వ తేదీలోగా పైప్‌లైన్ అనుసంధాన పనులు పూర్తి చేసి, గోదావరి జలాలను సరఫరా చేసేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. నిర్దేశించిన గడువును ఒక్కరోజు కూడా పొడిగించే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు.పైప్‌లైన్ నిర్మాణ పనులను రెండు వైపుల నుంచి సమాంతరంగా చేపట్టి, నిర్ణీత గడువులోగా అనుసంధానం చేయాలని ఎండీ ఆదేశించారు. ఏ నిర్మాణ సంస్థ ఎంత దూరం పైప్‌లైన్ ఏర్పాటు చేసిందనేది ముఖ్యం కాదని, పనులు పూర్తయి పైప్‌లైన్ అనుసంధానం కావడమే ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. పనుల పరిధికి సంబంధించిన బిల్లుల సర్దుబాటును తర్వాత పరిశీలించవచ్చని, ప్రస్తుతం పనుల పూర్తికే అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.పైప్‌లైన్ అనుసంధాన వనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసేందుకు రోజుకు ఎనిమిది గంటల చొప్పున మూడు షిఫ్టుల్లో ప్రత్యేక కార్మిక బృందాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతి షిఫ్టుకు వేర్వేరు బృందాలను నియమించి, పగలు రాత్రి తేడా లేకుండా నిరంతరాయంగా పనులు కొనసాగించాలన్నారు.

హైదరాబాద్, నవంబర్ 10, భాగ్యనగరంలో ఇటీవల కాలంలో టీజీ సేఫ్ నిర్వహిస్తున్న ఆకస్మిక తనిఖీలతో హోటళ్ల యజమానులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వారికి మజ్లిస్ పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ బాహాటంగా మద్దతుగా నిలిచారు. ట్విన్ సిటీస్ హోటల్ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధి బృందంతో కలిసి ఆయన తెలంగాణ సేఫ్ కమిషనర్ అవినాష్ మొహంతిని కలిశారు. నగరవ్యాప్తంగా ఆహార భద్రతా అధికారులు చేపడుతున్న తనిఖీలు పారదర్శకంగా, నిష్పాక్షికంగా, చట్టబద్ధమైన నియమ నిబంధనలకు లోబడి మాత్రమే సాగాలని, వ్యాపారులను భయభ్రాంతులకు గురిచేసే ధోరణికి స్వస్తి పలకాలని ఈ సందర్భంగా కమిషనర్‌ను ఆయన గట్టిగా కోరారు.తనిఖీల పేరిట నిబంధనలను అతిక్రమించి ఏకపక్ష చర్యలకు పాల్పడటం సరికాదని అసదుద్దీన్ నేతృత్వంలోని బృందం ఉన్నతాధికారి దృష్టికి తీసుకెళ్లింది. నిబంధనల ప్రకారం ఏదైనా హోటల్‌లో లోపాలు కనిపిస్తే.. వెంటనే తీవ్ర చర్యలు తీసుకోకుండా తొలుత ఇంప్రూవ్‌మెంట్ నోటీసు జారీ చేసి నిర్ణీత గడువు ఇవ్వాల్సి ఉంటుందని గుర్తుచేశారు. ఆ చట్టబద్ధమైన ప్రక్రియను దాటవేసి సోషల్ మీడియాలో విజువల్స్ విడుదల చేయడం, వ్యాపార సంస్థల ప్రతిష్టను మసకబార్చడం ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేశారు.హైదరాబాద్‌కు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆహార సంస్కృతి, గుర్తింపును పరిరక్షించడంలో హోటల్ రంగం కీలక పాత్ర పోషిస్తోందని అసదుద్దీన్ వర్గం పేర్కొంది. వేలాది మంది కార్మికులు, చిరువ్యాపారుల జీవనోపాధి ఈ రంగంపై ఆధారపడి ఉన్న వేళ.. కేవలం చిన్నపాటి లోపాలను సైతం భూతద్దంలో చూపిస్తూ హోటళ్లను సీజ్ చేయడం లేదా లైసెన్సులు రద్దు చేయడం వల్ల స్థానిక ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆహార నాణ్యతను కాపాడటానికి తాము వ్యతిరేకం కాదని, అయితే అధికారుల వైఖరి పారదర్శకంగా, సమానంగా ఉండాలే తప్ప.. ఎంపిక చేసుకున్న కొన్ని సంస్థలనే లక్ష్యంగా చేసుకుని వేధించేలా ఉండకూడదని వ్యాపారులు వాపోయారు.పౌరుల ఆరోగ్య పరిరక్షణ ఎంత ముఖ్యమో, వ్యాపారాలు గౌరవప్రదంగా సాగే వాతావరణం కల్పించడం కూడా అంతే ఆవశ్యకమని అసదుద్దీన్ అంటున్నారు. హోటల్ నిర్వాహకులకు సరైన మార్గదర్శకాలు ఇచ్చి, వారిలో అవగాహన పెంచేలా అధికారులు సహకారాత్మక ధోరణితో వ్యవహరించాలని కోరారు

బియ్యం ధరలు పెంచితే చర్యలు

-అక్రమ నిల్వలు,అధిక ధరల విక్రయాలపై కొరడా

-జిల్లాలో 50 దుకాణాల్లో తనిఖీలు.. 9 కేసులు నమోదు

-కలెక్టర్ కోయ శ్రీహర్ష



పెద్దపల్లి జిల్లా ప్రతినిధి నవంబర్ -10(విజన్ ఆంధ్ర)జిల్లాలో బియ్యం కృత్రిమ కొరత సృష్టించినా, ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మించి విక్రయించినా వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ కోయ శ్రీహర్ష హెచ్చరించారు. బియ్యం అక్రమ నిల్వలు, అధిక ధరల విక్రయాలను అరికట్టేందుకు జిల్లా వ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు కొనసాగిస్తున్నట్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.అక్టోబర్ 30న కలెక్టర్ ఆదేశాల మేరకు పెద్దపల్లి పట్టణంలోని పలు హోల్‌సేల్, రిటైల్ బియ్యం దుకాణాలు, గోదాముల్లో అధికారులు తనిఖీలు నిర్వహించారు. డిప్యూటీ తహశీల్దార్లు, ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు బియ్యం నిల్వలు, ధరల పట్టికలు, తూకాలు, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు.నిర్ణయించిన ధరలు బీపీటీ/కేఎన్ఎం రకం బియ్యం మిల్లు వద్ద కిలో రూ.62, హోల్‌సేల్ రూ.64, రిటైల్ రూ.66గా నిర్ణయించారు. ఆర్ఎన్ఆర్/తెలంగాణ సోనా రకం బియ్యం ధరలు వరుసగా రూ.70, రూ.72, రూ.74గా, హెచ్ఎంటీ/జై శ్రీరామ్ రకం ధరలు రూ.75, రూ.77, రూ.79గా నిర్ణయించారు. వీటికి మించి విక్రయించరాదని స్పష్టం చేశారు.

ప్రతి దుకాణం, మిల్లు ఎదుట రోజువారీ నిల్వలు, విక్రయ ధరల వివరాలతో కూడిన బోర్డును వినియోగదారులకు కనిపించేలా ఏర్పాటు చేయాలి. ట్రేడ్, జీఎస్టీ, ఎఫ్ఎస్ఎస్ఏఐ అనుమతి పత్రాలను అందుబాటులో ఉంచాలి. కొనుగోళ్లు, అమ్మకాల వివరాలను ఎప్పటికప్పుడు స్టాక్ రిజిస్టర్లో నమోదు చేయాలి. 26 కిలోల బస్తా పేరుతో 24 లేదా 25 కిలోల బియ్యం విక్రయిస్తే మోసపూరిత కొలతల చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.నవంబర్ 4 నాటికి జిల్లాలో మొత్తం 50 బియ్యం దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి, నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి 9 కేసులు నమోదు చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. అక్రమ నిల్వలు, ధరల ఉల్లంఘనలు, తూకాల్లో తేడాలు, రికార్డుల నిర్వహణలో లోపాలు గుర్తిస్తే నిత్యావసర సరుకుల చట్టం కింద క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.

అర్హులైన ఓటర్లు ఈ నెల 21వ తేదీలోగా ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించాలి

– అదనపు జిల్లా వి. విక్టర్



కామారెడ్డి బ్యూరో నవంబర్ 10 (విజన్ఆంధ్ర)ముసాయిదా ఓటర్ల జాబితాలో పేర్లు లేని వారికి తుది జాబితాలో పేరు చేర్చుకునేందుకు మరో అవకాశం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో అదనపు జిల్లా వి. విక్టర్ మాట్లాడుతూ, ఎన్యూమరేషన్ ఫారాలు జారీ చేసినప్పటికీ గైర్హాజరు కావడం, నివాసం మారడం తదితర కారణాలతో ముసాయిదా ఓటర్ల జాబితాలో పేర్లు నమోదు కాని అర్హులైన ఓటర్లకు తుది ఓటర్ల జాబితాలో తమ పేర్లను చేర్చుకునేందుకు భారత ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించిందని తెలిపారు.ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అర్హులైన ఓటర్లు తమ పేర్లను తుది ఓటర్ల జాబితాలో నమోదు చేసుకోవడానికి సంబంధిత బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు), సహాయ ఎన్నికల నమోదు అధికారులు (ఏఈఆర్ఓలు), ఎన్నికల నమోదు అధికారులను (ఈఆర్ఓలు) సంప్రదించి నిర్దేశించిన విధానంలో ఎన్యూమరేషన్ ఫారాలను సమర్పించాలని సూచించారు.ఓటరు జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఉండేలా ఎన్నికల సంఘం కల్పించిన ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, ఈ నెల 21.11.2026 లోపు దరఖాస్తులను సమర్పించి ఓటరు జాబితాలో తమ పేర్ల నమోదును నిర్ధారించుకోవాలని అదనపు జిల్లా ఎన్నికల అధికారి కోరారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఎన్.వై. గిరి, ఎన్నికల సూపరింటెండెంట్ రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

నూతన సబ్‌రిజిస్ట్రార్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన మెరుగు చందర్ యాదవ్



పెద్దపల్లి జిల్లా ప్రతినిధి నవంబర్-10(విజన్ ఆంధ్ర)పెద్దపల్లి జిల్లా కేంద్రంలో నూతనంగా సబ్‌రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టిన బాకం ఓంప్రకాష్‌ను తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షుడు మెరుగు చందర్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శాలువా కప్పి, పూలబొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.
అనంతరం మెరుగు చందర్ యాదవ్ మాట్లాడుతూ.. అనుభవజ్ఞుడైన, ప్రజాసేవ పట్ల నిబద్ధత కలిగిన ఓంప్రకాష్ సబ్‌రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టడం పెద్దపల్లి ప్రజలకు శుభపరిణామమన్నారు. ఆయన హయాంలో రిజిస్ట్రేషన్ శాఖలో అవినీతికి తావులేకుండా పారదర్శక పాలన కొనసాగిస్తూ, ప్రజలకు వేగవంతమైన సేవలు అందిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజలకు మెరుగైన సేవలందించే క్రమంలో పార్టీ తరఫున సంపూర్ణ సహకారం అందిస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైస్ ప్రెసిడెంట్ మెరుగు సతీష్ గౌడ్, జిల్లా జాయింట్ సెక్రటరీ కాంపెల్లి స్వామి, పెద్దపల్లి మున్సిపల్ ప్రెసిడెంట్ వెంగల కృష్ణ, పెద్దపల్లి మండల అధ్యక్షులు కళాబోయిన సంపత్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కొలంగూడా లో ఘనంగా సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు

వాఘపూర్‌లో ఇంటింటా ఇందిరమ్మ దీపావళి సంబరాలు!

ఏఎంసీ చైర్మన్ బోరంచు



ఆదిలాబాద్ బ్యూరో నవంబర్ 10(విజన్ ఆంధ్ర)ఆదిలాబాద్ జిల్లా మావల మండలంలోని కొలం గూడా గ్రామంలో ఏఎంసీ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి గారికి గ్రామస్తులు ఘనంగా ఆహ్వానం పలికి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలను కులం గూడా గ్రామంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తుల సమక్షంలో ఉత్సాహంగా నిర్వహించి కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా వాఘపూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇంటింటా ఇందిరమ్మ దీపావళి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ పండుగ వేడుకల్లో నాయకులు, కార్యకర్తలు భాగస్వాములయ్యారు. ఈ కార్యక్రమాల్లో మావల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కుదురుపాక సురేష్ కుమార్, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ చిలుకూరి శేఖర్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ప్రతాప్ రెడ్డి, వినోద్, అశోక్, శంకర్, రవి, లవన్, మార్సకోల గౌతమ్ తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమం దిశగా ముందుకు సాగుతోందని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజా ప్రభుత్వంగా నిలుస్తోందని పేర్కొన్నారు. పండుగలు ప్రజల మధ్య ఐక్యతను, సోదరభావాన్ని పెంపొందిస్తాయని, కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజలతో కలిసి ఉంటూ వారి సంతోషాల్లో భాగస్వామి అవుతుందని తెలిపారు. ప్రజలతో మమేకమైడ పండుగల్లో భాగస్వాములైడ అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగుతోంది.

కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలుగా ఎన్నికైన జిన్నారెడ్డి వెంకటేశ్వర్లు

పద్మజ కి త్రికూట శ్రీరామ ఆలయ ఆధ్వర్యంలో ఘన సన్మాన



మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 10 (విజన్ ఆంధ్ర):మహబూబాబాద్ జిల్లా పరిధిలోని మహబూబాబాద్ మున్సిపాలిటీకి చెందిన మహిళ జిన్నారెడ్డి పద్మజాకి కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలుగా వచ్చినందుకు వారికి త్రికుంట శ్రీరామ ఆలయం కమిటీ శనిగాపురం ఘన సన్మానం చేయడం జరిగింది శనిగాపురం త్రికుట శ్రీరామ ఆలయా నిర్మాణానికి మొత్తం సిమెంటు బస్తాలు మొత్తం ఇవ్వడం జరిగింది అని ఆలయ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేయడం జరిగింది. దానికోసమే ఈరోజు మహిళా పార్టీ అధ్యక్షురాలుగా ఎన్నికైనందుకు రామాలయం తరఫున ఘన సన్మానం చేయడం జరిగింది. అనేక పదవులు అనుభవించాలని దినదిన అభివృద్ధి చెంది ఈ యొక్క మహబూబాబాద్ ఎంతో అభివృద్ధి చేయాలని చెప్పి ఆలయ కమిటీ తరఫున తెలియజేయడం జరుగుతుందని చెప్పి తెలిపారు. అదేవిధంగా పద్మజ కాంగ్రెస్ పార్టీ జడ్పిటిసిగా అనేక పదవులు చేపట్టారని దానికి తోడే ఈ పదవి వచ్చిందని చెప్పి ఆమె వివరించడం జరిగింది. అదేవిధంగా నా భర్త జిన్నా రెడ్డి వెంకటేశ్వర్లు పార్టీ కోసం అహర్నిశలు కృషిచేసి కాంగ్రెస్ పార్టీ జడ్పిటిసిగా ఫ్లోర్ పనిచేశారని ఆమె తెలిపారు. ఈరోజు కాంగ్రెస్ పార్టీ మహబూబాబాద్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలుగా నాపై నమ్మకంతో ఇచ్చినందుకు పార్టీకి పార్టీ శ్రేణులకి ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని చెప్పడం జరిగింది మహిళలకు ఏ సమస్య వచ్చినా నేను తోడుగా ఉంటానని కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తానని ఆమె తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీ త్రికుట శ్రీ రామాలయ అధ్యక్షులు రామ్ శెట్టి వీరేందర్ కోశాధికారి చిట్టిమల్ల శ్రీను ప్రధాన కార్యదర్శి పద్మ ఉపేంద్రమ్మ ఆర్గనైజింగ్ సెక్రటరీ వేల్పుల విష్ణువర్ధన్ ఉపాధ్యక్షురాలు గంగాధరి యమున శివాలయం గుడి నిర్మాణదాత కందుకూరి వెంకన్న స్వర్ణ తదితరులు ఈ యొక్క కార్యక్రమంలో పాల్గొన్నారు .

రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలి

-ఆహారం,పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

-జిల్లా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ కోయ శ్రీహర్ష



పెద్దపల్లి జిల్లా ప్రతినిధి నవంబర్-10(విజన్ ఆంధ్ర)జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. ఆసుపత్రిలో రోగులకు అందించే ఆహారం నాణ్యత, పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని స్పష్టం చేశారు.మంగళవారం పెద్దపల్లిలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓపీ వార్డులు, లేబర్ రూమ్, క్యాజువాలిటీ, ఆపరేషన్ థియేటర్, ఐసీయూ తదితర విభాగాలను పరిశీలించారు. ఆయా విభాగాల్లో అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలు, రోగులకు అందిస్తున్న చికిత్స, వైద్యులు, సిబ్బంది విధుల నిర్వహణపై ఆరా తీశారు.ఆసుపత్రిలో అవసరమైన మందులు, వైద్య పరికరాలు, ఇతర సదుపాయాలు అందుబాటులో ఉంచాలని, రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వైద్యులు, సిబ్బంది అంకితభావంతో అందిస్తున్న సేవలను అభినందిస్తూ ఇదే స్ఫూర్తితో మరింత బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని పేర్కొన్నారు.రోగులకు అందించే ఆహారం నాణ్యంగా, పరిశుభ్రంగా ఉండాలని, వంటశాల, భోజన ప్రదేశాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని ఆదేశించారు. వార్డులు, మరుగుదొడ్లు, ఆసుపత్రి పరిసరాల్లో పారిశుద్ధ్యం పక్కాగా నిర్వహించాలని స్పష్టం చేశారు. పేద రోగులకు ప్రభుత్వ పథకాల ద్వారా అందాల్సిన వైద్య సహాయాన్ని సకాలంలో అందించాలని, వారి సమస్యలను వెంటనే పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.ఈ తనిఖీలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి

- జిల్లా ఉద్యాన శాఖ అధికారి జ్యోతి



కామారెడ్డి బ్యూరో నవంబర్ 10 (విజన్ఆంధ్ర)కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలం చిన్న ఎక్లారా గ్రామంలో ఎల్‌నినో వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఆయిల్ పామ్ సాగు పద్ధతులు, పంట యాజమాన్య మెళకువలు, ప్రభుత్వ రాయితీలపై రైతులకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఉద్యాన మరియు పట్టుపరిశ్రమ శాఖ అధికారి జ్యోతి ముఖ్య అతిథిగా హాజరై రైతులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా ఉద్యాన పట్టుపరిశ్రమ శాఖ అధికారి జ్యోతి మాట్లాడుతూ, ప్రస్తుత ఎల్‌నినో ప్రభావంతో ఉష్ణోగ్రతలు పెరగడం, వర్షపాతం తగ్గడం, నీటి లభ్యతలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశాలు ఉన్నందున రైతులు పంటల సాగులో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఆయిల్ పామ్ తోటల్లో నీటి యాజమాన్యానికి ప్రాధాన్యతనిస్తూ, అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా, సమర్థవంతంగా వినియోగించుకోవాలని తెలిపారు.ఆయిల్ పామ్ తోటల్లో బిందు సేద్యం ద్వారా అవసరమైన మేరకు నీటిని అందించాలని, మొక్కల చుట్టూ తేమ నిల్వ ఉండేందుకు మల్చింగ్ చేపట్టాలని, కలుపు మొక్కలను నియంత్రించాలని సూచించారు. ఎండ తీవ్రత నుంచి మొక్కలను రక్షించడంతో పాటు, సిఫార్సు చేసిన మోతాదులో ఎరువులు వినియోగించాలని, మొక్కల ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు పరిశీలించాలని వివరించారు. మొక్కల పెరుగుదల, పూత, కాయల అభివృద్ధి, గెలల దిగుబడి పెంపునకు అనుసరించాల్సిన శాస్త్రీయ యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు.ప్రభుత్వం ఉద్యాన శాఖ ద్వారా ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించేందుకు అర్హులైన రైతులకు మొక్కల సరఫరా, బిందు సేద్యం పరికరాలపై రాయితీలు, పంట నిర్వహణకు ప్రోత్సాహకాలు అందిస్తోందని తెలిపారు. ముఖ్యంగా ఆయిల్ పామ్ తోటల నిర్వహణకు ఒక ఎకరానికి సంవత్సరానికి రూ.4,200 చొప్పున నిర్వహణ రాయితీ అందిస్తున్నట్లు వివరించారు. రైతులు ప్రభుత్వ రాయితీలను సద్వినియోగం చేసుకుని ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణాన్ని పెంచుకోవాలని సూచించారు.
ఈ సందర్భంగా హిందుస్థాన్ యూనిలీవర్ లిమిటెడ్ జనరల్ మేనేజర్ జగదీష్ చంద్రబాబు మాట్లాడుతూ, ఆయిల్ పామ్ సాగులో రైతులు శాస్త్రీయ పద్ధతులను పాటించాలని, ఉద్యాన శాఖ మరియు కంపెనీ అధికారులు అందించే సాంకేతిక సూచనలను అనుసరించాలని తెలిపారు. నాణ్యమైన దిగుబడి సాధించాలంటే సరైన సమయంలో తోటల నిర్వహణ చేపట్టడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉద్యాన శాఖ అధికారులు, మద్నూర్ మండల వ్యవసాయ అధికారి, హిందుస్థాన్ యూనిలీవర్ లిమిటెడ్ సిబ్బంది, ఉద్యాన శాఖ సిబ్బంది మరియు సుమారు 50 మంది రైతులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల ముగ్గు పనుల ప్రారంభించిన సర్పంచ్ నరసయ్య

దోమకొండ నవంబర్ 10(విజన్ఆంధ్ర)కామారెడ్డి జిల్లా దోమకొండ మండల కేంద్రంలోని వివిధ కాలనీలలో 44 ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మంగళవారం మంజూరు పత్రాలు ఎంపీడీవో మధురిమ ఆధ్వర్యంలో సర్పంచ్ ఐరేని నరసయ్య పంచాయతీ కార్యదర్శి యాదగిరి, మాజీ జెడ్పిటిసి తీగల తిరుమల గౌడ్ అందజేశారు. గ్రామంలో గజం లక్ష్మి, బండారి బాలమని ఇందిరమ్మ ఇండ్లకు ముగ్గు పోసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ దృష్టికి తీసుకెళ్లి అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యేలా కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు సీతారాం మధు నర్సింలు రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



సీఎం స్థలసేకరణకు.వివేక్ వెంకట్ స్వామి,జిల్లా ఇంచార్జి మంత్రి



సిద్దిపేట జిల్లా ప్రతినిధినవంబర్ 19 (విజన్ ఆంధ్ర)సిద్దిపేటలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన.. భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు పరిశీలించడం జరిగింది..సభకు ప్రజలు భారీగా తరలివచ్చే అవకాశం, వాహనాల పార్కింగ్, ప్రజలకు సౌకర్యాలు, రాకపోకలకు నువైన ప్రాంతాలపై క్షేత్రస్థాయిలో పరిశీలించడం జరిగింది కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీలు, నూతన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే సభ ప్రధాన లక్ష్యంనవంబర్ 19న సిద్దిపేట సభ వేదికగా అర్హులైన ప్రతి ఒక్కరికీ రూ.5 లక్షల జీవిత బీమా కల్పించే ఇందిరా బీమా పథకాన్ని ప్రారంభించనున్న ముఖ్యమంత్రి..సన్నబియ్యం పంపిణీ, కొత్త రేషన్ కార్డులు, కొత్త పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్లు వంటి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు వివరిస్తారు.రాష్ట్రవ్యాప్తంగా రెండు లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమమని వెల్లడి 20 లక్షల మంది విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్ అమలు చేస్తున్న ఘనత తెలంగాణ ప్రభుత్వానిది ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజ్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు సిద్దిపేట సభను నిర్వహిస్తున్నా నవంబర్ 19న సిద్దిపేటలో జరిగే ముఖ్యమంత్రి బహిరంగ సభకు ప్రజలు, కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపు..

ఎంపీ డికె. అరుణమ్మ ని ఘనంగా సన్మానించిన రెడ్డి సేవా సమితి సభ్యులు



గద్వాల నవంబర్ 10 (విజన్ ఆంధ్ర బ్యూరో)జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని జిల్లా బిజెపి పార్టీ కార్యాలయం(డికే బంగ్లా) లో మంగళవారం పట్టణంలోని నూతనంగా ఎన్నికైన రెడ్డి సేవా సమితి సభ్యులు మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణమ్మను, జిల్లా యువ నాయకురాలు డీకే స్నిగ్ధారెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా రెడ్డి సేవా సమితి నూతన సభ్యులు ఎంపీ డీకే అరుణమ్మ కి, డికె.స్నిగ్ధా రెడ్డి కి పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా డికె.అరుణమ్మ నూతనంగా ఎన్నికైన సభ్యులకు అభినందనలు తెలియజేస్తూ, సమాజ సేవలో ముందుండాలని, ఐకమత్యంతో పనిచేస్తూ పేదలకు, నిరుపేదలకు అండగా నిలవాలని ఆకాంక్షించారు. సమాజ అభివృద్ధికి సేవా సమితులు చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు.డికె. స్నిగ్ధారెడ్డి కూడా నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు మరింత చేరువ కావాలని సూచించారు. సమాజంలో ఐక్యత, సేవాభావం, పరస్పర సహకారం పెంపొందించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో నూతన సభ్యులు నడిగడ్డ రెడ్డి సేవా సమితి అధ్యక్షులు పి. సురేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె. పరమేశ్వర్ రెడ్డి, ఉపాధ్యక్షులు హెచ్. మోహన్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, కోశాధికారి అశోకుమార్ రెడ్డి, అసోసియేట్ అధ్యక్షులు మారుతి శ్రీనివాస్ రెడ్డి, సంస్కృతిక కార్యదర్శి నరసింహారెడ్డి,మీడియా ఇంచార్జీ జి.జగదీశ్వర్ రెడ్డి, సంయుక్త కార్యదర్శులు దినేష్ రెడ్డి సూర్య ప్రకాష్ రెడ్డి నూతన కార్యవర్గ సభ్యులు వెంకటేశ్వర్ రెడ్డి, మీనాకేతన్ రెడ్డి, ఏ శ్రీనివాస్ రెడ్డి, నరేంద్ర రెడ్డి, కే.శ్రీనివాస రెడ్డి,
వై.తిరుమల్ రెడ్డి, బి.నర్సింహా రెడ్డి, బహదూర్ రెడ్డి, యశోధర్ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పాగుంట శ్రీ వెంకటేశ్వర స్వామి జాతర సందర్భంగా పటిష్ట భద్రత చర్యలు

స్వామివారిని దర్శించుకున్న - జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు



కేటి దొడ్డి నవంబర్ 10 (విజన్ ఆంధ్ర బ్యూరో)జోగులాంబ గద్వాల జిల్లా కేటి. దొడ్డి మండలం లో జరుగుతున్న పాగుంట శ్రీ శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి జాతర సందర్భంగా పటిష్ట భద్రత చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు తెలిపారు. మంగళవారం రాత్రికి స్వామి వారి రథోత్సవం జరుగనున్న సందర్భంగా జిల్లా ఎస్పీ స్వామి వారిని దర్శించుకున్నారు.అనంతరం జాతర సందర్భంగా పోలీస్ శాఖ చేపట్టిన భద్రత చర్యలను అధికారులు జిల్లా ఎస్పీ కి వివరించారు. ఈ సందర్భంగా ఎస్పీ అధికారులతో మాట్లాడుతూ, రథోత్సవం
సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందును ఎక్కడ కూడా ఎలాంటి అవాశీచనియా సంఘటనలు జరుగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని, క్యూ లైన్ లలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని,
వాహనాల పార్కింగ్ ప్రదేశాల దగ్గర ఎలాంటి ట్రాఫిక్ జాం కాకుండా చూడాలని అన్నారు. రాత్రి సమయాలలో దొంగతనాలు జరుగకుండా నిఘా ఉంచాలని, ఈవ్ టిజింగ్ జరుగకుండా షీ టీమ్ బృందాలు నిఘా ఉంచాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గద్వాల్ సిఐ. శ్రీను, ఎస్సై లు శ్రీనివాస్, శ్రీకాంత్, శ్రీ హరి, తారక, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

స్వామి శరణం అయ్యప్ప శరణం.. అన్నదాన ప్రభువే శరణం అయ్యప్ప..

అయ్యప్ప మాల స్వాములకు అన్నదాన వితరణ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి



గద్వాల నవంబర్ 10 (విజన్ ఆంధ్ర బ్యూరో)జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని పాత హౌసింగ్ బోర్డ్ కొలువైన శ్రీ శ్రీ శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో అయ్యప్ప మాల ధారణలో ఉన్న స్వాముల కొరకు తలపెట్టిన అన్నదాన కార్యక్రమం మంగళవారం గద్వాల్ శాసన సభ్యులు బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి చే అన్నదానం చేయడం జరిగింది. ఈ అన్నదాన కార్యక్రమం తేదీ: 10-11-2026 నుండి 10-1-2027 వరకు భక్తులు నిర్వహించనున్నారు. ఈ మొదటిరోజు అన్నదాత ఎమ్మెల్యే బండ్ల జ్యోతి కృష్ణ మోహన్ రెడ్డి చేతుల మీదుగా అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. ముందుగా అయ్యప్ప స్వామి చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులను పొందారు. ఎమ్మెల్యే కి ఆలయ కమిటీ అధ్యక్షులు కమిటీ సభ్యులు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అయ్యప్ప స్వామి దేవాలయంలో 60 రోజులపాటు నిర్వహించే మాలధారణ అయ్యప్ప స్వామి బిక్ష (అన్నదానం కార్యక్రమం) ఎలాంటి ఆటంకాలు లేకుండా నిరంతరం జరగాలి అయ్యప్పలకు దాతలు సహకరించాలని కోరారుఈ అన్నదాన కార్యక్రమం కు సహకరించిన దాతల కుటుంబ సభ్యులకు శ్రీ హరిహర పుత్రుడు అయ్యప్ప స్వామి వారి కృపాకటాక్షాలు ఎల్లవేళలా ఉండాలని, వారు వారి కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో సుఖ సంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని మనస్ఫూర్తిగా స్వామివారిని కోరుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ తుమ్మల జయలక్ష్మి నరసింహులు యాదవ్, రాష్ట్ర వాల్మీకి ఫెడరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్ప, మాజీ మార్కెట్ చైర్మన్ శ్రీధర్ గౌడ్, జిల్లా సీనియర్ నాయకులు జి. వేణుగోపాల్, కౌన్సిలర్స్ రామలింగేశ్వర కాంప్లే, చంద్రశేఖర్, మాజీ ఎంపీపీ విజయ్, పార్టీ నాయకులు కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

భూపాలపల్లి జిల్లాని కరువు జిల్లాగా ప్రకటించాలి

రాష్ట్రంలో వ్యవసాయ శాఖ మంత్రి నిర్లక్ష్య ధోరణి స్పష్టం చేయాలి. సిపిఐ నాయకులు



భూపాలపల్లి ల్లా 10 నవంబర్ (విజన్ ఆంధ్ర) భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఈరోజు జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రాన్ని కరువు జిల్లాగా ప్రకటించాలని చెప్పేసి ఆందోళన పోరాటం కలెక్టర్ ఆఫీస్ నందు ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పలువురు సిపిఐ నాయకులు మాట్లాడుతూ:-రాష్ట్ర ప్రభుత్వం అయినా కేంద్ర ప్రభుత్వం అయిన కరువుకు సంబంధించి ఇప్పటివరకు ఏమీ జాగ్రత్తలు చేపక పుట్టడం చాలా సిగ్గుచేటువంటి విషయం ఎందుకంటే ఈ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో సుమారు 12 మండలాలు ఉన్నప్పటికీ కేవలం ఐదు మండలాలు ప్రకటించడం చాలా బాధాకరం ఎందుకంటే ప్రతి మండలంలో కూడా ఈ ఎలినో కరువు ఎఫెక్ట్ ఉంది గుర్రంపేట మరి ప్రాంతాన్ని విజిట్ చేస్తే సుమారు 250 ఎకరాల పంట నష్టం జరిగింది ఈరోజు వరి పంట వేసిన తర్వాత ప్రభుత్వం పంట వేయద్దు అని చెప్పింది మరి పంట వేసినటువంటి వాళ్లకి ఎవరి నష్టపరిహారం చెల్లిస్తారు మేము సిపిఐ పార్టీగా డిమాండ్ చేస్తున్నాం అన్నారు. ఎవరైతే వరి పంట వేసి నష్టపోయారో వారికి ఎకరానికి 30 వేల రూ. వాణిజ్య పంటకు 50వేల రూపాయలు ఇవ్వాలి అని చెప్పేసి డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు ప్రత్యేక ప్యాకేజీ ఏర్పాటు చేసి రైతన్న కాపాడుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాం అన్నారూ. ఈరోజు కరువు అనేది చాలా విపరీతంగా పెరిగిపోతుంది ఈరోజు ప్రతి ఒక్క వస్తువు కూడా మరి విపరీతమైనటువంటి రేట్లు పెరుగుతున్నాయి ఈరోజు బియ్యం ధరలు చాలా 100 రూ. కిలో పెరిగిన పరిస్థితి. అయినా రాష్ట్ర ప్రభుత్వం గానీ కేంద్ర ప్రభుత్వం గానీ ఈ ధరలు అదుపు చేయకపోవడం చాలా సిగ్గుచేటు అయిన విషయం ఇప్పటికైనా మీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాం జయశంకర్ భూపాలపల్లి జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలి. ఇక్కడున్నటువంటి రైతాంగాన్ని ఆదుకోవాలి కచ్చితంగా వారికి నష్టపరిహారం చెల్లించే వరకూ కూడా సిపిఐ పార్టీ పోరాటాలు నిర్వహిస్తారని ఈ పోరాటాలకు ఇంకా పెద్ద ఎత్తున ఉద్యమాన్ని ఉధృతంగా చేస్తామని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరిస్తున్నాం అన్నారు ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా ప్రధాన కార్యవర్గ సభ్యులు సోతుకు ప్రవీణ్,రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మామిడాల సమ్మిరెడ్డి,మండల కార్యదర్శి కుడుదుల వెంకటేష్. మండల కార్యదర్శి రాజయ్య ,పైండ్ల శాంతి,అన్నారపు రాజేందర్,గోలి లావణ్య ఎన్ ఎఫ్ ఐ డబ్ల్యూ అధ్యక్షురాలు,పెద్ద మామూల సంధ్య ,పొన్నగంటి లావణ్య

డిజిటల్ పాలనపై అవగాహన పెంపొందించుకోవాలి

-ఈ-హెచ్ఆర్ఎంఎస్, ఆన్‌లైన్ సేవలను ప్రతి ఉద్యోగి సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా కలెక్టర్ ప్రియాంక.



నారాయణపేట ప్రతినిధి, నవంబర్ 10 (విజన్ ఆంధ్ర) డిజిటల్ పాలనపై అవగాహన పెంపొందించుకుని ఈ-హెచ్ఆర్ఎంఎస్, ఆన్‌లైన్ సేవలను ప్రతి ఉద్యోగి సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక సూచించారు. ప్రభుత్వ ఉద్యోగుల సర్వీసు రికార్డులు, వ్యక్తిగత వివరాలు, సేవా సంబంధిత కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రవేశపెడుతున్న నూతన(ఈ-హెచ్ఆర్ఎంఎస్) విధానంపై మంగళవారం జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ప్రియాంక మాట్లాడుతూశిక్షణకు హాజరైన ప్రతి ఒక్కరూ డిజిటల్ పాలన ప్రాధాన్యతను గుర్తించాలన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రభుత్వ సేవలన్నీ డిజిటల్ విధానంలోకి మారుతున్నాయి. ఈ నేపథ్యంలో (ఈ-హెచ్ఆర్ఎంఎస్) ద్వారా ఉద్యోగులకు సంబంధించిన సేవలను ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తీసుకువస్తున్నాం అని తెలిపారు. ఈ వ్యవస్థలో ప్రధానంగా మూడు విభాగాలు ఉన్నాయనీ, మొదటిది హెచ్ఆర్ఎంఎస్‌కు సంబంధించిన ఉద్యోగుల వ్యక్తిగత వివరాలు, రెండవది విధులకు సంబంధించిన వర్క్ మాడ్యూల్, మూడవది సెలవుల మంజూరు, ఇతర సర్వీసు సంబంధిత కార్యకలాపాలు. ఈ సేవలన్నీ ఒకే డిజిటల్ వేదిక ద్వారా నిర్వహించుకునే అవకాశం ఉంటుందన్నారు. గతంలో ఉద్యోగుల సర్వీసు రికార్డుల నిర్వహణలో అనేక ఇబ్బందులు ఎదురయ్యేవనీ, పాత రికార్డులు, సర్వీస్ బుక్స్, సెలవుల వివరాలు, ఇంక్రిమెంట్లు, సంతకాలు, గ్యాప్ పీరియడ్స్ వంటి అంశాల కోసం పాత ఫైళ్లను పరిశీలించాల్సి వచ్చేదనీ, కొన్నిసార్లు రికార్డుల్లో వివరాలు నమోదు కాకపోవడం వల్ల కూడా సమస్యలు తలెత్తేవనీ, కొత్త డిజిటల్ విధానంతో ఈ ఇబ్బందులకు పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. ఉద్యోగుల వివరాలు డిజిటల్ సంతకాలతో ఆన్‌లైన్‌లో భద్రపరచబడతాయన్నారు. అవసరమైనప్పుడు వాటిని సులభంగా పరిశీలించవచ్చని ఆమె స్పష్టం చేశారు. ఈ శిక్షణను ప్రతి ఒక్కరూ అత్యంత శ్రద్ధగా తీసుకోవాలని కోరారు. ఈ మూడు రోజుల శిక్షణా కార్యక్రమంలో జిల్లా అధికారులు, హెచ్ఓడీలు, సంబంధిత సిబ్బంది పూర్తిస్థాయిలో పాల్గొని ప్రతి అంశాన్ని అర్థం చేసుకోవాలన్నారు. మీరు నేర్చుకోవడంతో పాటు మీ కింద పనిచేసే సిబ్బందికి కూడా ఈ వ్యవస్థపై అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. ఆన్‌లైన్ అటెండెన్స్ విధానాన్ని ఇప్పటికే ప్రారంభించినప్పటికీ, ఇంకా కొంతమంది అధికారులు, సిబ్బంది కొత్త యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవడం లేదా వినియోగించడం లేదని మా దృష్టికి వచ్చిందనీ, ప్రతి హెచ్ఓడీ తన పరిధిలోని అధికారులందరూ, సిబ్బంది అందరూ ఆన్‌లైన్ అటెండెన్స్ విధానంలో నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. ఈ నెల 10వ తేదీ నుంచి 31వ తేదీ వరకు అటెండెన్స్ నమోదు ప్రక్రియను పర్యవేక్షిస్తామని, ఈ నెల 22, 23 తేదీల్లో ఆన్‌లైన్ అటెండెన్స్ వివరాలను పరిశీలిస్తాం అన్నారు. ఈ నెల 25వ తేదీ నుంచి జీతాల బిల్లుల అప్‌లోడింగ్ ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో, జీతాల బిల్లులు సమర్పించే ముందు సంబంధిత శాఖల నుంచి ఆన్‌లైన్ అటెండెన్స్ వివరాలు సక్రమంగా నమోదయ్యాయా లేదా అన్నది పరిశీలిస్తామని స్పష్టం చేశారు. ప్రస్తుత నెల జీతాలను కేవలం ఆన్‌లైన్ అటెండెన్స్ ఆధారంగా నిర్ణయించడం లేదని, అయితే ఈ నెలలో ప్రతి ఒక్కరి ఆన్‌లైన్ అటెండెన్స్‌ను ప్రత్యేకంగా పరిశీలిస్తామని తెలిపారు. రాబోయే పది రోజుల్లో ప్రతి అధికారి, ప్రతి ఉద్యోగి తప్పనిసరిగా ఈ విధానంలోకి రావాలని తేల్చి చెప్పారు. కొత్త కలెక్టరేట్ భవనంలోకి వెళ్లే సమయానికి ప్రతి ఒక్కరికీ ఈ విధానం అలవాటు కావాలన్నారు. వచ్చే నెల నుంచి ఉద్యోగుల అటెండెన్స్, సెలవుల నమోదు, సంబంధిత సర్వీసు వివరాలన్నీ ఆన్‌లైన్‌లో పర్యవేక్షించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. డిజిటల్ విధానం వల్ల ఉద్యోగులకు ఎంతో సమయం ఆదా అవుతుందనీ, గతంలో సర్వీస్ బుక్‌లో వివరాలు నమోదు చేయడం, సెలవుల కోసం దరఖాస్తులు సమర్పించడం, రికార్డుల కోసం వివిధ కార్యాలయాల చుట్టూ తిరగడం వంటి సమస్యలు ఉండేవనీ, ఇకపై ఈ ప్రక్రియలన్నీ ఆన్‌లైన్‌లో నిర్వహించుకునే అవకాశం ఉంటుందన్నారు. ఉద్యోగుల సర్వీసు వివరాలు పారదర్శకంగా, భద్రంగా అందుబాటులో ఉంటాయనీ ఆమె వెల్లడించారు. అందువల్ల ప్రతి జిల్లా అధికారి ఈ అంశాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకోవాలి. మీ సిబ్బందికి శిక్షణ ఇచ్చి, డేటా ఎంట్రీలో ఎలాంటి తప్పులు లేకుండా చూసుకోవాలన్నారు. నమోదు చేసే ప్రతి వివరాన్ని జాగ్రత్తగా పరిశీలించాలని, డేటా సక్రమంగా, పూర్తి స్థాయిలో నమోదు కావడం చాలా ముఖ్యం అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ ఆధునిక డిజిటల్ సేవలను సమర్థవంతంగా వినియోగించుకోవడం మనందరి బాధ్యత అని, పాత విధానాల నుంచి ఆధునిక డిజిటల్ విధానాలకు మారుతున్న ఈ సమయంలో ప్రతి ఒక్కరూ తమను తాము సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ మూడు రోజుల శిక్షణను సద్వినియోగం చేసుకుని, మీరు నేర్చుకున్న విషయాలను మీ సిబ్బందికి కూడా వివరించి, 100 శాతం డిజిటల్ వ్యవస్థను అమలు చేసే దిశగా కృషి చేయాలని ఆమె కోరారు. అందరి సహకారంతో డిజిటల్ పాలనను మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకు వెళ్తామని కలెక్టర్ ఆశా భావం వ్యక్తం చేశారు. కాగా రాష్ట్ర ఖజానా, లెక్కల శాఖ సంచాలకులు, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ శిక్షణా కార్యక్రమం కొనసాగిందిప్రస్తుతం అమలులో ఉన్న హెచ్ఆర్ఎంఎస్ (హెచ్ ఆర్ ఎం ఎస్)విధానం స్థానంలో ప్రవేశపెడుతున్న నూతన ఈ-హెచ్ఆర్ఎంఎస్ విధానానికి మార్పు, సాఫ్ట్‌వేర్‌లో ఉద్యోగుల వ్యక్తిగత, సర్వీసు వివరాల నమోదు, వివిధ పరిపాలనా ప్రక్రియలు, సాఫ్ట్‌వేర్ వినియోగ విధానం, అందుబాటులో ఉండే సదుపాయాలపై అధికారులు, సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి డి టి ఓ రాజ్ గోపాల్ చారీ నాయకత్వం వహించి, నూతన విధానం అమలుకు సంబంధించిన అంశాలను వివరించారు. శిక్షణ కార్యక్రమంలో పీ ఏ వో దేవ్ సింగ్, జిల్లాలోని అన్ని శాఖల జిల్లా అధికారులు, డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ అధికారులు (డీడీఓలు), వారి కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

బాధితుల వద్దకే వెళ్లి ఆన్‌సైట్ లో ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్



నారాయణపేట, నవంబర్10 (విజన్ ఆంధ్ర) నారాయణపేట జిల్లా పరిధిలో బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు, పోలీస్ స్టేషన్‌కు రాలేని పరిస్థితుల్లో ఉన్న, ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చిన వారి వద్దకే వెళ్లి ఆన్‌సైట్‌లో ఫిర్యాదు స్వీకరించి ఎఫ్ ఐ ఆర్ నమోదు చేయాలని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ పోలీసు అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ మంగళవారం ఒక ప్రకటనలో మాట్లాడుతూ ప్రజలు తమకు ఏవైనా సమస్యలు, ఇబ్బందులు లేదా నేరానికి సంబంధించిన ఫిర్యాదులు ఉంటే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలి. సమాచారం అందిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించి, అవసరమైన సందర్భాల్లో అక్కడికక్కడే ఆన్‌సైట్ ఎఫ్ ఐ ఆర్ నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టాలి అని ఆయన తెలిపారు. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు, అనారోగ్యంతో ఉన్నవారు, గాయపడిన బాధితులు, పిల్లలు,మైనర్లు, అత్యవసర పరిస్థితుల్లో ఉన్నవారు, అలాగే దూరప్రాంతాల్లో ఉన్న బాధితులకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలిబాధితుల భద్రత, గౌరవం, గోప్యతకు ప్రాధాన్యతనిస్తూ ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందించి, బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ప్రజలకు పోలీస్ శాఖ పై నమ్మకం మరింత పెరిగేలా ప్రతి పోలీస్ అధికారి సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలి అని ఎస్పీ తెలిపారు.

యువతలో ప్రతిభకు వేదిక.. జిల్లా స్థాయి సాంస్కృతిక పోటీలు

-ఈ నెల 17న పెద్దపల్లిలో నిర్వహణ
-జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి ఎ.సురేష్

పెద్దపల్లి జిల్లా ప్రతినిధి నవంబర్-10(విజన్ ఆంధ్ర)స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని 30వ జాతీయ యువజనోత్సవాల్లో భాగంగా జిల్లాస్థాయి సాంస్కృతిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి ఎ.సురేష్ తెలిపారు. 'వికసిత్ భారత్ యువ నాయకుల సంభాషణ ' 2027'లో భాగంగా 2026 ' 27 సంవత్సరానికి సంబంధించిన యువజనోత్సవాలను ఈ నెల 17న ఉదయం 9 గంటలకు పెద్దపల్లిలోని అమర్‌నగర్ సిరి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించనున్నట్లు మంగళవారం వెల్లడించారు. జిల్లాలోని 15 నుంచి 29 ఏళ్లలోపు యువతీ యువకుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించడమే పోటీల ముఖ్య ఉద్దేశమన్నారు. జానపద నృత్యం (గ్రూప్), జానపద గీతాలు (గ్రూప్), పెయింటింగ్, వీధి నాటకం (నుక్కడ్ నాటక్), కవిత్వ రచన విభాగాల్లో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో విజేతలుగా నిలిచిన వారికి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పిస్తామని, అక్కడ ఎంపికైన వారు జాతీయ స్థాయిలో సత్తా చాటవచ్చని వివరించారు. గత మూడేళ్లలో నిర్వహించిన జాతీయ యువజనోత్సవాల్లో పాల్గొన్న వ్యక్తులు, బృందాలు ఈ పోటీలకు అనర్హులని స్పష్టం చేశారు. ఒక్కో అభ్యర్థి ఒక విభాగంలో మాత్రమే పాల్గొనాలని సూచించారు. ఆసక్తి గల వారు మై భారత్ పోర్టల్‌లో నవంబరు 16లోపు నమోదు చేసుకోవాలి. రిజిస్ట్రేషన్ ప్రింట్‌అవుట్, ఆధార్ కార్డు ప్రతితో పాటు రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలను పోటీల రోజున రిజిస్ట్రేషన్ కౌంటర్‌లో అందజేయాలి. ఇతర వివరాలకు 9963960063 నంబరులో సంప్రదించాలని సురేష్ సూచించారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి



నారాయణపేట, నవంబర్ 10 (విజన్ ఆంధ్ర) నారాయణపేట పట్టణంలోని పేరపల్ల రోడ్డులో ఉన్న నిర్మానుష్య ప్రదేశంలో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మంగళవారం పోలీసులు దాడి నిర్వహించారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను పోలీసులు పట్టుకోగా, మరో ఐదుగురు అక్కడి నుంచి పరారయ్యారుపట్టుబడిన వారి వద్ద నుంచి పేకాటకు సంబంధించిన రూ. 5,025 నగదు, 4 సెల్‌ఫోన్లు, 6 ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పేకాట ఆడుతూ పట్టుబడిన నలుగురిపై గేమింగ్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. పరారైన వారి వివరాలను సేకరించి తదుపరి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. జిల్లాలో చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని, పేకాట, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ సూచించారు.

విద్యార్థినులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం, మెరుగైన వసతులు అందించాలి,

ఇంటర్మీడియట్‌లో 100 శాతం ప్రవేశాలు నమోదు చేయాలి, జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్



నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో (విజన్ ఆంధ్ర) నవంబర్ 10 కేజీబీవీల్లో చదువుకుంటున్న విద్యార్థినులకు నాణ్యమైన విద్యతో పాటు అన్ని రకాల మౌలిక వసతులు కల్పించేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ ఆదేశించారు. విద్యార్థినులకు మెరుగైన విద్యా ప్రమాణాలు, సౌకర్యవంతమైన వసతి, నాణ్యమైన భోజనం అందించడంతో పాటు వారి విద్యా ప్రగతికి అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు. మంగళవారం అచ్చంపేట మండల పరిధిలోని నడింపల్లి గ్రామంలో ఉన్న కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని (కేజీబీవీ) అచ్చంపేట సబ్ కలెక్టర్ సలోని చాబ్రాతో కలిసి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో అందుబాటులో ఉన్న మౌలిక వసతులు, విద్యార్థినులకు కల్పిస్తున్న సౌకర్యాలు, బోధన, భోజన ఏర్పాట్లు, ఇంటర్మీడియట్ కోర్సుల నిర్వహణ, విద్యార్థుల ప్రవేశాల నమోదు తదితర అంశాలను పాఠశాల పరిసరాలను పరిశీలించి పాఠశాల ప్రత్యేక అధికారిని కుసుమ ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సుమారు మూడు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న కేజీబీవీ పాఠశాల ఆవరణను పరిశీలించిన కలెక్టర్, పాఠశాల చుట్టూ నిర్మిస్తున్న ప్రహరీ గోడ పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. పాఠశాల భద్రత దృష్ట్యా ప్రహరీ గోడ నిర్మాణం ఎంతో ముఖ్యమని, నిర్మాణ పనుల్లో జాప్యం జరగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్దేశిత సమయంలోగా పనులను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పాఠశాలలో నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ కోర్సులు, విద్యార్థినుల ప్రవేశాల వివరాలను కలెక్టర్ తెలుసుకున్నారు. 160 మంది విద్యార్థులకు గాను 95 మంది విద్యార్థులు ఉన్నారని తెలుపగా, ఇంటర్మీడియట్ కోర్సుల్లో ప్రవేశాలు 100 శాతం నమోదయ్యేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని పాఠశాల ప్రత్యేక అధికారి కుసుమ ను కలెక్టర్ ఆదేశించారు. ప్రస్తుత కాలానికి అనుగుణంగా సాంకేతిక విద్యకు ప్రాధాన్యత పెరుగుతున్న నేపథ్యంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కోర్సులో నల్లమల్ల అటవీ ప్రాంతంలోని విద్యార్థినిలకు ఏఐ ఆధారిత విద్యను అందించేలా విద్యార్థినుల ప్రవేశాలు మరింత పెరిగేలా విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ కోర్సు ద్వారా విద్యార్థినులకు భవిష్యత్తులో అందుబాటులోకి వచ్చే అవకాశాలను వివరించి, వారిని ప్రోత్సహించలని సూచించారు. పాఠశాలలో పదో తరగతి విద్యార్థినులు తెలుగు సబ్జెక్టులో రాస్తున్న స్లిప్ టెస్టును జిల్లా కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. విద్యార్థినుల వద్దకు వెళ్లి పరీక్ష రాస్తున్న తీరును, ప్రశ్నలకు సమాధానాలు రాసే విధానాన్ని పరిశీలించారు. విద్యార్థినుల అభ్యసన సామర్థ్యాన్ని మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేయాలని సూచించారు. పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేలా విద్యార్థినులకు ప్రత్యేక తరగతులు నిర్వహించడంతో పాటు ప్రతి విద్యార్థినిపై వ్యక్తిగత శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. విద్యార్థినులకు పాఠ్యాంశాలపై పూర్తి అవగాహన కల్పిస్తూ, చదువులో వెనుకబడిన వారిని గుర్తించి అదనపు బోధన అందించాలని సూచించారు. కేవలం పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడమే కాకుండా, విషయ పరిజ్ఞానం పెంపొందించుకునేలా బోధన సాగాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థినులకు అందిస్తున్న భోజన సౌకర్యాలపై కూడా కలెక్టర్ ఆరా తీశారు. విద్యార్థినుల ఆరోగ్యం, పోషకాహార అవసరాలను దృష్టిలో ఉంచుకుని నాణ్యమైన, పౌష్టిక విలువలతో కూడిన భోజనం అందించాలని సూచించారు. వంటశాల, భోజనశాల పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని, తాగునీరు, మరుగుదొడ్లు, ఇతర వసతుల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అధికారులకు సూచించారు. పాఠశాలలో విద్యార్థినులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో చదువుకునేలా చర్యలు తీసుకోవాలని, వసతి గృహంలో పరిశుభ్రత, భద్రత, క్రమశిక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. విద్యార్థినుల అవసరాలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించాల్సిన బాధ్యత ఉందని తెలిపారు. ఇంటర్మీడియట్ విద్యార్థినులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అదనపు తరగతి గదులు, మరుగుదొడ్లు నిర్మించాల్సిన అవసరం ఉందని, క్రీడా ప్రాంగణాన్ని కూడా అభివృద్ధి చేయాలని పాఠశాల ప్రత్యేక అధికారి కుసుమ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్, అదనపు తరగతి గదుల నిర్మాణానికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యార్థినుల సంఖ్య, తరగతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తకుండా తగిన ప్రణాళిక రూపొందించాలని సూచించారు. అదేవిధంగా అవసరమైన మరుగుదొడ్ల సౌకర్యాల కల్పనకు చర్యలు చేపట్టాలని తెలిపారు. పాఠశాల ఆవరణలో ఉన్న క్రీడా మైదానాన్ని పరిశీలించిన కలెక్టర్, గ్రౌండ్‌ను పూర్తిస్థాయిలో లెవలింగ్ చేసి విద్యార్థినులకు అనువైన ఆటస్థలంగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థినులు చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరిచేలా ప్రోత్సహించాలని, శారీరక దృఢత్వం, మానసిక వికాసానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న విద్యా సౌకర్యాలను విద్యార్థినులు సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించేలా ఉపాధ్యాయులు, ప్రత్యేక అధికారి సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. కేజీబీవీలో విద్యా ప్రమాణాల పెంపు, మౌలిక వసతుల అభివృద్ధి, విద్యార్థినుల సంక్షేమం విషయంలో నిర్లక్ష్యానికి తావులేకుండా నిరంతరం పర్యవేక్షించాలని సంబంధిత అధికారులకు స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ వెంట నడింపల్లి గ్రామ సర్పంచ్ గోపి పద్మ, మండల విద్యాధికారి శ్రీనివాస మూర్తి, గ్రామ ప్రజలు తదితరులు ఉన్నారు.

కళ్యాణ లక్ష్మి, షాది ముభారక్ చెక్కులు పంపిణీ చేసిన కామారెడ్డి శాసన సభ్యులు కాటిపల్లి వెంకట రమణ రెడ్డి



కామారెడ్డి బ్యూరో నవంబర్ 10 (విజన్ఆంధ్ర)కామారెడ్డి నియోజకవర్గం లోని కామారెడ్డి,దోమకొండ, బిబిపేట్ ,బిక్నూర్ రామారెడ్డి, రాజంపేట ,పల్వంచ , కామారెడ్డి యం ఎల్ ఎ, క్యాంపు కార్యాలయంలో కళ్యాణ లక్ష్మి, షాది ముభారక్ లబ్ధిదారులకు కామారెడ్డి శాసన సభ్యులు కాటిపల్లి వెంకట రమణ రెడ్డి వివిధ గ్రామాలకు చెందిన వారికి కళ్యాణ లక్ష్మి, షాది ముభారక్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చెశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాజేంద్రనగర్‌లోని ఈవీఎం గోడౌన్‌ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి



రంగారెడ్డి జిల్లా బ్యూరో, నవంబర్ 10, (విజన్ ఆంధ్ర) : మంగళవారం రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లో ఉన్న ఈవీఎం ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ల గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి, ఐఏఎస్ సందర్శించి తనిఖీ నిర్వహించారు. సాధారణ నెలవారీ పరిశీలన కార్యక్రమంలో భాగంగా గోడౌన్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్, గోడౌన్‌కు ఏర్పాటు చేసిన సీల్స్‌ను తనిఖీ చేశారు. ఈవీఎంల భద్రత, నిల్వ మరియు పరిరక్షణకు సంబంధించి చేపడుతున్న చర్యలను సమీక్షించారు. ఈ సందర్భంగా బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీప్యాట్ యంత్రాలు మరియు ఇతర ఎన్నికల సామగ్రిని భద్రపరిచిన విధానాన్ని పరిశీలించారు. అలాగే గోడౌన్‌లో ఏర్పాటు చేసిన సీసీటీవీ నిఘా వ్యవస్థ పనితీరును తనిఖీ చేసి, నిరంతర పర్యవేక్షణ ఉండేలా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు.

అనంతరం ఈవీఎం గోడౌన్ వద్ద ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తు, భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఎన్నికల సామగ్రి భద్రత విషయంలో అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని, నిర్దేశించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా పటిష్టమైన భద్రతా చర్యలు కొనసాగించాలని అధికారులను ఆదేశించారు.
ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఆర్డీఓ శ్రీధర్, తహశీల్దార్, వేర్‌హౌస్ ఇన్‌చార్జి రాములు, ఎన్నికల విభాగం అధికారులు రవీంద్ర గుప్తా, పోలీసు అధికారులు మరియు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉద్యోగావకాశం

-ఈ నెల 13న పెద్దపల్లిలో జాబ్‌మేళా
-పీఎన్‌బీ మెట్‌లైఫ్‌లో 700 ఉద్యోగాలు
-జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం.రాజశేఖర్



పెద్దపల్లి జిల్లా ప్రతినిధి నవంబర్-10(విజన్ ఆంధ్ర)జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ప్రైవేటు రంగంలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈ నెల 13వ తేదీన శుక్రవారం పెద్దపల్లిలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం.రాజశేఖర్ తెలిపారు. జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం, తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) సంయుక్త ఆధ్వర్యంలో పీఎన్‌బీ మెట్‌లైఫ్ సంస్థలోని ఖాళీల భర్తీకి ఈ మేళా ఏర్పాటు చేసినట్లు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.సంస్థలో మొత్తం 700 ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. వీటిలో లైఫ్ ఇన్సూరెన్స్ మేనేజర్ 150, చీఫ్ ఇన్సూరెన్స్ మేనేజర్ 100, డిస్ట్రిబ్యూషన్ మేనేజర్ 150, లైఫ్ పోర్ట్‌ఫోలియో మేనేజర్ 300 పోస్టులు ఉన్నట్లు వివరించారు. ఇంటర్మీడియట్, డిగ్రీ, పీజీ విద్యార్హత కలిగిన 25 నుంచి 60 ఏళ్లలోపు స్త్రీ, పురుషులు అర్హులని తెలిపారు. ఎంపికైన వారికి ఏడాదికి రూ. 1.50 లక్షల నుంచి రూ. 3.60 లక్షల వరకు వేతనంతోపాటు ప్రోత్సాహకాలు అందజేస్తారని పేర్కొన్నారు.పెద్దపల్లి, రామగుండం, గోదావరిఖని, మంథని, మంచిర్యాల, కరీంనగర్ ప్రాంతాల్లో విధులు నిర్వహించాల్సి ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 13న ఉదయం 10 గంటలకు పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలురు)లోని టాస్క్ రీజినల్ సెంటర్‌కు చేరుకోవాలని సూచించారు. అప్‌డేటెడ్ బయోడేటా, విద్యార్హతల ధ్రువపత్రాల జిరాక్స్‌లు, ఆధార్ కార్డు ప్రతితోపాటు అనుభవం ఉన్నవారు ఎక్స్‌పీరియన్స్ లెటర్ తీసుకురావాలని కోరారు. ఇతర వివరాలకు 8985336947, 8121262441, 9182117078 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాము రైతులు ఎవరు అధైర్య పడవద్దు అడిషనల్ కలెక్టర్



సిద్దిపేట జిల్లా ప్రతినిధి నవంబర్ 10. విజన్ ఆంధ్ర సిద్దిపేట జిల్లాలో అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం రైతులు అధైర్యపడొద్దు. జిల్లా అదనపు కలెక్టర్ రెవిన్యూ లక్ష్మీ కిరణ్. సిద్దిపేట జిల్లాలో ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ 2026 27కు సంబంధించి రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు ఏర్పాటు చేసిన మొత్తం 418 ధాన్యం కొనుగోలు కేంద్రాలన్నీ ప్రారంభించబడి, ధాన్యం కొనుగోలుకు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉన్నాయని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీమతి కె. లక్ష్మి కిరణ్ తెలిపారు.జిల్లాలోని అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన మౌలిక వసతులు, సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు.ధాన్యం కొనుగోలులో ఎలాంటి జాప్యం జరగకుండా, రైతులు కేంద్రాలకు తీసుకువచ్చే నాణ్యమైన ధాన్యాన్ని (తాలూ) నిబంధనల ప్రకారం వెంటనే కొనుగోలు చేయాలన్నిర్రాజ నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే సంచుల్లో నింపి, కేటాయించిన రైస్ మిల్లులు లేదా గోదాములకు ఎలాంటి జాప్యం లేకుండా తరలించేందుకు అవసరమైన ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సూచించినట్లు పేర్కొన్నారుకావున రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావద్దని, ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేసేందుకు జిల్లాలోని అన్ని కొనుగోలు కేంద్రాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. రైతులు తమ ధాన్యాన్ని సమీపంలోని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి ప్రభుత్వ మద్దతు ధరను పొందాలని కోరార

ఎన్ ఎచ్ ఎం ల డిమాం డ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి

కేంద్ర ప్రభుత్వ న్యాయవాది రఘువీర్ యాదవ్



నారాయణపేట, నవంబర్ 10 (విజన్ ఆంధ్ర) రాష్ట్ర వ్యాప్తంగా నెల రోజులుగా ఎన్ ఎచ్ ఎం కాంట్రాక్ట్ ఉద్యో గులు నిరవ ధిక నమ్మె కొనసాగిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల కేంద్ర ప్రభుత్వ న్యాయ వాది రఘువీర్ యాదవ్ మంగళవారం ఒక ప్రకటనలో తీవ్రంగా విమర్శించారు. కాంగ్రెస్ మేని ఫెస్టో లో ఎన్ ఎచ్ ఎం కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇప్పటికీ నిలబెట్టుకోలేదనీ విమర్శించారు.ఇప్పటికైన సీఎం సానుకూలంగా స్పందించి, ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలనీ డిమాండ్ చేశారు. 7 రాష్ట్రాల్లో కాంట్రాక్ట్ ఉద్యోగులను, రెగ్యులరైజ్ చేశారనీ తెలిపారు.కాంట్రాక్ట్ ఉద్యోగుల న్యాయమైన అన్ని డిమాండ్లను ప్రభు త్వం అమలు చేయాలనీ డిమాండ్ చేశారు. ఉద్యోగులు ప్రజారోగ్యం కాపాడేందుకు అనేక సేవలు అందిస్తున్నారనీ అన్నారు. ప్రసూతి మరణా ల రేటు 25 శాతం నుంచి 19శాతానికితగ్గించారనీ,నవజాత శిశువుల మరణాల రేటు 15 శాతం నుంచి 5 శాతానికి గణనీయంగా తగ్గించారనీ కొనియాడారు. ఉద్యోగులు కృషితో 70 శాతం కాన్పులు హాస్పిటల్ లోజరుగుతున్నాయన్నారు.టీబీ ముక్త్ భారత్ లో ప్రజలకు అవగాహన కల్పిం చి, టీబీ నివారణ కోసం పని చేస్తున్నారనీ,అయినా ఉద్యోగులకు ప్రసూతి సెల వుల ఇవ్వడం లేదన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులకు జీతాలు సమయానికి ఇవ్వ డం లేదనీ విమర్శించారు.ఎన్ ఎచ్ ఎమ్మెల్యేకు బిజెపి అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే చర్యలు

మద్యం సేవించి పాఠశాలకు వచ్చిన హెచ్ఎం సస్పెండ్
సమావేశానికి ముందే వెళ్లిపోయిన మరో హెచ్ఎంపై చర్యలకు కలెక్టర్ ఆదేశాలు



అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 10(విజన్ ఆంధ్ర) విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన ఇద్దరు ప్రధానోపాధ్యాయులపై జిల్లా కలెక్టర్ కె.హరిత చర్యలు తీసుకున్నారు. విద్యార్థులకు ఆదర్శంగా ఉండాల్సిన ఉపాధ్యాయులు బాధ్యతా రాహిత్యంగా వ్యవహరించడాన్ని తీవ్రంగా పరిగణిస్తూ సస్పెన్షన్ వేటు వేశారు.తిర్యాణి మండలంలోని పీఎం శ్రీ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సంబరం శ్రీనివాస్ మద్యం సేవించి పాఠశాలకు వచ్చినట్లు గుర్తించడంతో ఆయనను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ కె.హరిత సోమవారం సంతకం చేశారు. ఉపాధ్యాయ వృత్తికి తగిన ప్రవర్తన పాటించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, ఇలాంటి చర్యలు విద్యా వ్యవస్థపై ప్రభావం చూపుతాయని అధికారులు పేర్కొన్నారు.సలుగుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవి విధులకు సంబంధించిన సమావేశం ప్రారంభానికి ముందే వెళ్లిపోవడాన్ని కలెక్టర్ తీవ్రంగా పరిగణించారు. సమావేశానికి హాజరై బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అధికారి ముందుగానే వెళ్లిపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ఆయనపై సస్పెన్షన్ చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారికి ఆదేశాలు జారీ చేశారు.విద్యా శాఖలో పనిచేసే అధికారులు, ఉపాధ్యాయులు విధి నిర్వహణలో క్రమశిక్షణ పాటించాలని, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ స్పష్టం చేశారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

-జంక్షన్ల వద్ద ఆక్రమణలు తొలగించి అభివృద్ధి పనులు చేపట్టాలి
-పశువులను రోడ్డుపై వదిలితే రూ.10 వేల జరిమానా
-అధికారులకు కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశం



పెద్దపల్లి జిల్లా ప్రతినిధి నవంబర్-10(విజన్ ఆంధ్ర)జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) జె. అరుణశ్రీతో కలిసి రోడ్డు భద్రత ప్రమాణాల అమలుపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పెద్దపల్లి పట్టణంలోని ప్రధాన కూడళ్ల వద్ద ఆక్రమణలను తొలగించి, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. హెచ్‌కేఆర్ సిబ్బంది, మున్సిపల్ అధికారులు, ట్రాఫిక్ పోలీసుల సమన్వయంతో అవసరమైన చోట రోడ్ల విస్తరణ చేపట్టాలని సూచించారు. వీధి వ్యాపారులతో మాట్లాడి విస్తరణ పనులకు సహకరించేలా చూడాలన్నారు. రోడ్డుపై పశువులను వదిలే వారిపై నిబంధనల ప్రకారం రూ. 10 వేల జరిమానా విధించడంతోపాటు వాటిని గోశాలలకు తరలించాలని స్పష్టం చేశారు.పట్టణంలోని డివైడర్లు, యూటర్న్‌లను పరిశీలించి ప్రమాదాల నివారణకు తగిన మార్పులుచేయాలని సూచించారు. రామగుండం నగరంలో అవసరమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలన్నారు. గతేడాది జిల్లావ్యాప్తంగా జరిగిన రోడ్డు ప్రమాదాలపై సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించారు. పట్టణ రహదారులపై రోడ్డు ట్రిప్స్, రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయాలని, రహదారుల పక్కన పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించాలని సూచించారు. లారీలు, ట్రాక్టర్లు, ఇతర భారీ వాహనాలు, కార్ల ముందు, వెనుక భాగాల్లో రేడియం స్టిక్కర్లు తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.ప్రతి పాఠశాల వద్ద స్కూల్‌జోన్ బోర్డులు ఏర్పాటు చేయాలని, హిట్ అండ్ రన్ కేసుల్లో బాధితులకు పరిహారం అందించేందుకు అవసరమైన ప్రతిపాదనలు త్వరగా పంపాలని పోలీసు అధికారులను ఆదేశించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణించడం, త్రిబుల్ రైడింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం, సీటు బెల్టు ధరించకపోవడం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం, అతివేగం వంటి ఉల్లంఘనలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. రోడ్డు భద్రత నిబంధనలపై ప్రచారం నిర్వహించాలని, ప్రమాదాల నివారణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ సమావేశంలో డిసిపి రామ్ రెడ్డి ,ఆర్ అండ్ బి ఈ ఈ భూప్ సింగ్,సంబంధిత శాఖల అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడల్లో మెరిసిన కామారెడ్డి పోలీస్ క్రీడాకారులు

విజేతలను అభినందించిన ఎస్పీ యం.రాజేష్ చంద్ర,



కామారెడ్డి బ్యూరో నవంబర్ 10(విజన్ఆంధ్ర)వరంగల్‌లో నిర్వహించిన 5వ తెలంగాణ రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడలు, క్రీడా పోటీలు 2026లో కామారెడ్డి జిల్లా పోలీసు సిబ్బంది అద్భుత ప్రతిభ కనబరిచి ఒక స్వర్ణం, ఎనిమిది కాంస్య పతకాలు సాధించి జిల్లా పోలీస్ శాఖకు గుర్తింపు తీసుకురాగా, పతకాలు సాధించిన క్రీడాకారులను జిల్లా పోలీస్ కార్యాలయానికి ఆహ్వానించిన జిల్లా ఎస్పీ శ్రీ యం. రాజేష్ చంద్ర, వారిని ప్రత్యేకంగా అభినందించి, వారి క్రీడా ప్రతిభను ప్రశంసించారు. బ్యాడ్మింటన్‌లో: భిక్కనూర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన బి. లక్ష్మి మహిళల 40 ప్లస్ సింగిల్స్ విభాగంలో స్వర్ణ పతకం సాధించారు. డీఏఆర్ కామారెడ్డికి చెందిన ఎల్. బాబాగౌడ్, బి. లక్ష్మి 40 ప్లస్ మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో కాంస్య పతకం సాధించారు.– ఖోఖోలోబీర్కూర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన డి. బుజ్జి కాంస్య పతకం సాధించారు.– హ్యాండ్‌బాల్‌లో డీఏఆర్ కామారెడ్డికి చెందిన ఎం. రేఖ, జి. శోభ, పిట్లం పోలీస్ స్టేషన్‌కు చెందిన కె. ప్రియాంక, బీర్కూర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన బి. సవితారాణి, పెద్దకొడప్‌గల్ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఛ. వాసవి కాంస్య పతకాలు సాధించారు.జిల్లా ఎస్పీ మాట్లాడుతూ“పోలీస్ విధులు నిర్వహిస్తూనే క్రీడల పట్ల ఆసక్తి, అంకితభావంతో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించడం ఎంతో సంతోషకరమైన విషయం. ఉద్యోగ బాధ్యతలతో పాటు కుటుంబ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ క్రీడల్లోనూ ప్రతిభ చాటుకోవడం వారి పట్టుదలకు, కృషికి నిదర్శనం. వీరి విజయాలు ఇతర మహిళా పోలీసు సిబ్బందికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయి. భవిష్యత్తులో జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని మరిన్ని పతకాలు సాధిస్తూ కామారెడ్డి జిల్లా పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నాను. పతకాలు సాధించిన క్రీడాకారులందరికీ ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నాను” అని ఎస్పీ యం. రాజేష్ చంద్ర, పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ శ్రీ కె. నరసింహ రెడ్డి, డీఎస్పీలు గటుమాల్, ఉదయ భాస్కర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ సంపత్, ఆర్ఐలు సంతోష్ కుమార్, నవీన్ మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమ కారుడు వేముల లక్ష్మణ్ గౌడ్ కుటుంబానికి బీఆర్ఎస్ అండగా ఉంటుంది

భార్యకు ఉద్యోగం కల్పిస్తాం: మాజీ మంత్రి,సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు.
లక్ష్మణ్ గౌడ్ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటాం..
అప్పుల భారం, జేసీబీ సీజ్, పంట నష్టం కుటుంబాన్ని ఇబ్బందులకు గురిచేశాయి.
భూమి ప్రొహిబిషన్ జాబితాలో ఉండటంతో తీవ్ర ఆందోళనకు గురయ్యారు.
ఎంజాయ్‌మెంట్ సర్వే నిర్వహించి భూమి సమస్యను పరిష్క రించాలి:
లక్ష్మణ్ గౌడ్ కుటుంబాన్ని పరామర్శించి 10 లక్షల ఆర్థిక సహాయం చేసిన హరీశ్ రావు, పల్లా రాజేశ్వర్ రెడ్డి.



బచ్చన్నపేట నవంబర్ 10(విజన్ ఆంధ్ర)మండలములో ఇటీవల మృతి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ కార్యకర్త వేముల లక్ష్మణ్ గౌడ్ కుటుంబాన్ని మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మంగళవారం పరామర్శిం చారు. బచ్చన్నపేట మండలం కొన్నే గ్రామానికి వెళ్లిన ఇరువురు నాయ కులు కుటుంబ సభ్యులతో మాట్లాడి... వారి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం లక్ష్మణ్ గౌడ్ చిత్రపటానికి పూలు చల్లి నివాళుల ర్పించారు. ఈ సందర్భంగా హరీశ్ రావు, పల్లా రాజేశ్వర్ రెడ్డిలు లక్ష్మణ్ కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరో సా ఇచ్చారు. అనంతరం మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు మాట్లాడుతూ తమ్ముడు వేముల లక్ష్మణ్ గౌడ్ మృతి అత్యంత బాధాకరమని విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటన తమ అందరినీ తీవ్రంగా కలచివేసిందని హరీశ్ రావు అన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు తాను, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి కలిసి కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పినట్లు వారు తెలిపారు. పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చామన్నారు.లక్ష్మణ్ గౌడ్ కొనుగోలు చేసిన జేసీబీని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మైనింగ్ కేసులో సీజ్ చేసి నెలల తరబడి పోలీస్ స్టేషన్‌లో ఉంచారని కుటుంబ సభ్యులు తెలిపినట్లు వెల్లడించారు. భారీగా పెనాల్టీలు విధించడంతో జేసీబీని విడిపించుకోలేకపోయారని, దీంతో అప్పుల భారం పెరిగిపోయిందని వివరించారు.లక్ష్మణ్ గౌడ్‌కు సొంతంగా ఉన్న ఏడు ఎకరాలతో పాటు మరో ఆరు ఎకరాలు కౌలుకు తీసుకుని వానాకాలం పంట సాగు చేసినట్లు తెలిపారు. దేవాదుల ప్రాజెక్టు తపాస్‌పల్లి ద్వారా కొన్నే గ్రామ చెరువుకు నీరు రావాల్సి ఉన్నప్పటికీ ఈ ఏడాది నీరు రాలేదని కుటుంబ సభ్యులు చెప్పినట్లు పేర్కొన్నారు.సరైన విద్యుత్ సరఫరా లేకపోవడంతో పాటు బోరు కూడా విఫలం కావడంతో పంట ఎండిపోయిందని, పెట్టిన పెట్టుబడి నష్టపోయి మరిన్ని అప్పులు చేయాల్సి వచ్చిందని కుటుంబ సభ్యులు వివరించినట్లు చెప్పారు. దాదాపు 60 నుంచి 70 ఏళ్లుగా వారసత్వంగా అనుభవిస్తున్న భూమి తాత, తండ్రి, కుమారుల పేర్ల పై ధరణి, రెవెన్యూ రికార్డుల్లో ఉన్నప్పటికీ, మరో వ్యక్తి ఆ భూమిపై హక్కు కోరుతూ దరఖాస్తు చేయడంతో కొత్త కలెక్టర్ ఆ భూమిని ప్రొహిబిషన్ జాబితాలో చేర్చినట్లు కుటుంబ సభ్యులు తెలిపారని పేర్కొన్నారు.భూమి ప్రొహిబిషన్ జాబితాలో ఉండటంతో అప్పులు తీర్చేందుకు దానిని విక్రయించే అవకాశం కూడా లేకుండా పోయిందని, ఈ పరిణామం లక్ష్మణ్ గౌడ్‌ను తీవ్ర ఆందోళనకు గురిచేసిందని కుటుంబ సభ్యులు వివరించినట్లు తెలిపారు.దీనిని దృష్టిలో ఉంచుకొని బీఆర్ఎస్ పార్టీ తరపున లక్ష్మణ్ గౌడ్ కుటుంబానికి 10 లక్షల ఆర్థిక సహాయం అందించినట్లు వెల్లడించారు. ఆయన భార్య, పిల్లలు, తల్లిదండ్రులు, సోదరుడికి పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. లక్ష్మణ్ గౌడ్ భార్యకు మంచి ఉద్యోగం ఇప్పించే బాధ్యతను తాము తీసుకుంటామని హామీ ఇచ్చారు. లక్ష్మణ్ గౌడ్ మంచి క్రమశిక్షణ కలిగిన పార్టీ కార్యకర్త అని, ఆయనను కోల్పోవడం తమ కుటుంబ సభ్యుడిని కోల్పోయినట్లుగా ఉందన్నారు.జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ వేముల లక్ష్మణ్ గౌడ్ తెలంగాణ ఉద్యమంలో, విద్యార్థి ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారని, 2014 తర్వాత తెలంగాణ పునర్నిర్మాణంలోనూ భాగస్వామిగా ఉన్నారని పల్లా రాజేశ్వర్ రెడ్డి గుర్తుచేశారు. ఆయన మృతి పట్ల బీఆర్ఎస్ పార్టీ తరపున తీవ్ర దిగ్భ్రాంతి, సంతాపం వ్యక్తం చేశారు.లక్ష్మణ్ గౌడ్ కుటుంబం తమ కుటుంబమని, ఉద్యమకారుల కుటుంబమని, పార్టీ కుటుంబమని పేర్కొన్నారు. ఆ కుటుంబాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత తమపై ఉందని, ఎవరెన్ని విమర్శలు చేసినా పట్టించుకోకుండా కుటుంబానికి అండగా నిలిచి ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ ఘటన నేపథ్యంలో హరీశ్ రావు స్వయంగా వచ్చి బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు సిద్ధపడటం అభినందనీయమని, బీఆర్ఎస్ పార్టీ జనగామ నియోజకవర్గం తరఫున ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా ఉద్యమకారులు, పార్టీ కార్యకర్తలు మరణించిన సందర్భాల్లో వారి కుటుంబాలకు అండగా నిలిచిన చరిత్ర తమ పార్టీకి ఉందని గుర్తుచేశారు.బాధిత కుటుంబానికి ఎలాంటి సహాయం చేయకుండా ప్రస్తుతం తమను విమర్శిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి కొమ్మూరి తీరును తప్పుబట్టారు. గతంలో ఎమ్మెల్యే పదవిని రాజశేఖర్ రెడ్డి కాళ్ల దగ్గర పెట్టిన వారు ఇప్పుడు తమను విమర్శించడం హాస్యాస్పదమని వ్యాఖ్యానించారు. ఉద్యమకారుల పేరుతో రాజకీయం చేస్తూ విమర్శలు చేయడం సరికాదని మండిపడ్డారు.గతంలో పనిచేసిన కలెక్టర్ హయాంలో జేసీబీ అమ్మకం విషయంలో కొన్ని ఇబ్బందులు తలెత్తాయని తెలిపారు. బచ్చన్నపేట ప్రాంత ప్రజలకు విద్యుత్, నీటి సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.లక్ష్మణ్ గౌడ్ కుటుంబం ఎన్నో సంవత్సరాలుగా అనుభవిస్తున్న భూమి విషయంలో ప్రస్తుత కలెక్టర్ ప్రత్యేకంగా స్పందించాలని కోరారు. ఎంజాయ్‌మెంట్ సర్వే నిర్వహించి, క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను పరిశీలించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని పార్టీ తరపున విజ్ఞప్తి చేశారు.లక్ష్మణ్ గౌడ్ కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ ఎప్పటికీ అండగా ఉంటుందని, ఆ కుటుంబాన్ని ఆదుకునే బాధ్యత తమదేనని పల్లా రాజేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జనగామ నియోజకవర్గ బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, ఉద్యమకారులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విద్య, పారిశుధ్యానికి ప్రాధాన్యం పాఠశాలలు, పంచాయతీ కార్యాలయాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ కె. హరిత



రెబ్బెన, నవంబర్ 10 (విజన్ ఆంధ్ర): కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అధికారులను ఆదేశించారు. మంగళవారం మండలంలో పర్యటించిన కలెక్టర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను స్వయంగా పరిశీలించారు. ఇంగ్లీష్, గణితం, సైన్స్ సబ్జెక్టులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని ఆదేశించారు.అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులు, క్యాష్‌బుక్‌ల నిర్వహణను పరిశీలించారు. రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇంటి పన్నుల వసూళ్లను వంద శాతం పూర్తి చేయాలని, పంచాయతీకి సంబంధించిన రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నమోదు చేయాలని కార్యదర్శిని ఆదేశించారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. పంచాయతీ పరిపాలనలో నిర్లక్ష్యానికి తావులేకుండా అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, గ్రామపంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టుకున్న పోలీసులు




మాగనూరు, నవంబర్ 10(విజన్ ఆంధ్ర) ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను మగనూర్ పోలీసులు పట్టుకుని స్వాధీనం చేసుకున్నారు. మండల పరిధిలోని మందిపల్లి గ్రామ శివార్లలో పోలీసులు చేపట్టిన పెట్రోలింగ్‌లో ఈ అక్రమ ఇసుక రవాణా వాహనాలను పట్టుకున్నారు. ఎస్ ఐ మహేందర్ రెడ్డి వివరాల ప్రకారం.. మందిపల్లి గ్రామ శివారులోని పెద్దవాగు నుంచి ఇసుక లోడ్‌తో వస్తున్న రెండు ట్రాక్టర్లు పోలీసుల కంటపడ్డాయి. వాటిని ఆపి తనిఖీ చేయగా, ఇసుక రవాణాకు సంబంధించి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు, ధ్రువీకరణ పత్రాలు లేకపోవడం గుర్తించారు.దీంతో పోలీసులు ఇసుకతో సహా రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్యవైశ్యులు సమాజ సేవలో ముందుండాలి దీపావళి ప్రీత్ మిలన్‌లో ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్ బాబు



కాగజ్‌నగర్, నవంబర్ 10 (విజన్ ఆంధ్ర): ఆర్యవైశ్యులు వ్యాపార రంగంలోనే కాకుండా సమాజ సేవా కార్యక్రమాల్లోనూ ముందుండాలని సిర్పూర్ ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్ బాబు అన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి కళ్యాణ మండపంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చిలువేరు గంగాధర్ ఆధ్వర్యంలో దీపావళి ప్రీత్ మిలన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే హరీష్ బాబు జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం ఆర్యవైశ్య సంఘం సభ్యులకు, పట్టణ ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్యవైశ్యులు వ్యాపార రంగంలో తమదైన గుర్తింపు సంపాదించడంతో పాటు సేవా కార్యక్రమాల ద్వారా సమాజానికి అండగా నిలవడం అభినందనీయమని పేర్కొన్నారు. పేదలకు సహాయం చేయడం, విద్యార్థులను ప్రోత్సహించడం, నిరుపేద కుటుంబాలకు అవసరమైన సహకారం అందించడం వంటి కార్యక్రమాలను మరింత విస్తరించాలని సూచించారు. సమాజంలో ఐక్యత, పరస్పర సహకారం, సేవాభావం పెంపొందించుకోవాలని అన్నారు.ప్రస్తుత ఆర్థిక పరిస్థితులపై స్పందిస్తూ మార్కెట్‌లో నగదు చలామణి తగ్గడం వల్ల ప్రజల కొనుగోలు శక్తి పడిపోయిందని అభిప్రాయపడ్డారు. వ్యాపార రంగం అభివృద్ధి చెందాలంటే ప్రజల చేతుల్లో నగదు ఉండాలని, ఆర్థిక వ్యవస్థలోకి నిధుల ప్రవాహం పెరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు కృషి చేయాలని తెలిపారు.దీపావళి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపాలని, కుటుంబాల్లో సుఖసంతోషాలు, సిరిసంపదలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ఇటువంటి ఆత్మీయ సమ్మేళనాలు సంఘ సభ్యుల మధ్య ఐక్యతను పెంపొందించడంతో పాటు పరస్పర సంబంధాలను బలోపేతం చేస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం, యువజన సంఘం, మహిళా సంఘం, బాలబాలికల సంఘం, భజన మండలి సభ్యులు, సంఘ పెద్దలు, పట్టణ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

ఎం ఎం ఐ సి అధికారులతో సమీక్షా సమావేశం



మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నవంబర్ 10 (విజన్ ఆంధ్ర బ్యూరో): కాప్రా మున్సిపల్ కార్యాలయంలో ఉప్పల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, ఆధ్వర్యంలో వివిధ ప్రజా సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలపై ఎం ఎం ఐ సి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ఉప్పల్ నియోజకవర్గంలోని వివిధ డివిజన్ల మాజీ కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులతో కలిసి పాల్గొన్న మీర్పేట్ హెచ్‌బీ కాలనీ మాజీ కార్పొరేటర్ జేరిపోతుల ప్రభుదాస్.ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ ప్రభుదాస్ మాట్లాడుతూ, ముఖ్యంగా బండబావి ప్రాంతంలో మల్టీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు త్వరితగతిన చేపట్టాలని, స్ట్రీట్ లైట్ల సమస్యపై తగిన చర్యలు తీసుకోవాలని, కృష్ణ నగర్ కాలనీకి సంబంధించి బాక్సు నిర్మాణం, ఎన్టీఆర్ నగర్ లో సిడిఎస్ బిల్డింగ్ అదనపు గదులు, ఓపెన్ జిమ్ మరియు వివిధ కాలనీలలో కమ్యూనిటీ హాల్స్ తదితర అంశాలపై అవసరమైన విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

పంటల సాగుపై రైతులకు అవగాహన ఒడ్డుగూడ, చిన్నరసపల్లి, మొట్లగూడ గ్రామాల్లో వ్యవసాయ అధికారి క్షేత్ర సందర్శన

దహెగాం, నవంబర్ 10 (విజన్ ఆంధ్ర): కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా దహెగాం మండలంలోని ఒడ్డుగూడ, చిన్నరసపల్లి, మొట్లగూడ గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ క్షేత్రస్థాయిలో పర్యటించి వివిధ పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు సాగు చేస్తున్న మిర్చి, కంది పంటలను పరిశీలించి, పంటల ప్రస్తుత పరిస్థితి, చీడపీడల నివారణ చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అలాగే ఎల్‌నినో ప్రభావంతో వాతావరణంలో చోటుచేసుకునే మార్పులు, వాటి ప్రభావం పంటలపై ఎలా ఉంటుందనే విషయాలను రైతులకు వివరించారు.

ప్రస్తుతం కంది పంట పూత దశలో ఉందని, ఈ సమయంలో శనగ పచ్చ పురుగు, మచ్చల పురుగు ఆశించే అవకాశం ఉందని తెలిపారు. పురుగుల ఉధృతిని బట్టి వ్యవసాయ శాఖ సూచించిన మందులను సరైన మోతాదులో వినియోగించాలని సూచించారు. అదేవిధంగా మిర్చి సాగులో పొలం చుట్టూ జొన్న, మొక్కజొన్న పంటలను రక్షణ పంటలుగా సాగు



చేయడం వల్ల పురుగుల బెడదను తగ్గించుకోవచ్చని వివరించారు. మిర్చి పంటకు పొగాకు లద్దె పురుగు ఆశించే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రైతులు పంటల పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనిస్తూ వ్యవసాయ అధికారుల సలహాలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఒడ్డుగూడ సర్పంచ్ శంకర్, రైతులు పాల్గొన్నారు.

సామాజిక సేవకుడు ఆయిల్లా శంకర్‌కు ఘన సన్మానం

దళిత రత్న అవార్డు అందుకున్న సందర్భంగా మాదిగ జాగృతి సంఘం ఆధ్వర్యంలో అభినందనలు

కాగజ్‌నగర్, నవంబర్ 10 (విజన్ ఆంధ్ర): కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన సామాజిక సేవకుడు ఆయిల్లా శంకర్‌కు దళిత రత్న అవార్డు లభించడంతో మాదిగ జాగృతి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ నిరంతరం ప్రజలకు సేవలందిస్తున్న ఆయిల్లా శంకర్‌కు అవార్డు రావడం పట్ల సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా అభినందించారు.సమాజంలో పేదలు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన చేస్తున్న సేవలు అభినందనీయమని సంఘం బాధ్యులు పేర్కొన్నారు. సామాజిక బాధ్యతతో ప్రజా సంక్షేమం కోసం పనిచేయడం గొప్ప విషయమని అన్నారు. సమాజంలో వెనుకబడిన వర్గాలకు అండగా నిలుస్తూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడం అభినందించదగిన విషయమని తెలిపారు. సేవా కార్యక్రమాల ద్వారా ప్రజల్లో గుర్తింపు పొందిన ఆయిల్లా శంకర్‌కు దళిత రత్న అవార్డు లభించడం ఆయన సేవాభావానికి దక్కిన గౌరవంగా అభివర్ణించారు.ఈ అవార్డు ఆయనకు మరింత ప్రోత్సాహాన్ని అందిస్తుందని, భవిష్యత్తులో మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షించారు.




అవార్డులు వ్యక్తిగత గౌరవంతో పాటు సమాజం పట్ల మరింత బాధ్యతను పెంచుతాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు. యువత కూడా సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములై సమాజ అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు.అనంతరం ఆయిల్లా శంకర్ సంఘం బాధ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. తన సేవలను గుర్తించి సన్మానించడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాదిగ జాగృతి సంఘం నాయకులు, సంఘ బాధ్యులు, ఉద్యోగస్థులు, పలువురు ప్రముఖులు పాల్గొని ఆయిల్లా శంకర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

పొగాకు, ధూమపానం, మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై విస్తృత అవగాహన కల్పించాలి

విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీను.

నారాయణపేట ప్రతినిధి , నవంబర్ 10 (విజన్ ఆంధ్ర) నారాయణపేట జిల్లాను పొగాకు, ధూమపానం, మత్తు పదార్థాల రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజల్లో విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీను అధికారులకు సూచించారు.మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో పొగాకు నియంత్రణ, మత్తు పదార్థాల నివారణకు సంబంధించి జిల్లా స్థాయి కోఆర్డినేషన్ కమిటీ సమావేశాన్ని అదనపు కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు వినియోగం, ధూమపానం, ఇతర మత్తు పదార్థాల అలవాట్లు వ్యక్తుల ఆరోగ్యంతో పాటు కుటుంబాలు, సమాజంపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా యువత చిన్న వయస్సులోనే ఇటువంటి వ్యసనాలకు లోనుకాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ మరియు ప్రైవేట్ హాస్టళ్లలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. విద్యార్థులకు పొగాకు ఉత్పత్తులు, సిగరెట్లు, గుట్కా, ఇతర మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనారోగ్య సమస్యలు, దీర్ఘకాలిక దుష్ప్రభావాల గురించి



వివరించాలన్నారు. చిన్న వయస్సులోనే చెడు అలవాట్లకు బానిసలైతే వారి విద్యాభ్యాసం, భవిష్యత్తు, వ్యక్తిత్వ వికాసంపై తీవ్ర ప్రభావం పడుతుందని తెలిపారు.విద్యాసంస్థల పరిసరాల్లో పొగాకు ఉత్పత్తుల విక్రయాలను నిరోధించేందుకు సంబంధిత శాఖల అధికారులు నిరంతరం తనిఖీలు నిర్వహించాలని సూచించారు. విద్యార్థులకు కేవలం అవగాహన కల్పించడమే కాకుండా, వారు మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.పొగాకు, ధూమపానం, మత్తు పదార్థాల వినియోగం వల్ల క్యాన్సర్, గుండె సంబంధిత వ్యాధులు, ఊపిరితిత్తుల సమస్యలు తదితర తీవ్రమైన ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. యువత చెడు వ్యసనాలకు ఆకర్షితులు కాకుండా క్రీడలు, విద్య, సామాజిక సేవ వంటి

2రివ రోజుకు చేరుకున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల రిలే దీక్షలు

సమ్మెకు ఏఐకేఎంఎస్, పీడీఎస్‌యూ నాయకుల సంఘీభావం

న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్

నారాయణపేట ప్రతినిధి, నవంబర్ 10 (విజన్ ఆంధ్ర) తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) కాంట్రాక్ట్ ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 29వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా నారాయణపేట జిల్లా కేంద్రంలో కొనసాగుతున్న దీక్షా శిబిరాన్ని ఏఐకేఎంఎస్ నాయకులు ప్రశాంత్, పీడీఎస్‌యూ నాయకులు సాయికుమార్, వెంకటేష్, భాస్కర్ సందర్శించి తమ సంఘాల తరఫున సమ్మెకు సంఘీభావం తెలిపారుఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తున్నారని, గ్రామీణ స్థాయి నుంచి పట్టణ ప్రాంతాల వరకు వైద్య సేవలను ప్రజలకు చేరవేయడంలో నిరంతరం శ్రమిస్తున్నారని పేర్కొన్నారు. అలాంటి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. ఉద్యోగులు ఎన్నో ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్నారని, ఉద్యోగ



భద్రత లేకుండా పనిచేయాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయడంతో పాటు వారి సమస్యలపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల పోరాటానికి తమ సంఘాల సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎం యూనియన్ జిల్లా కోశాధికారి రాఘవేందర్, సభ్యులు నరసింహారావు సగరి, మోనేష్ చారి, తిరుపతి, శ్రీలత, నవ్య దీప్తి, శ్వేత శ్రీ, అన్వేష్, కిరీటి, విరోజా, అనురాధ, వెంకట్ స్వామి, వినోద్, సోహెల్ మునీర్, రామేశ్వరి, నాగజ్యోతి, సుమిత్ర, అలివేలు తదితరులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి ప్రభుత్వ భూముల వేలాన్ని అడ్డుకుంటాం

ప్రజా అవసరాలకు కేటాయించాల్సిన భూములను విక్రయించడం దారుణం: ఎంపీ ఈటల రాజేందర్, కంచె చేను మేసిన చందంగా ప్రభుత్వమే భూములను అమ్ముకుంటోంది: వడ్డేపల్లి రాజేశ్వరరావు,

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నవంబర్ 10 (విజన్ ఆంధ్ర బ్యూరో):ప్రజా అవసరాల కోసం కేటాయించిన కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు ప్రభుత్వ భూములతో పాటు, కూకట్‌పల్లి హుడా ట్రక్ పార్క్ స్థలాన్ని వేలం వేయవద్దని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గ శాఖ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఫోరం మాల్ చౌరస్తా వద్ద చేపట్టిన ఈ నిరసనలో మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ ముఖ్య అతిథిగా పాల్గొని ,ప్రభుత్వ భూముల విక్రయ ప్రతిపాదనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా స్థానిక కాలనీవాసులు తమ ప్రాంతంలోని ప్రభుత్వ భూముల వేలం ప్రతిపాదనతో ఎదురవుతున్న సమస్యలు, ఆందోళనలను ఎంపీ ఈటల రాజేందర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలు సమర్పించిన వినతిపత్రాలను స్వీకరించిన ఆయన వారి సమస్యలను సావధానంగా విన్నారు.అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో ఈటల రాజేందర్ మాట్లాడుతూ, కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు ఏర్పాటు సమయంలోనే భవిష్యత్తు తరాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పార్కులు, క్రీడా మైదానాలు, ఇతర ప్రజోపయోగ సదుపాయాల కోసం ఎమినిటీస్ స్థలాలను కేటాయించారని గుర్తుచేశారు. అప్పట్లో పట్టణ శివారు ప్రాంతంగా ఉన్న కూకట్‌పల్లిలో ట్రక్ పార్కింగ్ అవసరాల కోసం రైతుల నుంచి భూములు సేకరించి ట్రక్ పార్క్‌కు కేటాయించారని తెలిపారు. అలాంటి భూములను నేడు ప్రజా అవసరాలను పక్కనపెట్టి విక్రయించేందుకు ప్రభుత్వం సిద్ధపడటం సరికాదని అన్నారు.ఇప్పటికే అధిక జనాభా, విపరీతమైన ట్రాఫిక్‌తో కూకట్‌పల్లి ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇలాంటి పరిస్థితుల్లో అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూములను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడం దారుణమని విమర్శించారు. ప్రజలకు పార్కులు, ఆటస్థలాలు, పచ్చదనం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. ఒక ఎకరంలో 2,750 చదరపు గజాల్లో నిర్మాణాలు చేపట్టి, మిగిలిన స్థలాన్ని ప్రజా అవసరాలకు వినియోగించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.గతంలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములను కాపాడుతామని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇప్పుడు ప్రభుత్వ భూములను ఎందుకు విక్రయిస్తున్నారని ఈటల రాజేందర్ ప్రశ్నించారు. రాష్ట్రప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారిలా వ్యవహరిస్తోందని తీవ్ర విమర్శలు చేశారు. కూకట్‌పల్లి ట్రక్ పార్క్ కోసం రైతుల నుంచి సేకరించిన భూములను విక్రయించాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. ప్రభుత్వ భూముల విక్రయాలను ప్రశ్నిస్తున్న ప్రజలను పోలీసుల ద్వారా భయభ్రాంతులకు గురిచేయడం, అరెస్టులతో అణచివేయాలని చూడటం సరికాదన్నారు.ఈ నెల 12న జరగనున్న హౌసింగ్ బోర్డు భూముల వేలాన్ని బీజేపీ తరఫున కాలనీవాసులతో కలిసి అడ్డుకుంటామని, ప్రజలకు ఉపయోగపడాల్సిన భూములను కాపాడే వరకు పోరాటం కొనసాగిస్తామని ఈటల రాజేందర్ స్పష్టం చేశారు.బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ, అధికారంలో ఉన్న ప్రభుత్వమే ప్రజలకు ఉపయోగపడాల్సిన ఆస్తులను విక్రయించి లబ్ధి పొందాలనే ధోరణితో వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రజల అవసరాలు, భవిష్యత్తు తరాల ప్రయోజనాలను విస్మరించి తీసుకుంటున్న నిర్ణయాలను ప్రజలు సహించబోరని అన్నారు. కె.పి. హెచ్.బి లో ప్రభుత్వ భూములు, కూకట్‌పల్లి హుడా ట్రక్ పార్క్ భూముల వేలం ప్రక్రియను తక్షణమే నిలిపివేసి, ఆ భూములను పూర్తిగా ప్రజా అవసరాలకే కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి జిల్లా బీజేపీ అధ్యక్షులు గిరి వర్ధన్ రెడ్డి, నిజామాబాద్ జిల్లా ఇన్‌చార్జి మాధవరం కాంతారావు, మూసాపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ కోడిచెర్ల మహేందర్, కె.పి. హెచ్.బి డివిజన్ కంటెస్టెడ్ కార్పొరేటర్ ప్రీతం రెడ్డి, బీజేపీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, వివిధ మోర్చాల నాయకులు, కార్యకర్తలు, కాలనీ అసోసియేషన్ సభ్యులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గెజిటెడ్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్‌కు దీపావళి శుభాకాంక్షలు



మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా నవంబర్ పది (విజన్ ఆంధ్ర బ్యూరో):మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ మను చౌదరిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షులు, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి జి. వినోద్ కుమార్, కార్యదర్శి కురుమూర్తి, ఉపాధ్యక్షులు సాంబశివరావు డి ఆర్ డి ఓ, రవీందర్, కిషన్ నాయక్, క్రీడా కార్యదర్శి హరికృష్ణ, డి ఎం సివిల్ సప్లై, సుగుణ భాయి, జిల్లా ఉపాధికల్పన అధికారి రాధిక, సీఈఓ కాంతమ్మ, డి.టి.ఓ వెంకటేశ్వర్లు, డి.పి.ఆర్.ఓ, స్వర్ణలత , ఏ ఎస్ డబ్ల్యూ ఓ గోపి చంద్ తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దీపావళి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపాలని, ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని, జిల్లా అభివృద్ధి మరియు ప్రజాసేవలో అధికారులు మరింత సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు.

ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే అమ్మాలి షాపులు తనిఖీలు చేసిన అధికారులు

సిద్దిపేట జిల్లా ప్రతినిధి 10 నవంబర్(విజన్ ఆంధ్ర) సిద్దిపేట పట్టణంలో ప్రభుత్వము నిర్దేశించిన ధరల మేరకు సన్న బియ్యం అమ్మకాల జరిగేలా పౌర సరఫరాల శాఖ, తూనికలు, కొలతలు శాఖ అధికారులు తనిఖీలు చేశారు. అందులో భాగంగా రత్నదీప్ సూపర్ మార్కెట్, మోర్ సూపర్ మార్కెట్, నేషనల్ సూపర్ మార్కెట్, శ్రీ రాజ మల్లికార్జున రైస్ డిపో మరియు శేషాద్రి రైస్ డిపో లయందు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు, జిల్లా లీగల్ మెట్రాలజీ(జిల్లా తూనికలు మరియు కొలతలు) అధికారి శివరంజని మరియు సహాయ పౌరసరఫరాల అధికారి సాయి రవి తో కలిసి యుక్తముగా తనిఖీలు చేపట్టడం జరిగింది.పై తనిఖీలలో శ్రీ రాజ మల్లికార్జున రైస్ డిపో నందు తూకము విషయంలో తేడాలు గమనించి అట్టి షాపుపై కేసు నమోదు చేసినట్లు జిల్లా పౌరసరఫరాల అధికారి మరియు జిల్లా కొలతల అధికారి తెలిపారు.

సిటీలో హై-ఎండ్ ఓవర్ సప్లై

హైదరాబాద్, నవంబర్ 10 కోవిడ్ తదుపరి కాలంలో హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో రూ. 2 కోట్లు, అంతకంటే ఎక్కువ విలువైన లగ్జరీ,అల్ట్రా-లగ్జరీ ఇళ్లకు విపరీతమైన డిమాండ్ కనిపించింది. దాంతో ప్రముఖ బిల్డర్లు, డెవలపర్లు అంతా తమ దృష్టిని లగ్జరీ అపార్ట్‌మెంట్లు, విల్లాల నిర్మాణాలపైనే కేంద్రీకరించారు. అయితే, ఆశించిన స్థాయిలో కొనుగోళ్లు జరగకపోవడం , వరుసగా కొత్త ప్రాజెక్టులు ప్రారంభమవ్వడంతో ప్రస్తుతం భాగ్యనగరంలో లగ్జరీ విభాగంలో అమ్ముడవని గృహాల సంఖ్య గణనీయంగా పెరిగిపోయి హై-ఎండ్ ఓవర్ సప్లై పరిస్థితి ఏర్పడింది.నగరంలో భూముల ధరలు, నిర్మాణ వ్యయం పెరగడంతో పాటు ఇళ్ల ధరలు సైతం సామాన్యులకు అందుబాటులో లేకుండా పెరిగిపోవడం కొనుగోలుదారుల్లో నిరాశను నింపింది. రూ. 2 కోట్ల పైబడిన ఆస్తులను కొనుగోలు చేసే సామర్థ్యం ఉన్న ఉన్నత వర్గాల డిమాండ్ ఒక స్థాయికి చేరుకుని సంతృప్త స్థితికి రావడంతో, మార్కెట్‌లో భారీగా నిర్మించిన లగ్జరీ ఫ్లాట్లు అమ్ముడవకుండా మిగిలిపోతున్నాయి. ఇది డెవలపర్ల మూలధనం నిలిచిపోయేలా చేసి, ప్రాజెక్టు నిర్వహణపై తీవ్ర ఒత్తిడిని పెంచుతోంది.ఈ సవాలును అధిగమించేందుకు నగర రియల్టర్లు తమ వ్యూహాన్ని వేగంగా మార్చుకుంటున్నారు.

సానుకూల కార్యక్రమాల వైపు మళ్లించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు.గ్రామాలు, పట్టణాలు, బస్టాండ్లు, రద్దీ ప్రాంతాలు, విద్యాసంస్థలు, హాస్టళ్లలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, పోస్టర్లు, కరపత్రాలు, ర్యాలీలు, సమావేశాలు, ప్రతిజ్ఞ కార్యక్రమాల ద్వారా ప్రజలకు సందేశాన్ని చేరవేయాలని సూచించారు. పొగాకు ఉత్పత్తుల వినియోగం, విక్రయాలపై సంబంధిత చట్ట నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.జిల్లాలో అక్టోబర్ 28వ తేదీ నుంచి డిసెంబర్ 28వ తేదీ వరకు రెండు నెలల పాటు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా అన్ని ప్రభుత్వ శాఖలు భాగస్వాములై తమ పరిధిలో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యంగా వైద్య ఆరోగ్య శాఖ, విద్యాశాఖ, పోలీస్ శాఖ, సంక్షేమ శాఖలు పరస్పర సమన్వయంతో కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని తెలిపారు.పొగాకు, మత్తు పదార్థాల వినియోగాన్ని నియంత్రించడం ఒక్క శాఖ బాధ్యత మాత్రమే కాదని, ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలని పేర్కొన్నారు. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం కోసం ప్రజలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, యువత, స్వచ్ఛంద సంస్థలు అందరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.నారాయణపేట జిల్లాను పొగాకు, ధూమపానం, మత్తు పదార్థాల రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అదనపు కలెక్టర్ కోరారు.ఈ సమావేశంలో సంబంధిత శాఖల జిల్లా స్థాయి అధికారులు, కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కరువు సాయంను వెంటనే ప్రకటించాలి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు విఎస్ బోస్ డిమాండ్,

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నవంబర్ 10 (విజన్ ఆంధ్ర బ్యూరో):సిపిఐ తెలంగాణ రాష్ట్ర సమితి పిలుపు మేరకు నేడు భారత కమ్యూనిస్టు పార్టీ మేడ్చల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో కరువు వల్ల ఉపాధి కోల్పోతున్న మరియు పంట నష్టం తో ఇబ్బంది పడే రైతులను కార్మికులను ఆదుకోవాలనే డిమాండ్ తో నేడు మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ ఎదురుగా ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి ఎస్ బోస్ గారు పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మేడ్చల్ జిల్లాలోని ఐదు మండలాలను కరువు ప్రాంతంగా ప్రకటించకపోవడం వల్ల అక్కడి రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. కాబట్టి వెంటనే జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి 15 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కరువు వల్ల ఉపాధి కోల్పోయే పట్టణ ప్రాంత కార్మికులకు విభిజి రాంజీ ద్వారా ఉపాధి హామీని కల్పించాలని ,ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా 14 రకాల నిత్యవసర వస్తువులను ప్రజలకు ఉచితంగా అందించాలని, పంట నష్టపోయే రైతులకు కుటుంబానికి 50వేల రూపాయలు తక్షణ సహాయాన్ని ప్రకటించాలని, మంచినీటికి కొరత లేకుండా ఇప్పటి నుండే తగిన చర్యలు తీసుకోవాలని, విద్యుత్తు నిరంతరాయంగా అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అఖిల పక్షాన్ని పిలిచి తీసుకున్నటువంటి



అభిప్రాయాలను తక్షణమే అమలు పరచాలని కేవలం సమావేశాలు నిర్వహించి ప్రకటనలకు పరిమితం కాకుండా చేతల్లో చూపాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రానున్న రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా ప్రజల్ని కూడగట్టి పెద్ద ఎత్తున పోరాటాన్ని నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్ మాట్లాడుతూ, ఎల్ నినో అనే కరువు వల్ల నష్టపోతున్నది పేద, మధ్య తరగతి వరకు ప్రజలేనని కానీ దానికి ప్రధాన కారణం పర్యావరణ కాలుష్యం అని, ఆ పర్యావరణ కాలుష్యానికి మైనింగ్ మరియు అడవుల నరికివేత వల్లే నని అన్నారు. అడవులను నరికివేసి, మైనింగ్ చేసే పెట్టుబడిదారులు అధిక లాభాలు ఆర్జిస్తూ పర్యావరణ కాలుష్యానికి కారణమై పేద ప్రజలకు నష్టం చేకూరుస్తున్నారని కావున కేంద్ర ప్రభుత్వం పర్యావరణ కాలుష్య కారకులైనటువంటి పెట్టుబడిదారీ వర్గాలపై పన్నులను పెంచి, పేద ప్రజలపై ఉన్న పన్నును తగ్గించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం నీటి లభ్యత లేని రాష్ట్రాలకు మిగులు ఉన్న రాష్ట్రాల నుండి మంచినీటిని సరఫరా చేసి ప్రజలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం కూడా తక్షణ ప్యాకేజీని ప్రకటించి ప్రజలలో మనోధైర్యాన్ని నింపి వారి సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రధానంగా కేంద్ర ప్రభుత్వం పైనే ఉన్నదని అన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా నిత్యవసర వస్తువులను అందించాలని బ్లాక్ మార్కెట్ కి కారణమైనటువంటి నూతన వ్యవసాయ చట్టాలను రద్దుచేసి రైతాంగానికి ఉపయోగపడేలా చట్టాలను చేయాలని పట్టణ ప్రాంత ప్రజలకు కూడా ఉపాధి హామీ ద్వారా ఉద్యోగ భద్రతను కల్పించాలని డిమాండ్ చేశారు ఈ కరువును రాష్ట్ర ప్రభుత్వముల పై వదలకుండా కేంద్రమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా డిప్యూటీ కలెక్టర్ విజయేందర్ రెడ్డి గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా ప్రజానాట్యమండలి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చైతన్య గీతాలను ఆలపించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు డిజి సాయిల్ గౌడ్, కే ఏసురత్నం ,కే ధర్మేంద్ర మరియు ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్టా లక్ష్మణ్, జిల్లా కార్యదర్శి అన్వర్,జిల్లా కార్యవర్గ సభ్యులు లక్ష్మి, రచ్చ కిషన్, కృష్ణ సత్యప్రసాద్ ,వి శ్రీనివాస్, నిమ్మల నరసింహులు మహిళా సమైక్య అధ్యక్ష కార్యదర్శులు హైమావతి ,మాధవి జిల్లా కౌన్సిల్ సభ్యులు నరేంద్ర ప్రసాద్, అమరావతి బాబు, యాదగిరి ,దశరథ్, కాసర్ల నాగరాజు, బాపిరాజు , ఈశ్వర్, రాములు గౌడ్, ప్రజానాట్యమండలి అధ్యక్ష కార్యదర్శులు ప్రమీల, వి వెంకటాచారి గౌరవ అధ్యక్షులు ప్రవీణ్ మహిళా సమైక్య నాయకురాలు గిరిజ, మహాలక్ష్మి లతా, నర్సమ్మ, సువర్ణ, కవిత, అనసూయ, జిల్లా పార్టీ నాయకులు వెంకటేష్, బాలరాజు, బాపిరాజు, నాగరాజు, ఇస్తారి, మహేష్, చంద్రయ్య, సత్యనారాయణ, బాబు,సదానందం, అజీమ్, కృష్ణ, నర్సయ్య లతో పాటు వందలాది మంది కార్యకర్తలు హాజరయ్యారు.

గణేష్ గడ్డ వినాయక ఆలయంలో తొలి పత్రిక పెట్టి పూజలు నిర్వహించిన జగ్గారెడ్డి నిర్మల



సంగారెడ్డి బ్యూరో, నవంబర్ :10(విజన్ ఆంధ్ర) జగ్గారెడ్డి కుమారుడు తూర్పు భరత్ సాయి రెడ్డి వివాహం ఈ నెల 25న జరగనున్న నేపథ్యంలో జగ్గారెడ్డి, నిర్మల దంపతులు మంగళవారం నాడు తమ కుమారుడిని వెంట బెట్టుకొని ఆలయాలకు వెళ్లారు. పెళ్లి పత్రిక దేవుళ్ళు, అమ్మవార్ల సన్నిధిలో పెట్టి పూజలు నిర్వహించారు.తొలి పత్రికను రుద్రారంలోని గణేష్ గడ్డ ఆలయంలో పెట్టి పూజలు నిర్వహించారు. ఆ తర్వాత సంగారెడ్డిలోని అస్తబల్ రేణుక ఎల్లమ్మ ఆలయం, నల్ల పోచమ్మ ఆలయం, సంగమేశ్వర ఆలయం, భవానీ మందిరం, మాణిక్ ప్రభు మందిర్, లక్ష్మి నరసింహ స్వామి ఆలయం, దుర్గమ్మ గుడి, ముత్యాలమ్మ గుడి, వడ్డె వీర హనుమాన్ మందిర్, శ్రీ వైకుంఠ పురం ఆలయం, వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం, నవరత్నాలయం, ఎర్ర పోచమ్మ గుడి, రామ్ నగర్, రామ్ మందిర్‌డ ఇలా మొత్తం 16ఆలయాల్లో పత్రికలు పెట్టి పూజలు నిర్వహించారు.ఆలయాల్లో పత్రికలు పెట్టి పూజలు చేసిన అనంతరం జగ్గారెడ్డి దంపతులు రామ్ నగర్ లోని తమ ఇంటికి చేరుకున్నారు. ఈ సందర్భంగా తూర్పు భరత్ సాయిరెడ్డి తమ తాత-నానమ్మ చిత్రపటానికి నమస్కరించి, పెళ్లి పత్రికను ఫోటో వద్ద పెట్టారు. ఆ తర్వాత ఇంట్లోని పూజా మందిరంలో దేవతా విగ్రహాలకు నమస్కరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తల్లిదండ్రుల కాళ్లకు నమస్కరించి తూర్పు భరత్ సాయి రెడ్డి వాళ్ల ఆశీస్సులు అందుకున్నారు

ఎ.ఎస్.డి.డి. జాబితా ఓటర్ల నమోదుకు మరో అవకాశం

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె హరిత



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 10:(విజన్ ఆంధ్ర)ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో ఎ.ఎస్.డి.డి. జాబితా ఓటర్ల నమోదుకు మరో అవకాశం కల్పించడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.హరిత అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో మ్యాపింగ్ ప్రక్రియతో పాటు తదుపరి పరిశీలనలో వివిధ కారణాల వల్ల నమోదు కాకుండా మిగిలిపోయిన అర్హులైన ఓటర్లందరికీ మరో అవకాశం కల్పించడం జరుగుతుందని, ఓటర్లకు తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకునేందుకు భారత ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించిందని తెలిపారు. ఓటరు జాబితాలో పేరు లేని అర్హులైన ప్రతి ఒక్కరూ తమ పేర్లను నమోదు చేసుకోవడంతో పాటు, అవసరమైన మార్పులు చేసుకునేందుకు ఈ నెల 21వ తేదీ వరకు అవకాశం కల్పించడం జరిగిందని తెలిపారు. తుది పరిశీలనకు కేవలం 10 రోజుల సమయం మాత్రమే మిగిలి ఉన్నందున అర్హులైన ఓటర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఓటరు జాబితా నుంచి మరణించిన వ్యక్తులు, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారు, రెండు చోట్ల ఓటరుగా నమోదైన వారి వివరాలతో కూడిన జాబితాలను ఇప్పటికే గుర్తించి రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందించడం జరిగిందని, ఇప్పటి వరకు ఓటర్ల తొలగింపు / సవరణ చేసుకోవాలని తెలిపారు. జాబితాలలో ఏవైనా పొరపాట్లు ఉన్నట్లయితే వాటిని గుర్తించి సరిదిద్దుకునేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు క్షేత్రస్థాయిలో మరోసారి పరిశీలన చేయాలని తెలిపారు. ఇప్పటి వరకు ఎన్యుమరేషన్ వారాలు సమర్పించలేకపోయిన అర్హులైన ఓటర్లు సంబంధిత ఎన్యుమరేషన్ ఫారమ్‌తో పాటు అనుబంధ పత్రాలు అనెక్సర్ -బి, అనేక్సర్ -సి జతచేసి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తగిన కారణాలతో నిర్ణీత సమయంలో ఫారమ్ సమర్పించలేకపోయిన వారు నూతన ఓటరు నమోదు కోసం ఫారమ్ -6 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. చిరునామా మార్పులు, పాత, కొత్త నివాస వివరాలకు సంబంధించిన సమాచారాన్ని అనెక్సర్ -సి ద్వారా సమర్పించవచ్చని తెలిపారు. ఓటరు ఎన్యుమరేషన్ ఫారమ్ అందుబాటులో లేని వారు, ఫారమ్ పోగొట్టుకున్న వారు తమ పరిధిలోని పోలింగ్ బూత్ స్థాయి అధికారి బి ఎల్ ఓ ను సంప్రదించి నూతన ఫారమ్ పొందవచ్చని తెలిపారు ఓటర్ల సేవా పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. అర్హులైన ఓటరు ప్రతి ఒక్కరు తన ఓటు హక్కును కోల్పోకూడదనే లక్ష్యంతో ఈ ప్రత్యేక అవకాశం కల్పించడం జరిగిందని, ఓటరు జాబితాలో పేరు లేని అర్హులైన వారు నిర్ణీత గడువులోగా అవసరమైన పత్రాలతో దరఖాస్తులు సమర్పించి, ఓటరు జాబితాలో తమ పేర్లు నమోదయ్యేలా చూసుకోవాలని తెలిపారు.

కరువును జాతీయ విపత్తుగా ప్రకటించాలి

కుమురం భీం అసిఫాబాద్ జిల్లా మొత్తాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలి

ఎల్ నినో కరువుతో అల్లాడుతున్న రైతాంగాన్ని వ్యవసాయ కూలీలను ఆదుకోవాలి

ఆత్మకూరి చిరంజీవి సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి.

ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 11;(విజన్ ఆంధ్ర)ఎల్ నినో ప్రభావంతో ఏర్పడిన తీవ్రమైన కరువు దుర్భిక్షంపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో వ్యవహరించి కరువుతో అల్లాడుతున్న రైతాంగాన్ని వ్యవసాయ రంగంపై ఆధారపడిన వ్యవసాయ కూలీలను తక్షణమే ఆదుకోవాలని కుమురం భీం అసిఫాబాద్ జిల్లాలోని అన్ని మండలాలను కరువు ప్రాంతాలకు ప్రకటించాలని, కరువును కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తుగా ప్రకటించి యుద్ధ ప్రాతిపదికన కరువు సహాయక చర్యలు చేపట్టాలని లిసిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆత్మకూరి చిరంజీవిలి డిమాండ్ చేశారు.

భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా కరువుపై మంగళవారం జిల్లా కలెక్టర్ గారికి వినతిపత్రం అందజేయడం జరిగిందని తెలిపారు. లిఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తాళ్లపెల్లి దివాకర్ గౌడ్, భోగే ఉపేందర్, రఘు తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్య శాఖలో ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేత

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలి

జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ రావు

గద్వాల నవంబర్ 10 (విజన్ ఆంధ్ర బ్యూరో)ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ రావు అన్నారు.జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో వివిధ విభాగాల్లో కాంట్రాక్ట్,అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన భర్తీ చేయనున్న 49 పోస్టులకు సంబంధించి మెరిట్ ఆధారంగా ఎంపికైన అర్హులైన అభ్యర్థులకు మంగళవారం ఐడీఓసీ తమ ఛాంబర్ నందు అదనపు కలెక్టర్ చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ వైద్య ఆరోగ్య శాఖ ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేస్తోందని తెలిపారు. నియామకాలు పొందిన అభ్యర్థులు తమకు కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా, అంకితభావంతో నిర్వహించాలని సూచించారు. వైద్య ఆరోగ్య శాఖలో పనిచేసే ప్రతి ఒక్కరూ ప్రజల ఆరోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తారని, విధుల నిర్వహణలో సమయపాలన,క్రమశిక్షణ, సేవాభావం పాటించాలని పేర్కొన్నారు.ప్రభుత్వ ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ, ప్రజల్లో ప్రభుత్వ వైద్య వ్యవస్థపై నమ్మకాన్ని మరింత పెంపొందించాలని సూచించారు.జిల్లాలో మొత్తం 49 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయగా, వాటిలో జాతీయ ఆరోగ్య మిషన్ పరిధిలో



36 పోస్టులు,ఆయుష్ విభాగంలో 08 పోస్టులు, జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమం పరిధిలో 05 పోస్టులు ఉన్నాయని తెలిపారు. నోటిఫికేషన్ ప్రకారం అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించి, నిర్దేశించిన అర్హతలు, మెరిట్ ఆధారంగా ఎంపిక ప్రక్రియ చేపట్టినట్లు పేర్కొన్నారు.ఎంపిక ప్రక్రియలో భాగంగా అభ్యర్థుల విద్యార్హతలు, ఇతర ధ్రువపత్రాలను పరిశీలించి నిబంధనల ప్రకారం అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేసిన అనంతరం వారికి నియామక పత్రాలు అందజేసినట్లు తెలిపారు. ఈ నియామకాల ద్వారా జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖ సేవలు మరింత బలోపేతం కావడంతో పాటు, ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించేందుకు దోహదపడుతుందని అదనపు కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. నియామకాలు పొందిన అభ్యర్థులందరికీ అభినందనలు తెలియజేస్తూ,తమ వృత్తిపరమైన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సంధ్య కిరణ్మయి,వైద్య సిబ్బంది ఎంపికైన అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్య, పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

జిల్లా కలెక్టర్ కె. హరిత



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్10:(విజన్ ఆంధ్ర) ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. మంగళవారం రెబ్బెన మండలంలో పర్యటించిన ఆమె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించి, ఇంగ్లీష్, గణితం, సైన్స్ సబ్జెక్టులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఉపాధ్యాయులకు సూచించారు. మరుగుదొడ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని, మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని ఆదేశించారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులు, క్యాష్‌బుక్‌ల నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇంటి పన్నుల వసూళ్లను వంద శాతం పూర్తి చేయాలని, రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని కార్యదర్శిని ఆదేశించారు. గ్రామపంచాయతీ పరిపాలనలో నిర్లక్ష్యానికి తావులేకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని అన్నారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గ్రామపంచాయతీ కార్యదర్శి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు ...


ఎఫ్ ఎల్ ఎన్ లో వంద శాతం అభ్యసన ఫలితాలు సాధించే దిశగా ప్రత్యేక కార్యాచరణ -జిల్లా కలెక్టర్ కె.హరిత



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 10:(విజన్ ఆంధ్ర)ఎఫ్ ఎల్ ఎన్ లో వంద శాతం అభ్యసన ఫలితాలు సాధించే దిశగా ప్రత్యేక కార్యాచరణ పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా విద్యా శాఖ అధికారి సచ్చిదానంద చారి తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలలో ఎఫ్ఎల్ఎన్ వంద శాతం అభ్యసన ఫలితాల సాధనకు మిషన్ వంద శాతం లెర్నింగ్ ప్రత్యేక కార్యాచరణ పకడ్బందీగా అమలు చేయాలని అన్నారు. మండల విద్యాశాఖ అధికారులు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ప్యానెల్ ఇన్‌స్పెక్షన్ బృందం సభ్యులు పాఠశాలలను సందర్శించి గుర్తించిన అంశాలు, పరిశీలనలపై సమీక్షించాలని, ఎఫ్ఎల్ఎన్ మిడ్‌లైన్ అసెస్‌మెంట్ లో అద్భుతమైన ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని తెలిపారు. విద్యార్థులలో చదవడం, రాయడం, గణిత సామర్థ్యాలను పెంపొందించడంతో పాటు విద్యార్థుల అభ్యసన స్థాయిలను నిరంతరం పర్యవేక్షిస్తూ వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, విద్యార్థుల ప్రగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు మెరుగైన ఫలితాలు సాధించే దిశగా విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు బాధ్యతాయుతంగా పని చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్వాలిటీ కో-ఆర్డినేటర్ శ్రీనివాస్, మండల విద్యాధికారులు, ప్రభుత్వ, స్థానిక సంస్థల ప్రధానోపాధ్యాయులు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ప్యానెల్ ఇన్‌స్పెక్షన్ బృంద సభ్యులు, ఎఫ్ఎల్ఎన్ సామర్థ్య పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వార్డుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత

ఎమ్మెల్యే చింత ప్రభాకర్



సంగారెడ్డి బ్యూరో, నవంబర్ :10(విజన్ ఆంధ్ర) సంగారెడ్డి పట్టణ అభివృద్ధిలో భాగంగా ప్రతి వార్డులో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక కృషి చేస్తానని సంగారెడ్డి శాసనసభ్యులు చింత ప్రభాకర్ అన్నారు. అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను దశలవారీగా కల్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు.సంగారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని 29వ వార్డు సిద్ధార్థ నగర్ కాలనీలో రూ.5 లక్షల నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే చింత ప్రభాకర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. రహదారుల నిర్మాణంతో ప్రజలకు రాకపోకల్లో ఇబ్బందులు తగ్గుతాయని, కాలనీల్లో మౌలిక వసతుల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు కౌన్సిలర్ శ్రీకాంత్, నక్క నాగరాజు గౌడ్, కౌన్సిలర్ నవీన్, జాఫర్, సురేష్, మున్సిపల్ అధికారులు, కాలనీ పెద్దలు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ 15 నుంచి ఆశా వర్కర్ల నిరవధిక సమ్మె ఎమ్మెల్యే కువినతి పత్రం ను అందించిన ఆశ వర్కర్లు

– కేంద్ర ప్రభుత్వం 60 శాతం రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం బడ్జెట్ కేటాయించి ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు చంద్రశేఖర్

కామారెడ్డి బ్యూరో నవంబర్ 10(విజన్ఆంధ్ర)డిసెంబర్ 15 నుంచి ఆశా వర్కర్ల నిరవధిక సమ్మె పై కామారెడ్డి ఎమ్మెల్యే కు ఆశ వర్కర్లు సమ్మె వినతి పత్రం ను అందించారు. కేంద్ర ప్రభుత్వం 60 శాతం రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం బడ్జెట్ కేటాయించి ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు చంద్రశేఖర్ అన్నారు.తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 27 వేల మంది ఆశా వర్కర్లు గత 20 ఏళ్లుగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజారోగ్య రక్షణ కోసం అవిశ్రాంతంగా సేవలందిస్తున్నారని గర్భిణుల సంరక్షణ, ప్రసవాలు, సీజనల్ వ్యాధుల నివారణ, సర్వేలు, పల్స్ పోలియో, వ్యాక్సినేషన్ డ్యూటీలు మొదలుకొని కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ ప్రాణాలకు తెగించి పనిచేశారని గుర్తుచేశారు.ఃఉదయం నుంచి రాత్రి వరకు వెట్టిచాకిరీ చేయిస్తున్నప్పటికీ, నేటికీ వీరికి ఫిక్స్ వేతనం అమలు చేయడం లేదని, కేవలం ₹9,700 నామమాత్రపు పారితోషికం మాత్రమే ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఐదేళ్లుగా పారితోషికాలు పెంచకపోవడం, పెరుగుతున్న నిత్యావసరాల ధరలతో ఆశా వర్కర్లు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు



ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆశా వర్కర్లకు నెలకు కనీస వేతనం ₹18,000 నిర్ణయించాలి; ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.ఃరెండో పీఆర్సీలో కనీస వేతనం రూ 30,000 నిర్ణయించి, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి డీఏ అమలు చేయాలి.- ఃపీఎఫ్, ఈఎస్ఐసౌకర్యాలు కల్పించాలి. ఃరూ 50 లక్షల హెల్త్/యాక్సి డెంట్ ఇన్సూరెన్స్ వర్తింపజేయాలి; మట్టి ఖర్చుల కింద రూ 50,000 చెల్లించాలి.ఃరిటైర్మెంట్ బెనిఫిట్ కింద రూ 5 లక్షలు ఏకమొత్తంగా చెల్లించి, చివరి పారితోషికంలో సగం పెన్షన్‌గా ఇవ్వాలని కోరారు.ఃఏఎన్ఎం, జీఎన్ఎం శిక్షణ పూర్తి చేసుకున్న ఆశా వర్కర్లకు పదోన్నతులు కల్పించాలి.ఃఆదివారాలు, పండుగ సెలవులతో పాటు ఏడాదికి 20 రోజుల క్యాజువల్ లీవులు, 6 నెలల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని ఈ సమస్యలను పరిష్కరించలేక డిసెంబర్ 15 నుండి రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మెకు వెళ్లనున్నట్లు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆశా సీనియర్ జిల్లా అధ్యక్షురాలు ఇందిరా జిల్లా కార్యదర్శి రాజశ్రీ జిల్లా కోశాధికారి మమత ఉపాధ్యక్షులు ప్రమీల, లలిత, గంగమణి ,లతా, రమ,భాగ్య సుజాత, వనిత, మంజుల ,వరలక్ష్మి, లావణ్య, గీత, లక్ష్మి, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణ లక్ష్మి, షాది ముభారక్ 67 చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే వెంకటరమణా రెడ్డి

కామారెడ్డి బ్యూరో నవంబర్10(విజన్ఆంధ్ర)కామారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కామారెడ్డి మండలానికి చెందిన కళ్యాణ లక్ష్మి, షాది ముభారక్ లబ్ధిదారుల చెక్కులను కామారెడ్డి శాసన సభ్యులు కాటిపల్లి వెంకట రమణ రెడ్డి అందించారు.మంగళవారం కామారెడ్డి నియోజకవర్గ పరిధిలోని రామారెడ్డి మండలం 8, మాచారెడ్డి మండలం 31, పల్వంచ మండలం 29, బీబీపేట మండలం 33,దోమకొండ మండలం 42, భిక్నూర్ మండలం 60, రాజంపేట మండలం 12, కామారెడ్డి పట్టణం, మండలం కలిపి 67 చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.



శ్రీ జోగులాంబ అమ్మవారిని దర్శించుకున్న అదిలాబాద్ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి శివకుమార్

అలంపూర్ నవంబర్ 10(విజన్ ఆంధ్ర బ్యూరో)ఐదవ శక్తిపీఠమైన అలంపూర్ శ్రీ జోగులాంబ అమ్మవారిని, శ్రీ బాల బ్రహ్మేశ్వర స్వామి వారిని అదిలాబాద్ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి శివకుమార్ కుటుంబ సమేతంగా మంగళవారం దర్శించుకున్నారు.ఆలయానికి చేరుకున్న జడ్జి దంపతులకు ఆలయ అర్చకులు, అధికారులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి పూర్ణకుంభంతో లోపలికి ఆహ్వానించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, శ్రీ బాల బ్రహ్మేశ్వర స్వామికి అభిషేకం, అర్చన చేయించారు.దర్శనం అనంతరం ఆలయ అర్చకులు జడ్జి శివకుమార్ కుటుంబ సభ్యులకు తీర్థ ప్రసాదాలు అందజేసి, అమ్మవారి శేష వస్త్రంతో ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వారి వెంట కోర్టు జూనియర్ అసిస్టెంట్ పి. చిన్నరాజు, నాగేందర్, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.అలంపూర్ క్షేత్రం యొక్క విశిష్టత, ఆలయ చరిత్రను అర్చకులు జడ్జి కి వివరించారు. దర్శనం చాలా బాగా జరిగిందని, అమ్మవారి దర్శనంతో మనసు ప్రశాంతంగా ఉందని జడ్జి శివకుమార్ ఈ సందర్భంగా తెలిపారు

ఇందూరుకు స్టేడియం తీసుకురావడమే నా లక్ష్యం

- ఖైసర్ అథ్లెటిక్స్ అకాడమీ క్రీడా పోటీల్లో ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ...



నిజామాబాద్ నవంబర్10:(విజన్ ఆంధ్ర) ఇందూరులో స్టేడియం తీసుకురావడమే తన లక్ష్యమని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. ఖైసర్ అథ్లెటిక్స్ అకాడమీ ఆధ్వర్యంలో నగరంలోని రాజారాం స్టేడియంలో అథ్లెటిక్స్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... స్టేడియం కోసం ఇప్పటికే అనేక సార్లు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్టు గుర్తు చేశారు. ఇందూరులో స్టేడియం నిర్మిస్తామన్న ప్రభుత్వ హామీని నిలబెట్టుకోవాలని చెప్పారు. గత 10 ఏళ్లుగా నిర్విరామంగా అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. కేవలం క్రీడా పోటీలనే కాకుండా పోలీసు, ఆర్మీ ఉద్యోగాలకు శిక్షణను కూడా ఇవ్వడం గర్వించదగ్గ విషయమన్నారు. ప్రతి విద్యార్థి ఏదో ఒక క్రీడలో తర్ఫీదు తీసుకోవాలన్నారు. ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం పుష్కలంగా లభిస్తుందన్నారు. జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సాహం అందిస్తున్నాయని తెలిపారు. ఇప్పటికే నగరానికి చెందిన హాకీ క్రీడాకారిణి ఎండల సౌందర్య, బాక్సర్లు నికత్ జరీన్, హుస్సాముద్దీన్, పర్వతారోహకురాలు పూర్ణా మలావత్ కు క్రీడా కోట కింద ఉద్యోగాలు వచ్చాయని గుర్తు చేశారు. కార్యక్రమంలో కైసర్ అకాడమీ ఫౌండర్ ఖైసర్, పీసీసీ ప్రధాన కార్యదర్శి రాంభూపాల్, కరాటే రమేష్, కార్పొరేటర్లు ఎండి అన్వర్ అమర్ సింగ్, మఠం పవన్, కో ఆప్షన్ మెంబర్ సురేందర్, ఎంపీజే అబ్దుల్ అజీజ్, అడ్వకేట్ జునేద్, యూనిస్ తదితరులు పాల్గొన్నారు.

భిక్కనూరులో 60 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

- లబ్ధిదారులకు చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి



భిక్కనూరు, నవంబర్ 10 (విజన్ ఆంధ్ర): భిక్కనూరు మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద మంజూరైన చెక్కులను 60 మంది లబ్ధిదారులకు కామారెడ్డి శాసనసభ్యులు కాటిపల్లి వెంకట రమణారెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లబ్ధిదారులకు చెక్కులు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పేద కుటుంబాలకు ఆడపిల్లల వివాహం ఆర్థిక భారం కాకుండా ప్రభుత్వం అందిస్తున్న కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో సునీత, ఎంపీఓ రాజ్ కిరణ్ రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షులు ఉప్పరి రమేష్, లక్ష్మీదేంపల్లి గ్రామ సర్పంచ్, అంతంపల్లి ఉపసర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, మండల జనరల్ సెక్రటరీ తిరుమలేష్, పొన్నాల రంజిత్, వివిధ గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, ప్రజాప్రతినిధులు, గ్రామ అధ్యక్షులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కూలీలకు విరివిగా ఉపాధి కల్పించాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి



నిజామాబాద్, నవంబర్ 10 :(విజన్ ఆంధ్ర) వీబీజీ రాంజీ పథకం కింద విరివిగా పనులు గుర్తిస్తూ, కూలీలకు పెద్ద ఎత్తున ఉపాధి కల్పించేలా అధికారులు చొరవ చూపాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో మంగళవారం అదనపు కలెక్టర్ భుజంగరావుతో కలిసి వీబీజీ రాంజీ పథకం అమలు తీరుపై ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఏ.ఈలతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ప్రతి గ్రామంలో పనులను ఎంపిక చేస్తూ, కూలీలకు ఉపాధి కల్పించడం ద్వారా పని దినాల లక్ష్యాన్ని అధిగమించాలని కలెక్టర్ సూచించారు. ఎల్ నినో ప్రభావంతో నెలకొని ఉన్న ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో వీబీజీ రాంజీ కింద పనులను విస్తృత స్థాయిలో గుర్తించడం ద్వారా కూలీలకు తగిన ఉపాధి కల్పించి ఆదుకున్నట్లు అవుతుందని అన్నారు. అంతేకాకుండా వర్షాభావం వల్ల భూగర్భ జలాలు గణనీయంగా పడిపోతున్న దృష్ట్యా, జలసిరి కార్యక్రమం కింద నిర్దేశించిన పనులను చేపట్టేందుకు ఇది ఎంతో ఉపయుక్తమైన సమయమని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. ఫాంపాండ్స్, వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్లు, సోక్ పిట్లు, బోర్ వెల్ రీచార్జ్ గుంతలు వంటి పనులకు ప్రాధాన్యతనిస్తూ విరివిగా చేపట్టేలా చూడాలన్నారు. మండల ప్రత్యేక అధికారి నేతృత్వంలో అన్ని మండలాలలో తక్షణమే సమావేశాలు ఏర్పాటు చేసుకుని, ఒక్కో గ్రామం వారీగా ప్రణాళిక రూపొందించుకోవాలని కలెక్టర్ మార్గనిర్దేశం చేశారు. గుర్తించిన పనులను సకాలంలో చేపడుతూ వారంవారం ప్రగతిని సమీక్షించాలని సూచించారు. కూలీల సంఖ్యను గణనీయంగా పెంచినట్లయితే తదనుగుణంగా మెటీరియల్ కంపోనెంట్ కేటాయించబడుతుందని అన్నారు. దీనివల్ల పల్లెలలో ప్రజలకు ఉపయుక్తంగా నిలిచే పనులు అందుబాటులోకి వస్తాయని, కరువు పరిస్థితులను అధిగమించేందుకు కూడా ఇవి ఉపకరిస్తాయని గుర్తు చేశారు.. కూలీలకు ఉపాధి పనులు కల్పించే విషయంలో అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది అందరూ ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్లు లేని చోట మెట్లను నియమించుకుని పనులు పెద్ద ఎత్తున కొనసాగేలా కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్డీఓ సాయన్న, జెడ్పీ సీ.ఈ.ఓ సాయాగౌడ్, జిల్లా నీటి పారుదల శాఖ అధికారి ప్రకాష్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

మొబైల్ షాపుల యజమానుల సమస్యలు పరిష్కరిస్తాం

- ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు హామీ



మంచిర్యాల ప్రతినిధి నవంబర్ 10 (విజన్ ఆంధ్ర) : పట్టణంలోని మొబైల్ విక్రయదారులు, సర్వీస్ సెంటర్ల నిర్వాహకులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తన వంతుగా పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు స్పష్టం చేశారు. మంగళవారం పట్టణ మొబైల్ షాపుల యజమానుల సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యేను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వ్యాపార నిర్వహణలో ఎదురవుతున్న పలు ఇబ్బందులను, క్షేత్రస్థాయి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వినతిపత్రం అందజేసిన వ్యాపారులతో ఆయన కాసేపు మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చిన్న తరహా వ్యాపారులకు ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందని, అధికారులతో సమీక్షించి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చొరవ చూపుతానని భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో టీపీసీసీ ఉపాధ్యక్షులు చిట్ల సత్యనారాయణతో పాటు అసోసియేషన్ ప్రతినిధులు, పట్టణ మొబైల్ షాపుల యజమానులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమాల తంతు.. సొసైటీల వంతు..

- మిల్లర్లపై సిఐడి విచారణ

- అక్రమాలకు పురుడు పోసిన సొసైటీ చైర్మెన్ లు

- ఫిర్యాదులు చేయడంతో విచారణ..

- విచారణ నివేదికలు బయటకు రాని వైనం

నిజామాబాద్ నవంబర్10:(విజన్ ఆంధ్ర) : తిలపాపం తల పిడికెడు అన్నట్లు ఉంది రైస్ మిల్లుల యజమానులు, సొసైటీ చైర్మెన్ లది. ఒకవైపు సిఎంఆర్ ఎగవేతపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్ గా సిఐడి విచారణ చేయించడంతో వందల కోట్ల రూపాయల అవినీతి సొమ్ము బయట పడుతుంది. ఇక ఈ అక్రమాలకు కేంద్రంగా మారిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పిఏసిఎస్) ల్లో సైతం అవినీతి అక్రమాలకు అంటూ లేకుండా పోతుంది. వీటిపై అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకునే నాథుడు లేకుండా పోయింది. ఇందుకు ఉదాహరణ నిజామాబాద్ జిల్లా నందిపేట మండలంలోని అయిలాపూర్ సొసైటీ సంగతి చెప్పవచ్చు. ఈ సొసైటీలో అవినీతి అక్రమాలపై ఏకంగా సొసైటీ వైస్ చైర్మన్ ఏకంగా శాఖ కమిషనర్ కు ఫిర్యాదు చేయడం గమనార్హం. దీంతో కమిషనర్ విచారణ చేయాలని జిల్లా కో ఆపరేటివ్ అధికారులకు ఆదేశాలను జారీ చేశారు. ఇక్కడ విచారణ పూర్తి చేసిన నివేదికను తొక్కి పెట్టారు. విచారణ చేసిన అధికారి సెలవుపై వెళ్లడం వ్యవహారంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అయితే నివేదికను ఎప్పుడూ బయట పెడతారనేది వారికే తెలియాలి.

అసలు ఏం జరిగింది.

నందిపేట మండలం ఐలాపూర్ సొసైటీలో ఆర్థిక అవకతవకలు, ధ్యాం కొనుగోళ్లలో అక్రమాలు, ఎరువుల విక్రయాల్లో లెక్కల వ్యత్యాసాలు, సొసైటీ నిధుల దుర్వినియోగంపై స్వతంత్ర థర్డ్ పార్టీతో సమగ్ర విచారణ జరిపించి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ కమిషనర్ కు ఫిర్యాదు చేశారు. గత కొన్నేళ్లుగా సొసైటీ కార్యకలాపాలు, ధాన్యం కొనుగోళ్లు, హమాలీ చార్జీలు, ఎరువుల విక్రయాలు, సొసైటీ ఖర్చులు మరియు లెక్కల నిర్వహణకు సంబందించి తీవ్రమైన ఆర్థిక అవకతవకలు జరుగుతున్నాయనే రైతుల నుంచి ఆరోపణలపై విచారణ చేయాలి. ప్రస్తుతం సొసైటీ చైర్మన్ కొనసాగిన మీసాల సుదర్శన్ ఆధ్వర్యంలో సొసైటీ ఆర్థిక వ్యవహారాల్లో పారదర్శకత లోపించిందని, సొసైటీ రికార్డులు, ఖాతాల నిర్వహణపై అనేక ఫిర్యాదులు ఉన్నాయి.

ధాన్యం కొనుగోళ్లపై విచారణ..

నందిపేట, వెల్మల్, ఐలాపూర్, కంఠం, ఆంధ్రనగర్, రైతు ఫారం, జోజిపేట తదితర గ్రామాల నుంచి ప్రతి పంట సీజన్లో సుమారు 4.40 లక్షల బస్తాల ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు ఉంది. ధాన్యం కొనుగోలు పరిమాణం, రైతులకు చెల్లింపులు, హమాలీ చార్జీలు, రవాణా ఖర్చులు, సొసైటీ ఖాతాల్లో నమోదు చేసిన వివరాలను గ్రామాల వారీగా, సీజన్ల వారీగా తనిఖీ చేయాలి.

హమాలీ చార్జీలలో వ్యత్యాసాలు..

హమాలీలకు చెల్లించిన మొత్తానికి, రైతుల నుంచి వసూలు చేసిన మొత్తానికి మధ్య వ్యత్యాసం ఉన్నాయి. ప్రతి బస్తాకు వాస్తవంగా ఎంత చెల్లించారు. రైతుల నుంచి ఎంత వసూలు చేశారు. ఆ మొత్తాలు సొసైటీ ఖాతాల్లో ఎలా నమోదు చేశారు అనే విషయాలను సంబంధిత రసీదులు, వౌచర్లు, బ్యాంకు లావాదేవీలతో సరిపోల్చి విచారించాలి. ప్రతి బస్తాకు క్వింటాలకు రూ.5 నుంచి 6 రూపాయల చొప్పున సొసైటీ చైర్మన్ ఆధారంగా వసూలు చేసుకుని జేబులో వేసుకోవడం వల్ల దాదాపు ఐదేళ్లలో రూ. 70 లక్షలు అవినీతి జరిగింది.

ఖర్చుల పేరుతో చూపిన వ్యయాలు..

గత కొన్ని సంవత్సరాల్లో సొసైటీ నిర్వహణ ఖర్చుల పేరుతో భారీ మొత్తాలు ఖర్చు చేసినట్లు లెక్కల్లో చూపించారని ఆరోపణలు ఉన్నాయి. ఈ ఖర్చులకు సంబంధించిన ప్రతి బిల్లు, వౌచర్, రసీదు, చెక్, బ్యాంకు స్టేట్మెంట్ మరియు ఇతర ఆధారాలను పరిశీలించి, వాస్తవంగా ఖర్చు జరిగిందా లేదా నిర్ధారించాలి. ఆడిట్ సిబ్బందిని మేనేజ్ చేసి ఈ అక్రమాలు బయటకు రాకుండా చేశారని రైతులు చెబుతున్నారు.

ఎరువుల కొనుగోలు, విక్రయాలపై ఆడిట్..

ఎరువుల స్టాక్ రిజిస్టర్లు, కొనుగోలు బిల్లులు, అమ్మకాల రిజిస్టర్లు, రైతుల పేర్లపై జారీ చేసిన బిల్లులు, స్టాక్ బ్యాలెన్స్ మరియు నగదు/బ్యాంకు జమలను పరస్పరం సరిపోల్చి ప్రత్యేకంగా పరిశీలించాలి.



మధ్య వ్యత్యాసం ఉందా అనే అంశాన్ని కూడా పరిశీలించాలి.

ఆడిట్ ప్రక్రియపై విచారణ..

గత సంవత్సరాల్లో నిర్వహించిన ఆడిట్ నివేదికలు, ఆడిట్ అభ్యంతరాలు, వాటికి సొసైటీ ఇచ్చిన సమాధానాలు, అభ్యంతరాల పరిష్కారానికి సంబంధించిన రికార్డులను పూర్తిగా . ఆడిట్లో ఏవైనా అంశాలు ఉద్దేశపూర్వకంగా విస్మరించబడ్డాయా అనే విషయాన్ని పరిశీలించాలి. ఆడిట్లో ఏవైనా కూడా స్వతంత్రంగా పరిశీలించాలి అని ఫిర్యాదులో పేర్కొన్నారు.

జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై కమిషనర్ సమీక్ష

నిజామాబాద్ నవంబర్10:(విజన్ ఆంధ్ర)ద: వైద్య ఆరోగ్యశాఖలోని జాతియ ఆరోగ్య కార్యక్రమాలపై జూమ్ ద్వారా సమీక్ష సమావేశాన్ని వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్ హెచ్ ఎం ఉద్యోగులు ధర్నా కార్యక్రమశీ నుండి విధుల్లో చేరి విధులు నిర్వహించాలని అన్నారు. మాతా శిశు ఆరోగ్యము మరియు పోషకాహారం పై మాట్లాడుతూ ప్రతి గర్భిణీ స్త్రీకి నాలుగు పరీక్షలతో పాటు అదనంగా ఐదు పరీక్షలు నిర్వహించి మొత్తం తొమ్మిది సార్లు గర్భిణీ స్త్రీని పరీక్షించాలన్నారు. గర్భిణీ స్త్రీల నమోదు పరీక్షల వివరాలను ఆన్లైన్లో నమోదు చేయాలని అన్నారూ. ప్రభుత్వ మరియు ప్రైవేటు ఆసుపత్రుల్లో సిజేరియన్ శస్త్ర చికిత్సలను తగ్గించే సాధారణ ప్రసవాలను పెంచాలన్నారు. సెకండరీ మరియు టెరిషియరీ ఆసుపత్రులతో సమన్వయం కలిగి ఉండి సాధారణ ప్రసవాలు పెంచాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులందరూ ప్రణాళికతో ఆసుపత్రిలో ప్రసవాలను పెంచాలన్నారు. ఆరోగ్య మహిళ ద్వారా 18 సంవత్సరాల నిండిన మహిళలందరికీ నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించే అవసరమైన వారిని రిఫర్ చేయాలన్నారు.అదే విధంగా మాతా శిశు మరణాలను తగ్గించాలన్నారు. పి సి పి ఎన్ డి టి యాక్ట్ ప్రకారం అన్ని ఆసుపత్రుల్లో ఫారం నిర్వహించాలని, స్త్రీ పురుష నిష్పత్తి తగ్గకుండా చర్యలు తీసుకోవాలని, టార్గెట్ తక్కువగా సాధించిన ఐదు జిల్లాలకు సంజాయిషీ నోటీసులు పంపాలి అన్నారు. ప్రతి మంగళ వారం సమీక్షలో గతవారం కంటే ఎక్కువ ఫలితాలు సాధించాలన్నారు. హెచ్ పి వి వాక్సినేషన్ కోసం పాఠశాలల వారీగా అర్హులైన బాలికల జాబితాను సిద్ధం చేసి ప్రతిరోజు ఒక పాఠశాలని సందర్శించి హెచ్ పి వి టీకాలను ఈ నెల చివరి వరకు 100%



సాధించాలన్నారు. పోషకార లోపంతో బాధపడే పిల్లలందరినీ ఎన్ఆర్సి లో చికిత్స అందించాలన్నారు. రాష్ట్రీయ కిశోర సురక్ష కార్యక్రమంలో భాగంగా కిషోర్ బాలికలందరినీ నమోదు చేసి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అర్హులైన వారికి చికిత్స అందించాలన్నారు. తమ తోటి బాలికల చేత కౌన్సిలింగ్ చేయించాలని అన్నారు. గిరిజనుల ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడా లన్నారు. జీవనశైలి వ్యాధుల గుర్తింపు, పరీక్షల నిర్వహణ, చికిత్స అందించడం, అవసరమైన వారిని ఉన్నత ఆసుపత్రులకు చికిత్స కోసం పంపించడం ఇలాంటివి చేయాలన్నారు. ప్రైవేట్ ఆస్పత్రిలోని క్యాన్సర్ కేసులన్నింటిని గుర్తించి ఆన్లైన్ లో నమోదు చేయాలన్నారు. పిహెచ్సిలా వారిగా కంటి పరీక్షల విస్తృతంగా నిర్వహించి ప్రజల కంటి ఆరోగ్యం కాపాడాలన్నరూ. డెంగీ వ్యాధిగ్రస్తులను పాజిటివ్ గా గుర్తించిన వెంటనే యాక్షన్ టేకెన్ చేయాలన్నారు. ప్రస్తుతం మనకున్న ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకొని మొదటి ప్రాధాన్యతగా టిబి ఎంబీఏను రెండవ ప్రాధాన్యతగా సర్వైకల్ క్యాన్సర్ వ్యాధి రాకుండా హెచ్ పి వి టీకాలను ఇవ్వాలన్నారు. స్వచ్ఛంద సంస్థల ద్వారా పోషకాహార కిట్టులను క్షయవ్యాధిగ్రస్తులకు అందించాలని అన్నారు. క్షయ వ్యాధిగ్రస్తుల గుర్తింపు పకడ్బందీగా నిర్వహించి నూతన చేయ వ్యాధిగ్రస్తులను గుర్తించాలన్నారు. కుక్క కాటు మరియు పాము కాటు టీకాలను అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. వ్యాక్సిన్ ల ద్వారా వ్యాధులను నియంత్రించే విపిడి ద్వారా శాంపుల్స్ సేకరణ చేసి ఐపిఎం నాకు 72 గంటల్లో పంపాలి అన్నారు. టీకాల నమోదును 24 గంటల్లో ఆన్లైన్లో నమోదు చేయాలి అన్నారు. వైద్యాధికారులందరూ అంబులెన్సను వారి కోఆర్డినేటర్లను ప్రతినెల సమీక్షించాలని, 102 అమ్మఒడి వాహనం ద్వారా గర్భిణీలను తరలించే రోజువారి సంఖ్యను పెంచాలన్నారు. నీ ప్రైవేట్ ఆస్పత్రుల నుండి హెచ్ఎమ్ఐ ఎస్ నివేదికలను పంపాలని అన్నారు. ఆయుష్మాన్ ఆరోగ్యం మందిర్లలో రోగుల సంఖ్యను పెంచాలన్నారు. ఈ ఆరోగ్యం, ఈ సంజీవని ద్వారా వైద్య సేవలను విస్తృతంగా పెంచాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి రాజశ్రీ మాట్లాడుతూ బీసీల వారిగా ప్రణాళిక తయారు చేసే ప్రతి పాఠశాలను సందర్శించే హెచ్పీవీ టీకాలను 100% ఇవ్వాలని, క్షయ ముక్త భారత అబియాన్లో భాగంగా క్షయవ్యాధిగ్రస్తులకు పోషకాహార చెట్టులను స్వచ్ఛంద సంస్థల ద్వారా ఇప్పించాలన్నారు. మీ ప్రమాణంలో హాజరు నమోదు ను బట్టి 16వ తేదీ నుండి జీతాలకు అనుసంధానం చేస్తారన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారులు డాక్టర్ విద్య, డాక్టర్ సికందర్ నాయక్ ,డాక్టర్ రవీందర్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ అశోక్, డాక్టర్ వెంకన్న డాక్టర్ సుప్రియ ,డాక్టర్ వెంకటేష్, డాక్టర్ అజ్మల్,డాక్టర్ శిఖర, డాక్టర్ నవ్య, డాక్టర్ స్వాతి, ఎస్ ఓ రాజేశ్వర్, ఫార్మసీ అధికారి నారాయణ, డి హెచ్ ఈ లు ఘనపూర్ వెంకటేశ్వర్లు మనోహర్, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు నరకప్రాయంగా మీసేవ కేంద్రం!

- మూడు గుళ్ల సమీపంలోని మీసేవలో కనీస వసతులు కరువు

- మరుగుదొడ్డికి తాళం.. గుంతలమయంగా మారిన నేల

- సమాచారం అందించడంలోనూ సిబ్బంది నిర్లక్ష్యం..

- ప్రజల ఆగ్రహం



మల్కాజిగిరి, నవంబర్,10, విజన్ ఆంధ్ర:

ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేయాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన మీసేవ కేంద్రాలు ప్రజలకు నమ్మకాన్ని కల్పించాల్సి ఉండగా, కొన్ని కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కూడా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మల్కాజిగిరిలోని మూడు గుళ్ల సమీపంలో ఉన్న మీసేవ కేంద్రం ఇందుకు నిదర్శనంగా నిలుస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. వివిధ ప్రభుత్వ సేవల కోసం నిత్యం ఎంతోమంది ప్రజలు ఈ కేంద్రానికి వస్తుంటారు. అయితే ఇక్కడికి వచ్చే ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించడంలో నిర్వాహకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మీసేవ కేంద్రానికి వచ్చే ప్రజలకు అవసరమైన సమాచారం అందించడంలోనూ సిబ్బంది సరైన విధంగా స్పందించడం లేదని పలువురు





ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏ పని కోసం ఎక్కడ సంప్రదించాలి, ఏయే పత్రాలు తీసుకురావాలి అనే విషయాలపై స్పష్టమైన సమాచారం ఇవ్వకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెబుతున్నారు. ముఖ్యంగా వివిధ ధ్రువపత్రాలు, ప్రభుత్వ పథకాలకు సంబంధించిన సేవల కోసం వచ్చే వారు సరైన మార్గదర్శకత్వం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోతున్నారు.

మరుగుదొడ్డికి తాళం.. ప్రజలకు అవస్థలు!

మీసేవ కేంద్రంలో అత్యంత కనీస అవసరమైన మరుగుదొడ్డి సౌకర్యం కూడా ప్రజలకు అందుబాటులో లేకపోవడం విమర్శలకు తావిస్తోంది. అత్యవసరంగా బాత్రూంకు వెళ్లాల్సి వచ్చినా తాళం వేసి ఉండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే మహిళలు, వృద్ధులు, ఇతర ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సౌకర్యాలు కల్పించాల్సి ఉన్నప్పటికీ, ఈ విషయంలో నిర్వాహకులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.

కుంగిపోయిన బండరాళ్లు.. ప్రమాదకరంగా నేల!

మీసేవ కేంద్రం లోపల నేలపై ఏర్పాటు చేసిన బండరాళ్లు కుంగిపోయి, అస్తవ్యస్తంగా మారడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. కార్యాలయంలోకి అడుగుపెట్టే సమయంలోనే అసౌకర్యం కలుగుతోందని, ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా తడబడే పరిస్థితి ఉందని పేర్కొంటున్నారు. నిత్యం ప్రజలు రాకపోకలు సాగించే ప్రాంతంలో కనీస మరమ్మతులు చేపట్టకపోవడం నిర్వాహకుల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శిస్తున్నారు.

ప్రజలకు ప్రభుత్వ సేవలు అందించే కేంద్రంలోనే ఇలాంటి పరిస్థితులు నెలకొనడం పట్ల స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి మీసేవ కేంద్రాన్ని తనిఖీ చేయాలని, ప్రజలకు అవసరమైన కనీస సౌకర్యాలు కల్పించాలని, మరుగుదొడ్డిని అందుబాటులోకి తీసుకురావడంతో పాటు కుంగిపోయిన బండరాళ్లకు మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ సమస్యలపై ఉన్నతాధికారులు దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాలని సంఘసేవకుడు, లిసోషల్ వర్కర్ షేర్ల అనిల్ కోరుతున్నారు

నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణం

- నోటీసులను పట్టించుకోని నిర్మాణదారులు

- చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్



కీసర, నవంబర్ 10, విజన్ ఆంధ్ర : ఘట్కేసర్ సర్కిల్ పరిధిలోని గోధుమ కుంట తదితర ప్రాంతాలలో నిర్మాణ అనుమతులను ఉల్లంఘిస్తూ బహుళ అంతస్తుల భవనం నిర్మాణం కొనసాగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్టిల్ట్ ప్లస్ +2 అంతస్తులకు మాత్రమే అనుమతి ఉండగా, అదనపు నిర్మాణాలు చేపట్టినట్లు మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు గుర్తించారు. ఈ మేరకు భవన యజమానికి డిప్యూటీ కమిషనర్ కార్యాలయం నుంచి షోకాజ్ నోటీసు జారీ చేసింది. అక్రమ నిర్మాణాన్ని నిలిపివేయాలని, నిర్ణీత గడువులో వివరణ ఇవ్వాలని నోటీసులో స్పష్టం చేసినప్పటికీ నిర్మాణ పనులు యథావిధిగా కొనసాగుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. నోటీసులు జారీ చేసిన తరువాత కూడా పనులు కొనసాగుతుండటంతో అధికారుల చర్యలపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అక్రమ నిర్మాణాల విషయంలో కఠిన చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిర్మాణ అనుమతుల ఉల్లంఘనపై సమగ్ర విచారణ జరిపి, నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన నిర్మాణాలపై తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాన్ని నిలిపివేసి చట్టపరమైన చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

చిన్నారి ప్రాణం కోసం రక్తదానం.. మానవత్వాన్ని చాటిన నెమ్మాది వెంకన్న

- బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న కత్తి ఐరా (సమేరా)కు అండగా నిలుపు

- 16వసారి రక్తదానం చేసి సేవాభావం చాటుకున్న సామాజిక కార్యకర్త




కాప్రా/నవంబర్ 10(విజన్ ఆంధ్ర ప్రతినిధి) : బ్లడ్ క్యాన్సర్‌తో పోరాడుతున్న చిన్నారి కత్తి ఐరా (సమేరా)కు అండగా నిలుస్తూ సామాజిక కార్యకర్త నెమ్మాది వెంకన్న మానవత్వాన్ని చాటుకున్నారు. లక్డీకాపూల్‌లోని ఎం.ఎన్.జే. క్యాన్సర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారి పరిస్థితి తెలుసుకుని స్పందించారు. చిన్నారి చికిత్సకు తనవంతు సహకారం అందించాలనే ఉద్దేశంతో నవంబర్ 10న బర్కత్‌పురాలోని జాగృతి బ్లడ్ బ్యాంక్‌లో రక్తదానం చేశారు. ఇది ఆయన జీవితంలో 16వసారి రక్తదానం కావడం విశేషం.

లిఆపదలో ఉన్నవారికి అండగా నిలవాలి..!

ఈ సందర్భంగా నెమ్మాది వెంకన్న మాట్లాడుతూ, అత్యవసర సమయంలో మనం ఇచ్చే ఒక్క యూనిట్ రక్తం మరొకరి ప్రాణాలను కాపాడటమే కాకుండా, ఆ కుటుంబానికి కొత్త ఆశను అందిస్తుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛంద రక్తదానానికి ముందుకు వచ్చి ఆపదలో ఉన్నవారికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. రక్తదానం కేవలం దానం కాదు.. ఒక ప్రాణానికి ఇచ్చే జీవన భరోసా. మన రక్తం మరొకరి జీవితంలో ఆశాదీపం కావాలి.

లక్ష్మీనారాయణకు జన్మదిన శుభాకాంక్షలు



కీసర, నవంబర్ 10, విజన్ ఆంధ్ర : తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ జన్మదిన వేడుకలు మంగళవారం చంపాపేట్ లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు బెలిదే రమేష్ గుప్తా లక్ష్మీనారాయణను కలిసి, శాలువాతో సన్మానించి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

సదర్ సమ్మేళనం కార్యక్రమంలో పాల్గొన్న పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ





శేరిలింగంపల్లి.నవంబర్ 10: (విజన్ ఆంధ్ర) : దీపావళి పర్వదినంను పురస్కరించుకుని మాదాపూర్ డివిజన్ పరిధిలోని మాదాపూర్ విలేజ్, మాదాపూర్ మెగా హిల్స్ కాలనీల లో నిర్వహించిన సదర్ సమ్మేళనంలో సీనియర్ నాయకులుసీనియర్ నాయకులు మారబోయిన రాజు యాదవ్ సీనియర్ నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్ తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొన్న పీఏసీ చైర్మన్ ఈ సందర్భంగా మాట్లాడుతూ దీపావళి పండుగ తర్వాత రోజు ఈ సదర్ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు అని,సదర్ సమ్మేళనం కేవలం ఒక కులానికి పరిమితమైనది కాదని, ఇది తెలంగాణ సాంస్కృతిక వారసత్వానికి, యావత్ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక అని ఈ వేడుకల్లో ప్రధాన ఆకర్షణ అందంగా అలంకరించిన భారీ దున్నరాజుల (దున్నపోతులు) ప్రదర్శన మరియు వాటి విన్యాసాలు ఉంటాయి అని పిఏసి చైర్మన్ గాంధీ తెలిపారు ఈ కార్యక్రమంలో నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్‌డీడీ జాబితాలో ఉన్న వారికి మరో అవకాశం

- అదనపు కలెక్టర్ ఆర్.ఎస్.చిత్రు



ఆదిలాబాద్ బ్యూరో నవంబర్ 10(విజన్ ఆంధ్ర)ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో భాగంగా ముసాయిదా ఓటరు జాబితా నుంచి ఏఎస్‌డీడీ జాబితాలో నమోదు అయినా వారికి తమ ఓటు హక్కు ను పొందెందుకు ఎన్నికల కమిషన్ మరో అవకాశం కల్పించందని అదనపు కలెక్టర్ ఆర్ ఎస్ చిత్రు తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ పార్టీల రాజకీయ ప్రతినిధులు, సంబంధిత అధికారులతో ఆయన ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ఏఎస్‌డీడీ జాబితాలో పేర్లు ఉన్నవారు మరోసారి అనెక్సర్ –ఏ ఎన్యుమరేషన్ ఫారం నింపి సమర్పించడం ద్వారా ఓటరు జాబితాలో తమ పేరును పునరుద్ధరించుకునే అవకాశం ఉందని స్పష్టం చేశారు. స్థానికంగా ఉండి ఇంతవరకు ఎన్యుమరేషన్ ఫారం ఇవ్వనివారు అనెక్సర్–బి ద్వారా సమర్పించాలన్నారు. అలాగే నివాసం మారినవారు అనెక్సర్ –సి నింపడంతో పాటు నివాస ధ్రువపత్రం సమర్పించావాల్సి ఉందన్నారు. అయితే ఇది కేవలం ఏఎస్‌డీడీ జాబితాలో ఉన్నవారికే మరో అవకాశం ఉందాని, ఈ నెల 21వ తేదీలోగా సంబంధిత ప్రక్రియను పూర్తి చేయవలసి ఉందన్నారు. ఈ విషయం పై రాజకీయ పార్టీల ప్రతినిధులకు, ఓటర్లకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో డీఆర్ఓ ప్రవంతి, ఆర్డీఓ జగదీశ్వరరావు, పట్టణ తహసీల్దార్ శ్రీనివాస్, ఎన్నికల పర్యవేక్షణ అధికారి నలందప్రియ, నాయబ్ తహసీల్దార్ మధుసూదన్, వివిధ పార్టీల రాజకీయ ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలి..

- ప్రజల భద్రతే ప్రథమ ప్రాధాన్యత! - మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు



మంచిర్యాల ప్రతినిధి నవంబర్ 10 (విజన్ ఆంధ్ర)మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 17వ డివిజన్ గుడిపేట ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ సమీపంలో ఇటీవల జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు మృతి చెందిన నేపథ్యంలో మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు ప్రమాద స్థలాన్ని సందర్శించి పరిశీలించారు.పోలీస్ శాఖ అధికారులతో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు , జ× రవీందర్, హాజీపూర్ కిరణ్ కుమార్‌లను ప్రమాదానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జాతీయ రహదారిపై భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా తక్షణమే పటిష్టమైన నివారణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రహదారికి ఇరువైపులా పెరిగిన పొదలను తొలగించాలి. వాహనదారులకు ఇబ్బందిగా ఉన్న పెద్ద చెట్ల తొలగింపునకు అటవీశాఖ అధికారులతో సమన్వయం చేసుకోవాలి. కల్వర్టులను వెడల్పు చేసి రాత్రివేళల్లో ప్రమాదాలు జరగకుండా హెచ్చరిక బోర్డులు, వైట్ పెయింటింగ్, రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేసి అవసరమైన ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు నిర్మించాలి. పెరుగుతున్న ట్రాఫిక్ అవసరాలకు అనుగుణంగా పాత మంచిర్యాల నుంచి నగర శివారు ప్రాంతాల వరకు రహదారి విస్తరణతో పాటు డివైడర్ల నిర్మాణానికి త్వరలోనే చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు.అలాగే లిక్కర్ గోదాం ఎదుట లారీలు, డీసీఎం వ్యాన్లను రోడ్డుకు ఇరువైపులా నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించకుండా చూడాలని గోదాం మేనేజర్ వాణి జయలక్ష్మి గారికి సూచించారు. వాహనాలకు ప్రత్యామ్నాయ పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. ప్రాణనష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడమే లక్ష్యంగా.. ప్రజల ప్రయాణ భద్రతకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కార్పొరేటర్ తూముల నరేష్,, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ సల్ల మహేష్, కార్పొరేటర్లు, నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

బ్లడ్ క్యాన్సర్ చిన్నారికి రక్తదానంతో అండగా సురేష్ ఇడపాక..!

- చిన్నారి కత్తి ఐరా (సమేరా) కోసం 22వసారి రక్తదానం

- ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడమే నిజమైన మానవత్వమని సందేశం



కాప్రా /నవంబర్ 10(విజన్ ఆంధ్ర ప్రతినిధి) : బ్లడ్ క్యాన్సర్‌తో పోరాడుతున్న చిన్నారి కత్తి ఐరా (సమేరా)కు అండగా నిలుస్తూ సామాజిక కార్యకర్త, జర్నలిస్టు సురేష్ ఇడపాక మానవత్వాన్ని చాటుకున్నారు. లక్డీకాపూల్‌లోని ఎం.ఎన్.జే. క్యాన్సర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారి పరిస్థితి తెలుసుకుని స్పందించారు. చిన్నారి చికిత్సకు తనవంతు సహకారం అందించాలనే ఉద్దేశంతో నవంబర్ 10న బర్కత్‌పురాలోని జాగృతి బ్లడ్ బ్యాంక్‌లో రక్తదానం చేశారు. ఇది ఆయన జీవితంలో 22వసారి రక్తదానం కావడం విశేషం.

రక్తదానం..!ప్రాణదానంతో సమానం..!

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అత్యవసర సమయంలో మనం ఇచ్చే ఒక్క యూనిట్ రక్తం మరొకరి ప్రాణాలను కాపాడటమే కాకుండా, ఆ కుటుంబానికి కొత్త ఆశను అందిస్తుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛంద రక్తదానానికి ముందుకు వచ్చి ఆపదలో ఉన్నవారికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

రక్తదానం కేవలం దానం కాదు..! ఒక ప్రాణానికి ఇచ్చే జీవన భరోసా. మన రక్తం మరొకరి జీవితంలో ఆశాదీపం కావాలి.

మహిళలు చిన్నారుల రక్షణ కోసం ఏర్పాటుచేసిన భరోసా సెంటర్ ను ప్రారంభించిన పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ









శేరిలింగంపల్లి .నవంబర్ 10:(విజన్ ఆంధ్ర) : గచ్చిబౌలి లోని సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన భరోసా సేంటర్ ను రాష్ట్ర డిజిపి సివి.అనంద్ , సైబరాబాద్ కమిషనరేట్ సిపి డాక్టర్ రమేష్ జవీజ కమిషనర్ సృజన తో కలిసి పాల్గొని ప్రారంభించిన పిఏసి చైర్మన్ ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు, చిన్నారుల రక్షణ కోసం ఏర్పాటు చేసిన 'భరోసా కేంద్రం ను ఏర్పాటు చేసుకోవడం చాలా సంతోషకరమైన విషయం అని, ఎంతో మంది మహిళలకు ,చిన్నారుల రక్షణ కొరకు ఉపయోగపడుతుంది అని, పోలీసు ల సేవలు అమోఘం అని, శాంతి భద్రతలు కాపాడటంతో పాటు వారికి రక్షణ గా నిలబడుతూ వారికి న్యాయం అందేలా భరోసా చేయూత నిస్తుంది అని ముఖ్యంగా మైనర్ బాలికలు సాధారణ పోలీస్ స్టేషన్లు లేదా బహిరంగ కోర్టు ప్రాంగణాలకు వెళ్లినప్పుడు భయాందోళనలతో జరిగిన విషయాన్ని చెప్పలేకపోతారని గుర్తుచేశారు..అటువంటి వారి కోసం భరోసా కేంద్రాల్లో ప్రత్యేక నిపుణులతో కౌన్సెలింగ్, వైద్య పరీక్షలు, న్యాయ సహాయం (ప్రాసిక్యూషన్) అన్నీ ఒకే భవనంలో కల్పించడం వలన వారికి కొండత అండగా నిలవడం లో ఎంతగానో తోడ్పడుతాయి అని, వారి జీవితాలలో వెలుగులు నింపినవారు అవుతామని ఈ సందర్భంగా రాష్ట్ర డిజిపి సివి.అనంద్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మహిళలు, చిన్నారుల రక్షణ కోసం ఏర్పాటు చేసిన 'భరోసా కేంద్రాలు' దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని, ఇది తెలంగాణ పోలీసు విభాగానికి గర్వకారణమని నూతన భరోసా సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో వక్త పేర్కొన్నారు..దాదాపు పదేళ్ల క్రితం ప్రారంభమైన 'భరోసా కేంద్రాలు' దేశంలోనే అత్యంత విశిష్టమైనవని కొనియాడారు..అత్యాచార బాధితులు,ముఖ్యంగా మైనర్ బాలికలు సాధారణ పోలీస్ స్టేషన్లు లేదా బహిరంగ కోర్టు ప్రాంగణాలకు వెళ్లినప్పుడు భయాందోళనలతో జరిగిన విషయాన్ని చెప్పలేకపోతారని గుర్తుచేశారు..అటువంటి వారి కోసం భరోసా కేంద్రాల్లో ప్రత్యేక నిపుణులతో కౌన్సెలింగ్, వైద్య పరీక్షలు, న్యాయ సహాయం (ప్రాసిక్యూషన్) అన్నీ ఒకే భవనంలో కల్పిస్తున్నట్లు తెలిపారు..బాధితులకు తొలుత మానసిక ధైర్యాన్ని ఇచ్చి, స్నేహపూర్వక వాతావరణంలో వివరాలు సేకరించడం ద్వారా నేరస్థులకు త్వరితగతిన శిక్షలు (కన్విక్షన్లు) పడేలా చేయవచ్చని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని భరోసా కేంద్రంలో 'చైల్డ్ ఫ్రెండ్లీ కోర్టు' కూడా ఒకే ప్రాంగణంలో పనిచేస్తుండటం వల్ల విచారణ వేగవంతం అవుతోందని వివరించారు..సమాజంలో మృగాల్లా ప్రవర్తించే నేరస్థుల వల్ల బాధితులయ్యే వారికి అండగా నిలవడంలో ఈ కేంద్రాల పాత్ర ఎంతో కీలకమని తెలిపారు ఈ కార్యక్రమంలో పోలీస్ ఉన్నత అధికారులు తదితరులు పాల్గొన్నారు

మియాపూర్ లోని 550 ఎకరాల భూమి లో కాలనీలు పోను మిగిలిఉన్న 400 ఎకరాల భూమిని ప్రజా ప్రయోజనాలకే వినియోగించాలి

మియాపూర్ ప్రభుత్వ భూములను అమ్మాలని చూస్తే ఊరుకోం...బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జి రవికుమార్ యాదవ్



శేరిలింగంపల్లి. నవంబర్ 10:(విజన్ ఆంధ్ర) : మియాపూర్ సర్వే నంబర్లు 100, 101 లలోని 550 ఎకరాల భూమి ప్రభుత్వానిదే అని సుప్రీంకోర్టు తీర్పునిచ్చిన నేపథ్యంలో గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ భూములను అమ్మాలని నిర్ణయించినట్లు ప్రకటించిన సందర్భంగా ఎం.ఏ. నగర్ కాలనీని క్షేత్రస్థాయిలో సందర్శించి అక్కడే నివాసం ఉంటూ వారి ఇల్లు కోల్పోతున్న బాధితులతో మాట్లాడి అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మియాపూర్ పరిధిలోని వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములను కాంగ్రెస్ ప్రభుత్వం రియల్ ఎస్టేట్ మాఫియాకు విక్రయించేందుకు కుట్ర పన్నుతోందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ రవికుమార్ యాదవ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు, ఈ సందర్భంగా మాట్లాడుతూ మియాపూర్ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 100లో 277 ఎకరాల 05 గుంటలు, సర్వే నంబర్ 101లో 273 ఎకరాల 34 గుంటలు కలిపి మొత్తం సుమారు 550 ఎకరాల 39 గుంటల భూమి ఉంది. 1912 నాటి సర్వే రికార్డుల నుంచే ఇది సర్కారు భూమిగా నమోదై ఉంది. 1949లో జాగీర్ల రద్దుతో పూర్తిగా ప్రభుత్వ పరమైంది. ప్రైవేట్ వ్యక్తుల అక్రమ వాదనలను తోసిపుచ్చుతూ 2003లోనే హైకోర్టు ఈ భూమి ప్రభుత్వానిదేనని స్పష్టం చేసింది. తాజాగా దశాబ్దాల న్యాయపోరాటానికి తెరదించుతూ సుప్రీంకోర్టు తుది తీర్పు ఇవ్వడం శుభపరిణామం అని పేర్కొన్నారు. అధికారం కోసం ఆస్తులు కాపాడుకోవడం కోసం పార్టీలు మారే ఎమ్మెల్యేకు ప్రజల అవసరాలపై ధ్యాస లేదని ధ్వజమెత్తారు. ప్రజల ఓట్లతో గెలిచిన స్థానిక ఎమ్మెల్యేకు చిత్తశుద్ధి ఉంటే ఈ భూముల అమ్మకం ప్రక్రియను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు, సొంత నియోజకవర్గంలో వేలకోట్ల విలువైన ప్రభుత్వ భూములను రియల్ మాఫియా పంచుకుంటున్నా, కనీసం నోరు విప్పలేని అసమర్థుడని అన్నారు, ఈ వేల కోట్ల విలువైన ఆస్తిని ప్రజా ప్రయోజనాల కోసం కాకుండా, ఖజానా నింపుకోవడానికో లేదా రియల్ ఎస్టేట్ వ్యాపారుల లాభాల కోసమో కాంగ్రెస్ ప్రభుత్వం అమ్మకానికి పెట్టాలని చూడటం దుర్మార్గమని, ప్రస్తుతం ఈ విస్తీర్ణంలో సుమారు 150 ఎకరాల్లో పేద ప్రజలు ఎం.ఏ. నగర్, స్టాలిన్ నగర్ వంటి కాలనీలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నారని, మిగిలిన 400 ఎకరాలు ఖాళీగా ఉన్నాయని, ఈ భూములను అమ్మి సొమ్ము చేసుకునే బదులు, అన్ని హంగులతో కూడిన ఒక పెద్దాసుపత్రి, ప్రభుత్వ డిగ్రీ/ఇంజనీరింగ్ కళాశాల, ప్రజల ఆహ్లాదం కోసం పార్కులు మరియు నిరుపేదలకు పక్కా గృహనిర్మాణం వంటి ప్రజాహిత పనులకు కేటాయించాలని డిమాండ్ చేశారు, శేరిలింగంపల్లి బిడ్డగా ఇక్కడి ప్రజలకు అన్యాయం జరుగుతుంటే చూస్తూ ఊరుకోనని ,తరతరాలుగా గుడిసెలు, ఇళ్లు వేసుకుని నివసిస్తున్న పేదల జోలికొస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయన్నారు, శేరిలింగంపల్లి ప్రజలారా, మన భూములను మనమే రక్షించుకుందామని, మీకు ఏ కష్టం వచ్చినా అండగా నిలవడానికి, మీ తరపున అవసరమైతే జైలుకు వెళ్లడానికైనా నేను సిద్ధంగా ఉన్నానని స్థానిక నివాసితులకు ఆయన పూర్తి భరోసా కల్పించారు, ప్రభుత్వం తన వైఖరి మార్చుకోకపోతే శేరిలింగంపల్లి నుంచే కాంగ్రెస్ ప్రభుత్వ కుట్రలపై పోరాటం ప్రారంభిస్తామని, బీజేపీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాన్ని చేపడతామని రవికుమార్ యాదవ్ హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మాణిక్ రావు, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు విజయేందర్, డివిజన్ అధ్యక్షులు ఆకుల లక్ష్మణ్, శ్రీనివాస్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు సీతారామ రాజు, జిల్లా కౌన్సిల్ సభ్యులు గణేష్ ముదిరాజ్, సీనియర్ నాయకులు రాఘవేంద్ర రావు, నాగేశ్వర్ గౌడ్, సమ్మెట ప్రసాద్, మహేష్ యాదవ్, రాజేష్ గౌడ్, రాము, ప్రకాష్, ప్రవీణ్, మరియు స్థానిక బీజేపీ స్థానిక నాయకులు, కార్యకర్తలు మరియు కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో బాధ్యతాయుతంగా, మర్యాదపూర్వకంగా వ్యవహరించాలి

- ప్రతి ఫిర్యాదుపై సమగ్ర విచారణ జరిపి బాధితులకు న్యాయం అందించాలి

- ఫిర్యాదు వచ్చిన వెంటనే దర్యాప్తు అధికారులను నియమించి విచారణ ప్రారంభించాలి

- రిసెప్షనిస్ట్ అధికారులతో నేరుగా, స్టేషన్ హౌస్ ఆఫీసర్లతో వీసీ ద్వారా సమావేశం

- సిబ్బందికి రిసెప్షన్ వర్టికల్ పై సూచనలు చేసిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడితో పోలీసులు బాధ్యతాయుతంగా, మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ ప్రజలలో పోలీసుల పట్ల నమ్మకాన్ని మరింత పెంపొందించేలా పనిచేయాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. మంగళవారం స్థానిక జిల్లా పోలీసు ముఖ్య కార్యాలయంలో పోలీస్ స్టేషన్లలో రిసెప్షనిస్ట్ విధులు నిర్వహించే సిబ్బందిచే నేరుగా మరియు స్టేషన్ హౌస్ ఆఫీసర్లు, సర్కిల్ అధికారులు, డీఎస్పీలతో వీసీ ద్వారా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో గౌరవంగా మాట్లాడుతూ వారి సమస్యలను ఓపికగా వినాలని, ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా వెంటనే సంబంధిత దర్యాప్తు అధికారులను నియమించి విచారణ ప్రారంభించాలని తెలిపారు. ప్రతి ఫిర్యాదుపై సమగ్రంగా, నిష్పక్షపాతంగా దర్యాప్తు నిర్వహించి నిర్ణీత సమయంలో విచారణ పూర్తి చేసి సరైన నివేదిక అందించాలని సూచించారు. పలు ఫిర్యాదుల విషయంలో ఎస్ఐ స్థాయి అధికారులు నేరుగా దర్యాప్తులో పాల్గొని విచారణ కొనసాగించాలని, బాధితులకు పోలీసులపై నమ్మకం కలిగించే విధంగా వ్యవహరించాలని తెలిపారు. ప్రజల సమస్యలను బాధ్యతాయుతంగా పరిష్కరించినప్పుడే పోలీస్ శాఖ గౌరవం, కీర్తి ప్రతిష్టలు పెరుగుతాయని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయిలో రిసెప్షన్ వర్టికల్‌పై సమీక్షలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఆదిలాబాద్ జిల్లా మరింత మెరుగైన పనితీరును కనబరచాలని సూచించారు. పోలీస్ స్టేషన్ల వారీగా నేను సైతం కార్యక్రమంలో భాగంగా సీసీటీవీ కెమెరాల ఏర్పాటు చేపట్టాలని తెలిపారు. దర్యాప్తు అనంతరం ప్రజలు అందించే అభిప్రాయాలు పోలీసుల పనితీరుకు అనుగుణంగా ఉండేలా న్యాయబద్ధంగా, పారదర్శకంగా విచారణ జరపాలని సూచించారు. ప్రతి ఫిర్యాదును క్రమబద్ధీకరిస్తూ, సంఘటన స్థలంలో అవసరమైన విచారణ చేపట్టి, బాధితులకు సరైన న్యాయం జరిగేలా పూర్తి బాధ్యతతో విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీసీఆర్బీ ఎస్ఐ ప్రవీణ్, రిసెప్షనిస్ట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బా బాలికల విద్యాలయంను తనిఖీ చేసిన కలెక్టర్

నిజామాబాద్ నవంబర్ 10 :(విజన్ ఆంధ్ర) మెండోరా మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణ, టాయిలెట్లు, తరగతి గదులను పరిశీలించారు. స్టోర్ రూంలో నిలువ ఉన్న పండ్లు, కూరగాయలు, ఇతర ఆహార పదార్థాల నాణ్యతను గమనించారు. ఎఫ్.ఆర్.ఎస్ యాప్ ద్వారా సిబ్బంది హాజరును తనిఖీ చేశారు. విద్యార్థుల కోసం సిద్ధం చేసిన మధ్యాహ్న భోజనం మెనూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. మెనూలో పేర్కొన్న క్యారెట్ కర్రీకి బదులుగా ఆలూ కర్రీ వండడాన్ని గమనించిన కలెక్టర్, నిర్వాహకులను నిలదీశారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం శాస్త్రీయ పద్ధతిలో డైట్ మెనూ రూపొందించిందని, దానిని పాటించకుండా ఇష్టారీతిన వ్యవహరిస్తే ప్రయోజనం ఏమిటని మందలించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టిక ఆహారాన్ని అందించాలని ఆదేశించారు. పాఠశాల పరిసరాలు నిశితంగా పరిశీలించిన కలెక్టర్, నిరుపయోగ వస్తువులు ఉండడాన్ని గమనించారు. పరిశుభ్రత పట్ల ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని అన్నారు. తాను మరోమారు ఆకస్మిక తనిఖీకి వస్తానని, విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిని ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. నిర్మాణ దశలో ఉన్న పాఠశాల ప్రహరీ గోడ పనులను నాణ్యతతో వేగంగా పూర్తి చేయించాలని ఆదేశించారు. అనంతరం 6వ తరగతి గదిని కలెక్టర్ సందర్శించి, విద్యార్థినులకు పలు ప్రశ్నలు వేస్తూ వారి అభ్యాసన సామర్థ్యాన్ని అంచనా వేశారు. తన వెంట తెచ్చిన చాక్లెట్లు, బహుమతులను అందించి చిన్నారులను ప్రోత్సహించారు. చక్కగా చదువుకోవాలని, తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తేవాలని హితవు పలికారు. కలెక్టర్ వెంట స్థానిక ఎంపీడీఓ లక్ష్మణ్, ఎం.ఈ.ఓ శ్రీనివాస్, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ పద్మ తదితరులు ఉన్నారు.

ఆ గ్రామాల రైతుల ధాన్యం కొనేదెవరు..?

- ఎనిమిది గ్రామాలకే కొనుగోలు కేంద్రాల పరిమితం..

- మిగతా గ్రామాల రైతులకు తప్పని ఎదురుచూపులు!

- దళారుల చేతికి ధాన్యం అప్పగించాల్సిందేనా..?

- అధికారుల తీరుపై రైతుల ఆందోళన





చిలిపిచేడ్, నవంబర్ 10 (విజన్ ఆంధ్ర): మెదక్ జిల్లా చిలిపిచేడ్ మండలం వ్యాప్తంగా రైతులకు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకునేందుకు కష్టాలు తప్పడం లేదు. ఓవైపు ప్రకృతి వైపరీత్యాలు, ఎల్‌నినో ప్రభావంతో వర్షాల కొరత, మరోవైపు సాగు ఖర్చుల భారాన్ని ఎదుర్కొని పండించిన వరి ధాన్యాన్ని విక్రయించుకునేందుకు రైతులు కొనుగోలు కేంద్రాల కోసం ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం సన్నధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ ప్రకటించడంతో మంజీరా పరివాహక ప్రాంత రైతులు పెద్దఎత్తున వరి సాగు చేశారు. ఇప్పటికే పలువురు రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల వద్దకు తరలించి ఆరబెట్టుకున్నారు. కానీ అందరికీ కొనుగోలు కేంద్రాల సౌకర్యం కల్పించకపోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. చిలిపిచేడ్ మండలంలో మొత్తం 19 గ్రామ పంచాయతీలకు గాను 13 గ్రామాలు, 5 తాండా పంచాయతీలు ఉండగా, సొసైటీ ఆధ్వర్యంలో సోమక్కపేట, చిలిపిచేడ్, చిట్కూల్ గ్రామాల్లో, ఐకేపీ ఆధ్వర్యంలో రాందాస్‌గూడ, శీలంపల్లి, చందూర్, జగ్గంపేట గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, గౌతపూర్ గ్రామంలో ఎఫ్ పీ ఓ ఆధ్వర్యంలో ఇటీవల ప్రారంభించారు. అయితే మండలంలోని మిగతా గ్రామాలైన ఫైజాబాద్, బండాపోతుగల్, అజ్జమర్రి, గంగారంతో పాటు తండాల రైతులకు కొనుగోలు కేంద్రాల ఏర్పాటు విషయంలో స్పష్టత లేకుండా పోయింది. తమ గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఎప్పుడు ఏర్పాటు చేస్తారని రైతులు ప్రశ్నించగా, సొసైటీ, ఐకేపీ పరిధిలోని అధికారులు తమ గ్రామాల ధాన్యం కొనుగోలు చేయలేమన్నట్లుగా సమాధానం ఇచ్చినట్లు రైతులు వాపోతున్నారు. దీంతో ధాన్యాన్ని ఎక్కడ విక్రయించాలో తెలియక అయోమయంలో పడిపోయారు. ఒకవైపు దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ ప్రతినిధులు సూచిస్తుండగా, మరోవైపు తమ గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది.

మరి ఆ గ్రామాల రైతుల పరిస్థితి ఏంటి?

ప్రభుత్వం మద్దతు ధరతో పాటు బోనస్ ప్రకటించినప్పటికీ కొనుగోలు కేంద్రాలు కొన్ని గ్రామాలకే పరిమితం కావడంపై రైతులు ప్రశ్నిస్తున్నారు. అన్ని గ్రామాల రైతులకు సమానంగా కొనుగోలు సౌకర్యం కల్పించాలని, వెంటనే మిగిలిన గ్రామాల్లోనూ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరిస్తారా? లేక ఆ గ్రామాల రైతులు దళారులనే ఆశ్రయించాల్సి వస్తుందా? అన్నది ఇప్పుడు మండలవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొమ్ము ఆనంద్



నాగర్ కర్నూల్ జిల్లా, (ఫోటో జర్నలిస్ట్ మల్లేష్ బాబు) , నవంబర్ 10, నాగర్ కర్నూలు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొమ్ము ఆనంద్ నియమితులయ్యారు మంగళవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వంకేశ్వరం నిరంజన్ చేతుల మీదుగా ఆయన నియామక పత్రాన్ని అందుకున్నారు ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు నిరంజన్ ఆనంద్ కు శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించారు అదేవిధంగా ప్రజలు, మిత్రులు ఆనంద్ కు శుభాకాంక్షలు తెలిపారు.

సత్తి రెడ్డి నగర్ లో బాక్స్ డ్రైన్ పనులు ప్రారంభం



మల్కాజిగిరి, నవంబర్ 10, విజన్ ఆంధ్ర: ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని సత్తిరెడ్డినగర్ లో సుమారు 50 లక్షల రూపాయలతో చేపట్టనున్న బాక్స్ డ్రైన్ నిర్మాణ పనులను మంగళవారం మాజీ కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్, కాలనీ అసోసియేషన్ సభ్యులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు సహకారంతో డివిజన్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఇంకా పెండింగ్లో ఉన్న పనులను కూడా త్వరలోనే పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటానని చెప్పారు. ఈ కార్యక్రమంలో బాబు, సత్యనారాయణ, సంపత్ రావు, కిషోర్,కాలనీ వాసులు శ్రీనివాస్ రెడ్డి, తిరుపతి రెడ్డి, బల్వంత్ రెడ్డి, రాములుగౌడ్, వినాయకరావు, స్వామి నాథన్ సురేందర్, సునీల్, డేవిడ్, అశోక్ కుమార్, మహేందర్, రవి తదితరులు పాల్గొన్నారు

వసతులు లేని వివేకానంద పాఠశాలపై చర్యలు తీసుకోవాలి: రాజశేఖర్ వర్మ



ములుగు నవంబర్ 10, విజన్ ఆంధ్ర ప్రతినిధి : మల్లంపల్లి మండలంలోని వివేకానంద ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కనీస వసతులు లేవని, విద్యాహక్కు చట్టాన్ని పాటించడం లేదని బహుజన్ విద్యార్థి సమాఖ్య జిల్లా అధ్యక్షులు కాడపాక రాజశేఖర వర్మ మంగళవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ఈ విషయంలో చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యా అధికారికి వినతిపత్రం ఇచ్చారు. విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లు, తరగతి గదులు లేవని, పాఠశాల ఆవరణలో పరిశుభ్రత లేక పిచ్చి మొక్కలు పెరిగి విష సర్పాలు, తేళ్లు, విష క్రిమి కీటకాలు వచ్చే ప్రమాదం ఉందని అన్నారు. పాఠశాల ఏర్పడి కొన్ని సంవత్సరాలైనా ఇప్పటివరకు అగ్ని భద్రత ఏర్పాట్లు లేవని, దీనివల్ల విద్యార్థుల ప్రాణాలకు ప్రమాదం ఉందని తెలిపారు. బోధించే ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ అర్హత పరీక్ష అర్హత కూడా లేదని ఆరోపించారు. మండల విద్యా అధికారికి పలుమార్లు చెప్పినా పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తోందని, విద్యా ఉన్నతాధికారుల అండతోనే ఇలాంటి పాఠశాలలు ఇష్టానుసారంగా నడుస్తున్నాయని అన్నారు. విచారణ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుని విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని కోరారు.

మృతుల కుటుంబాలకు అండగా రవిచందర్, ముస్నేపల్లి కుమార్ గౌడ్.



ములుగు నవంబర్ 10, విజన్ ఆంధ్ర ప్రతినిధి : మంత్రి సీతక్క ఆదేశాల మేరకు మృతుల కుటుంబాలను మంగళవారం లిగ్రంథాలయ సంస్థ అధ్యక్షులు భానోత్ రవిచందర్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు ముశినేపల్లి కుమార్ గౌడ్‌లి పరామర్శించారు. ములుగు మండల అంకన్నగూడెం గ్రామంలో గొంది బొర్రయ్య, సర్వాపూర్ లో దన్నారి నగేష్ పార్థివదేహాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. పంచోత్కులపల్లిలో లింగంపల్లి మలహల్ రావు కూతురు కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి తెలిపారు.

హామీలు నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్న కే కే కమిటీ: చంటి భద్రయ్య



ములుగు నవంబర్ 10;విజన్ ఆంధ్ర ప్రతినిధి : ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కే కే కమిటీ కాలయాపన చేస్తోందని ఉద్యమకారుల వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి చంటి భద్రయ్య మంగళవారం ఒక ప్రకటనలో ఆరోపించారు.తొమ్మిదేళ్లుగా చీమ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోరాటం చేస్తే, కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళికలో హామీ ఇచ్చిందని, ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లయినా పట్టించుకోవడం లేదని విమర్శించారు. కమిటీలో ఆరుగురు సభ్యులున్నా భిన్నాభిప్రాయాలతో కాలం గడుపుతున్నారని, ఉద్యమకారుల కుటుంబాలు ఆశతో ఎదురుచూస్తున్నాయని అన్నారు.

భూ రీసర్వే పనులను పకడ్బందీగా పూర్తి చేయాలి

- అదనపు కలెక్టర్ వినోద్ కుమార్



వనపర్తి జిల్లా ప్రతినిధి, నవంబర్ 10 (విజన్ ఆంధ్ర) : వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం వీరాయిపల్లి గ్రామంలో కొనసాగుతున్న సమగ్ర భూ రీసర్వే పనులను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా, పూర్తి పారదర్శకతతో పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్ ఆదేశించారు. మంగళవారం ఆయన గ్రామంలో క్షేత్రస్థాయిలో జరుగుతున్న రీసర్వేను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సర్వే బృందాలు నిర్వహిస్తున్న భూముల కొలతలు, సరిహద్దుల గుర్తింపు ప్రక్రియను పరిశీలించి అధికారులకు పలు సూచనలు జేశారు. సర్వే నంబర్ల వారీగా కొలతలు చేపట్టి, సంబంధిత భూయజమానులు మరియు రైతుల సమక్షంలోనే సరిహద్దులను గుర్తించాలని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఎలాంటి వివాదాలకు తావులేకుండా సరిహద్దు రాళ్లను పక్కాగా పాతడంతో పాటు వివరాలను డిజిటల్ విధానంలో నమోదు చేయాలన్నారు. రైతుల నుంచి వచ్చే అభ్యంతరాలు, ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిశీలించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం సత్వర పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించి, రికార్డుల్లో కచ్చితత్వం తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొంటూ.. ఈ కార్యక్రమ విజయవంతానికి రైతులు, ప్రజలు పూర్తి సహకారం అందించాలని ఆయన కోరారు. ఈ తనిఖీలో సర్వే అధికారులు, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

25కోట్ల తో బ్రిడ్జి నిర్మాణ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రేమసాగర్ రావు



మంచిర్యాల ప్రతినిధి నవంబర్ 10 (విజన్ ఆంధ్ర)మంచిర్యాల నగరంలో నూతన రహదారులు నిర్మించి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పిస్తామని ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు స్పష్టం చేశారు. మంచిర్యాల నగరంలోని రాళ్లపేట మధ్యగల రాళ్లవాగుపై 23 కోట్ల రూపాయలతో నూతనంగా నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులను ఎమ్మెల్యే మేయర్ దర్ని మధుకర్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంచిర్యాల నగరంలో సుమారు 225 కోట్లతో బ్రిడ్జి మరియు నూతన రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్నామని ఆయన అన్నారు. లక్ష్మి నగర్ నుండి రంగపేట, క్వారీ రోడ్డు నుండి అండాలమ్మ కాలనీ వరకు నాలుగు వరుసల రోడ్డు నిర్మాణం అక్కడి నుండి పాత మంచిర్యాల వరకు 6 లైన్ ల రోడ్ నిర్మాణం చేపట్టనున్నట్టు తెలిపారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడం తో రోడ్డు ప్రమాదాలను నివారిస్తున్నామని అన్నారు. సంవత్సరంలోపు ఈ రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని ఆయన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సౌకర్యార్థమే పనిచేస్తుందని ఇందులో భాగంగానే మంచిర్యాల పట్టణంలో సుందరీ కరణమైన రోడ్డు విస్తరణ పనులు చేపట్టామని తెలిపారు. నిధులు మంజూరు చేసిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు ఎనుముల రేవంత్ రెడ్డి , రాష్ట్ర రోడ్లు &భవనాల మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు..ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షులు చిట్ల సత్యనారాయణ, మంచిర్యాల నగర మేయర్ దర్ని మధుకర్, కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు , కార్పొరేటర్ తూముల నరేష్ , మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ సల్ల మహేష్, స్థానిక ప్రజా ప్రతినిధులు, ఆర్&బి, మున్సిపల్ అధికారులతో పాటు కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు, రంగపేట ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

జవహర్ నగర్ లో 50 ఎకరాల భూమి గుట్టు..
ఒక్క ఫిర్యాదుతో బయటపడిన పెద్ద వ్యవహారం!

ములుగు వెంకటాపూర్ నవంబర్ 10; విజన్ ఆంధ్ర ప్రతినిధి. : జవహర్ నగర్ శివారులో ఉన్న 50 ఎకరాల కేటాయింపు భూమి వ్యవహారం ఇప్పుడు వెంకటాపూర్ మండలంలోనే కాకుండా ములుగు జిల్లా వ్యాప్తంగా పెద్ద చర్చకు దారి తీసింది.

50 ఎకరాల భూమి.. ఒక్కడి చేతిలోకి ఎలా వెళ్లింది? జవహర్ నగర్ లో పెద్ద గుట్టు బయటకు!

368, 341, 441 భూమి కొలత సంఖ్యలలో ఉన్న ఈ భూమిని జంగాలపల్లికి చెందిన ఓ వ్యక్తి ఆక్రమించుకుని, నకిలీ పట్టాలు పొందాడనే ఆరోపణలు వస్తున్నాయి. గుంట భూమి కోసం సామాన్యుడు కార్యాలయాల చుట్టూ తిరుగుతుంటే, ఇంత పెద్ద భూమి ఒక్కడి చేతిలోకి ఎలా వెళ్లిందని జనం నిలదీస్తున్నారు.

ఒక్క ఫిర్యాదుతో బయటపడిన భూ ఆక్రమణ.. పట్టాల వెనుక ఉన్న కథ ఏమిటి?

ఈ వ్యవహారం వెలుగులోకి రావడానికి ప్రధాన కారణం ఎల్లారెడ్డిపల్లికి చెందిన భేతి సతీష్ యాదవ్ ఇచ్చిన ఒక్క వినతిపత్రమే. సోమవారం మండల అభివృద్ధి అధికారి కార్యాలయంలో జరిగిన వినతుల స్వీకరణలో జవహర్ నగర్ భూమిని ఒక వ్యక్తి ఆక్రమించి, ఇతరుల పేర్లతో పట్టాలు చేయించుకుని ప్రభుత్వ పథకాలు, రుణాలు పొందుతూ లబ్ధి పొందుతున్నాడని, అతనిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు. ఆయన ముందుకు రాకుంటే ఈ విషయం ఇంకా ఎవరికీ తెలిసేది కాదని గ్రామస్తులు చెబుతున్నారు.

జవహర్ నగర్ భూములపై అధికారుల ఆరా.. నిఘా వర్గాల కళ్లు అటువైపే!

ఫిర్యాదు తర్వాత భూమి శాఖ అధికారులు మంగళవారం విచారణను వేగవంతం చేశారు. ఈ భూములు ప్రభుత్వ భూములా, అటవీ భూములా, కేటాయింపు భూములా అనేది తేల్చేందుకు దస్త్రాలను లోతుగా పరిశీలిస్తున్నారు. ఒక్క వ్యక్తి ఇంత పెద్ద భూమిని తన పేరున చేసుకోవడం వెనుక ఎవరైనా ఉన్నారా ? అనే కోణంలో నిఘా వర్గాలు కూడా సమాచారం సేకరిస్తున్నట్లు తెలుస్తోంది.

సామాన్యుడికి గుంట భూమి లేదు.. ఆక్రమణదారుడికి 50 ఎకరాలు.. ఇదేం న్యాయం?

సామాన్యులకు నిబంధనలు చెబుతూ ఆక్రమణదారులకు పట్టాలు, రైతుబంధు, రుణాలు ఎలా అందుతున్నాయని, ఇది రెండు రకాల న్యాయమా అని జనం నిలదీస్తున్నారు. అక్రమ పట్టాలను రద్దు చేసి భూములను తిరిగి స్వాధీనం చేసుకుని పేద ప్రజలకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

నకిలీ పట్టాలతో 50 ఎకరాలు కాజేశాడా? విచారణలో కీలకంగా మారిన దస్త్రాలు

పట్టాలు ఏ సంవత్సరంలో వచ్చాయి, ఏ అధికారి ఇచ్చారు, ఏ ఆధారంతో ఇచ్చారు, భూమి కొలత సంఖ్యలలో ఏమైనా తేడాలు జరిగాయా, పత్రాలలో ఏమైనా మార్పులు చేశారా అనేది చూస్తున్నారు. బినామీ పేర్లతో పట్టాలు, రైతుబంధు, రుణాలు తీసుకున్నారనే ఆరోపణలపై ఆరా తీస్తున్నారు. పట్టా పేర్లలో ఉన్న వారికి నిజంగా ఆ భూములతో సంబంధం ఉందా అనేది తేల్చేందుకు పాత పహాణీలు, పటాలు, దస్త్రాలను పరిశీలిస్తున్నారు. భూమి శాఖలో గానీ, రాజకీయాల్లో గానీ ఎవరైనా సహకరించారా? అనేది తెలుసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు.

జవహర్ నగర్ భూమి పట్టాలు రద్దవుతాయా? ప్రభుత్వం చేతికి వస్తాయా?

మండల స్థాయి అధికారులు మాత్రమే చూస్తే సరిపోదని, జిల్లా పాలనాధికారి, మంత్రి జోక్యం చేసుకుని జిల్లా స్థాయి నుంచి ప్రత్యేక విచారణ జరిపించాలని ప్రజలు కోరుతున్నారు. జిల్లా కలెక్టర్ స్వయంగా దస్త్రాలు చూసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, మంత్రి సీతక్క అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు. జవహర్ నగర్ చుట్టూ సమీకృత పాఠశాల, నూనె కర్మాగారం, సుంకం వసూలు కేంద్రం, ఎర్రి గట్టమ్మ గుడి, పచ్చదనం భోజనశాల వంటి అభివృద్ధి పనులు జరుగుతుండటంతో ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర కట్టడాలకు భూమి అవసరం పెరుగుతోంది. ఆక్రమణలో ఉన్న భూమిని స్వాధీనం చేసుకుని ప్రభుత్వ పనులకు వాడుకుంటే ప్రైవేటు భూమి కొనాల్సిన అవసరం తగ్గి అభివృద్ధి పనులు వేగంగా జరుగుతాయని స్థానికులు, ప్రజాప్రతినిధులు అభిప్రాయపడుతున్నారు. ఇదే కోణంలో ఇంకా ఏమైనా ప్రభుత్వ భూమిని ఎవరైనా ఆక్రమించారా అనేది కూడా పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు. జవహర్ నగర్ ఒక్కటే కాదు, మండలంలో ఎక్కడైనా ప్రభుత్వ భూమిని అక్రమంగా పట్టాలు చేయించుకుని ఉంటే, వారందరినీ పరిశీలించి, వారిపై చర్యలు తీసుకోవాలని, అలా చేస్తేనే నిజమైన న్యాయం జరుగుతుందని అంటున్నారు. స్థానిక మంత్రి సీతక్క , జిల్లా కలెక్టర్ దీనిపై చర్యలు తీసుకుంటారా? లేదా ? వేచి చూడాల్సిందే అని ములుగు జిల్లా వాసుల గుసగుసలు.

జీఎస్ఐ శిక్షణ సంస్థలో మూడు ప్రధాన మౌలిక వసతులను ప్రారంభించిన కిషన్ రెడ్డి



హైదరాబాద్ నవంబర్ 2026, విజన్ ఆంధ్ర (అకెళ్ళ. విశ్వనాథ్) : బండ్లగూడ, నాగోల్ హైదరాబాద్ లో ఉన్న జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా శిక్షణ సంస్థ (జీఎస్ఐటీఐ)లో మూడు ప్రధాన మౌలిక వసతులను కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జీ కిషన్ రెడ్డి, మల్కాజిగిరి పార్లమెంటు సభ్యుడు ఈటల రాజేందర్ మంగళవారం నాడు రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. ఆనందోత్సాహల మధ్య సాగిన ఈ ప్రారంబొత్సవాలలో అంతర్జాతీయ వసతి గృహాలు (నలంద, తక్షశిల), అధునాతన జియోఫిజికల్ డేటా ప్రాసెసింగ్ ల్యాబొరేటరీ, డిజిటల్ స్టూడియో ఉన్నాయి. ప్రారంభోత్సవం అనంతరం జీఎస్ఐటీఐ శిక్షణ, పరిశోధన, సామర్థ్య నిర్మాణ కార్యకలాపాలను బలోపేతం చేసేందుకు ఏర్పాటు చేసిన నూతన మౌలిక సదుపాయాలను కేంద్ర మంత్రి జీ కిషన్ రెడ్డి, మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ పరిశీలించారు. ఏర్పాటు చేసిన సౌకర్యాలను సమీక్షించారు. ఈ సందర్భంగాసభను ఉద్దేశించి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రసంగిస్తూ, కొత్తగా ప్రారంభించిన ఈ సౌకర్యాలు సంస్థాగత మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడానికి, అంతర్జాతీయ సహకారాన్ని ప్రోత్సహించడానికి, అధునాతన భూ వైజ్ఞానిక శిక్షణ, అంతర్జాతీయ సహకారం, డిజిటల్ లెర్నింగ్ సామర్థ్యాలను సులభతరం చేయడానికి గణనీయంగా దోహదపడతాయని తెలియజేశారు. అభివృద్ధి చెందిన దేశంగా మారే దిశగా భారత్ సాగిస్తున్న ప్రయాణంలో ఖనిజ, మైనింగ్ రంగం పోషిస్తున్న కీలకపాత్రను వివరించారు. 176 ఏళ్ల జీఎస్ఐ వారసత్వం గురించి, దేశవ్యాప్తంగా భూగర్భ సర్వేలకు ఈ సంస్థ అందించిన గణనీయమైన సహకారం గురించి తెలియజేశారు. జాతీయ కీలక ఖనిజ మిషన్ కార్యక్రమానికి ఉన్న ప్రాముఖ్యాన్ని ఆయన వివరించారు. అలాగే భారత దేశ ఖనిజ భద్రతను బలోపేతం చేయడానికి, ఇతర దేశాలపై ఆధారపడటాన్ని తగ్గించడానికి కీలకమైన ఖనిజాలు, అరుదైన మూలకాల అన్వేషణను వేగవంతం చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా కీలకమైన ఖనిజ నిక్షేపాలు ఉండే అవకాశం ఉన్న ప్రాంతాల్లో అన్వేషణను మరింత వేగవంతం చేయాలని జీఎస్ఐను కోరారు. అలాగే అన్వేషణ కార్యకలాపాలను వేగవంతం చేయడానికి, ఖనిజ బ్లాకులను సకాలంలో సిద్ధం చేయడానికి, వేలం జరిగేలా చూడటానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు. రాజస్థాన్ లోని సివానా రింగ్ కాంప్లెక్స్ (ఎస్ఆర్సీ)తో పాటు దేశంలో వివిధ ప్రాంతాల్లో కొనసాగుతున్న అన్వేషణ ప్రయత్నాల గురించి ప్రస్తావించారు. అరుదైన భార మూలకాలు, ఇతర కీలకమైన ఖనిజాల అన్వేషణను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.జీఎస్ఐ అన్వేషణ, పరిశోధన సామర్థ్యాలను విస్తరించడంలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానాలను స్వీకరించడం, సంస్థాగత సంస్కరణలు చేపట్టడం, అంతర్జాతీయ సహకారాన్ని బలోపేతం చేయడానికి ఉన్న ప్రాధాన్యాన్ని కూడా కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. జాతీయ, అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలు, విద్యాసంస్థలతో సహకారాన్ని బలోపేతం చేయాల్సిన, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా శిక్షణా వసతులను మెరుగుపరచాల్సిన అవసరం గురించి కూడా వివరించారు. దేశంలోని జియోసైంటిఫిక్ వనరులను విస్తృతంగా వినియోగంలోకి తీసుకువచ్చేలా జియోలాజికల్ సమాచారాన్ని, డేటాను బహిరంగ వేదికల ద్వారా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని జీఎస్ఐకు సూచించారు. భారతదేశ ఇంధన అవసరాలను తెలియజేస్తూ, ఇంధన భద్రతను అందించడంలో తగినంత బొగ్గు ఉత్పత్తిని కొనసాగించడానికి ఉన్న ప్రాధాన్యం గురించి కేంద్ర మంత్రి వివరించారు. దేశ విద్యుత్ అవసరాలను తీర్చడంలో బొగ్గు ఆధారిత థర్మల్ విద్యుత్ కీలక పాత్ర పోషిస్తుందని ఆయన అన్నారు. వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించడంలో శాస్త్రీయ పరిశోధన, సాంకేతిక పురోగతికి ఉన్న ప్రాధాన్యాన్ని మల్కాజ్గిరి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్ వివరించారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాలు, సెమీకండక్టర్ పరిశ్రమలు, పరిశోధనలే ప్రపంచాభివృద్ధిని ముందుకు నడిపిస్తున్నాయన్నారు. ప్రపంచ స్థాయిలో పోటీ పడేలా దేశాన్ని బలోపేతం చేయడానికి ఖనిజ వనరులను సమర్థంగా అన్వేషించి, వినియోగించుకోవడంతో పాటు, అధునాతన సాంకేతిక పరిజ్ఞానాలను స్వీకరించడం అవసరమని చెప్పారు. హైదరాబాద్ జీఎస్ఐటీఐ అందిస్తున్న సేవలను ప్రశంసించారు. శాస్త్రవేత్తలు, పరిశోధకులు, అధ్యాపకులు తమ పరిశోధనా కార్యకలాపాలను ముమ్మరం చేసి జాతీయ అభివృద్ధికి దోహదపడాలని ఆయన ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో జియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్ జనరల్ దినేశ్ వీ గన్వీర్, గనుల మంత్రిత్వశాఖ సంయుక్త కార్యదర్శి ఫరీదా ఎం నాయక్, గనుల మంత్రిత్వశాఖ, జీఎస్ఐ, జీఎస్ఐటీఐకు చెందిన ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మాత అమృతానందమయి మానవతా సేవలు ప్రపంచానికే ఆదర్శం: గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా

హైదరాబాద్ బ్రహ్మస్థానం మహోత్సవంలో "అమృత గంగా" తెలుగు సంచిక ఆవిష్కరణ







హైదరాబాద్ నవంబర్ 2026 విజన్ ఆంధ్ర (అకెళ్ళ విశ్వనాథ్) : మానవ సేవే మాధవ సేవ అనే సందేశాన్ని తన సేవా కార్యక్రమాల ద్వారా మాతా అమృతానందమయి దేవి (అమ్మ) ప్రపంచానికి చాటిచెబుతున్నారని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా తెలిపారు. అమృతానందమయి అమ్మ చేస్తున్న సంక్షేమ సహాయ కార్యక్రమాలు ప్రశంసనీయం ఆదర్శం అని అభినందించారు. సోమవారం ఉదయం హైదరాబాద్ లోని మహేంద్ర హిల్స్ లోని అమృత విద్యాలయంలో ఏర్పాటు చేసిన బ్రహ్మస్థాన వార్షిక మహోత్సవంలో పాల్గొన్న గవర్నర్ మాట్లాడుతూ, వసుధైవ కుటుంబకం (ప్రపంచమంతా ఒకే కుటుంబం) అనే భారతీయ సంస్కృతి గొప్ప సందేశాన్ని అమ్మ తన సేవా కార్యక్రమాల ద్వారా ప్రపంచవ్యాప్తంగా విస్తరిస్తున్నారని కొనియాడారు. యువతలో నైతిక విలువలను పెంపొందించేందుకు అమ్మ చేపడుతున్న కార్యక్రమాలను ఆయన ప్రశంసించారు. విలువలతో కూడిన యువతను తీర్చిదిద్దడంలో అమ్మ కృషి ఆచరణాత్మక ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి మాట్లాడుతూ, సనాతన ధర్మానికి అమ్మ ప్రపంచ వేదికపై ఒక గొప్ప స్వరంగా నిలిచారని అన్నారు. భారతీయ సాంస్కృతిక విలువల ఆధారంగా సమాజ నిర్మాణానికి అమ్మ చేస్తున్న కృషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు, కరీంనగర్ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య, జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ సౌమ్య మిశ్రా, హైదరాబాద్ చిన్మయ మిషన్ అధిపతి స్వామి సర్వేశానంద సరస్వతి తదితరులు పాల్గొన్నారు. ఉదయం జరిగిన కార్యక్రమంలో ప్రముఖులు పూలమాలలతో అమ్మకు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాత అమృతానందమయి అమ్మ మాట్లాడుతూ, ప్రకృతి నుంచి మనం ఎన్నో విషయాలు నేర్చుకోవాలని, మనుషుల మధ్యనే కాకుండా ప్రకృతితో కూడా సహకారం, సామరస్య భావనను పెంపొందించుకోవాలని సూచించారు. ప్రపంచ పురోగతి, సర్వజన సంక్షేమానికి ఈ సామరస్యం ఎంతో అవసరమని అన్నారు. అమృతశ్రీ సభ్యులకు వస్త్రాలు, ఆర్థిక సహాయం అందించడంతో పాటు దివ్యాంగులకు వీల్‌చైర్లు పంపిణీ చేశారు. అమ్మ సందేశాలు, దేశవిదేశీ పర్యటనలు, భజనలతో కూడిన అమృత గంగా కార్యక్రమం తెలుగు సంచికను ఈ సందర్భంగా ఆవిష్కరించారు. అనంతరం అమ్మ భజనలు, ధ్యాన కార్యక్రమాలకు నేతృత్వం వహించి భక్తులకు దర్శనం ఇచ్చి ప్రతి ఒక్కరినీ ఆలింగనం చేసుకుని, దీవించి, ధైర్యాన్ని నింపారు. ఈ మహోత్సవానికి వేలాది మంది అమ్మ భక్తులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్ల హక్కుల రక్షణపై అవగాహన

- వివక్ష,వేధింపులకు గురైతే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలి

- ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ



మంచిర్యాల ప్రతినిధి నవంబర్ 10 (విజన్ ఆంధ్ర) రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు ట్రాన్స్‌జెండర్ల సంక్షేమం,హక్కులు మరియు వారికి కల్పిస్తున్న చట్టపరమైన రక్షణపై అవగాహన కల్పించేందుకు ట్రాన్స్‌జెండర్ ప్రొటెక్షన్ సెల్ జిల్లా ఇన్‌చార్జ్, మంచిర్యాల మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మంచిర్యాల మహిళా పోలీస్ స్టేషన్ ఆవరణలో జిల్లా పరిధిలోని ట్రాన్స్‌జెండర్లకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో వారి హక్కులు, భద్రత, సంక్షేమం మరియు చట్టపరమైన రక్షణకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు. ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల (హక్కుల పరిరక్షణ) చట్టం2019 ప్రకారం ట్రాన్స్‌జెండర్లపై ఎలాంటి వివక్ష, వేధింపులకు పాల్పడినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తెలిపారు.విద్య, ఉపాధి,నివాసం తదితర రంగాల్లో ట్రాన్స్‌జెండర్ల హక్కులకు చట్టం రక్షణ కల్పిస్తుందని వివరించారు. ఎవరైనా అవమానించినా, వేధింపులకు గురిచేసినా లేదా తమ హక్కులకు భంగం కలిగించినా వెంటనే పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. ట్రాన్స్‌జెండర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పోలీసుల దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలోని ట్రాన్స్‌జెండర్ ప్రొటెక్షన్ సెల్ ద్వారా ట్రాన్స్‌జెండర్ల భద్రత, సంక్షేమం కోసం అవసరమైన చర్యలు చేపడుతున్నామని తెలిపారు.వారి హక్కులు మరియు చట్టపరమైన రక్షణపై సోషల్ మీడియా వేదికల ద్వారా కూడా విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. సమాజంలో ట్రాన్స్‌జెండర్ల పట్ల ఎలాంటి వివక్షకు తావులేకుండా ప్రతి ఒక్కరూ వారిని గౌరవంతో, సమానత్వ భావనతో చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో షీ టీమ్ ఎస్ఐ హైమతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

రహదారులపై ధాన్యం ఆరబెట్టవద్దు.. ప్రమాదాలకు తావివ్వొద్దు

- రైతులు సురక్షిత ప్రదేశాలను వినియోగించుకోవాలి

- జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్



మెదక్, నవంబర్ 10:(విజన్ ఆంధ్ర జిల్లా ప్రతినిధి) : రహదారులపై వరి ధాన్యం ఆరబెట్టడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ గారు ఒక ప్రకటనలో తెలిపారు. కొంతమంది రైతులు ధాన్యాన్ని రహదారులపై ఆరబెట్టడం వల్ల వాహనాల రాకపోకలకు అంతరాయం కలగడమే కాకుండా వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. ధాన్యం చుట్టూ రాళ్లు పెట్టడం, నల్లటి పాలిథిన్ కవర్లతో కప్పడం వల్ల ముఖ్యంగా రాత్రి వేళల్లో వాహనదారులు వాటిని గుర్తించలేక ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్నాయని వెల్లడించారు. రహదారులపై ధాన్యం ఆరబెట్టడం ఇతరుల ప్రాణాలకు ముప్పుగా మారుతుందని స్పష్టం చేశారు. రైతులు రహదారులను వినియోగించకుండా గ్రామ పంచాయతీ ప్రాంగణాలు, ఖాళీ స్థలాలు లేదా రహదారులకు దూరంగా ఉన్న సురక్షిత ప్రదేశాల్లో ధాన్యాన్ని ఆరబెట్టుకోవాలని సూచించారు. చిన్నపాటి నిర్లక్ష్యం పెద్ద ప్రమాదాలకు దారితీస్తుందని, రైతులు తమ భద్రతతో పాటు ఇతరుల ప్రాణాల భద్రతను కూడా దృష్టిలో ఉంచుకోవాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రమాదాల నివారణకు ప్రజలందరూ సహకరించాలని కోరారు.

అయ్యా సాగర్ క్షేత్రంలో శివ మండల దీక్ష - మాలాధారణ

- కల్వకుర్తి పట్టణంలోని వెంకటేశ్వర స్వామి దేవాలయంలో 41 రోజుల పాటు నిత్య అన్నప్రసాదం



కల్వకుర్తి, నవంబర్ 10 (విజన్ ఆంధ్ర): కల్వకుర్తి నియోజకవర్గంలోని అయ్యా సాగర్ క్షేత్రంలోని శివాలయంలో శివ మండల దీక్ష స్వీకరణ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. ఆనంద్ గౌడ్ గురుస్వామి ఆధ్వర్యంలో స్వాములు శివమాలలు ధరించి మండల దీక్షను ప్రారంభించారు. శివాలయ ప్రాంగణం మొత్తం "ఓం నమఃశివాయ", "హర హర మహాదేవ్" నినాదాలతో మార్మోగింది. ముందుగా స్వాములు స్నానాలాచరించి స్వామివారికి పంచామృత అభిషేకం నిర్వహించి మాలాధారణ స్వీకరించారు. అనంతరం స్వామివారికి శతనామావళి, బిల్వాష్టకం, లింగాష్టకం నామాలతో పూజలు నిర్వహించి స్వామివారి సన్నిధిలో జపమాలతో జపం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గురు స్వాములు జంగయ్య, రాజుతో పాటు స్వాములు శ్రీను, రాకేష్, మణికంఠ, పవన్ కుమార్, అరవింద్, బాలరాజు, రిషి, శ్రీశాంత్ పాల్గొన్నారు.

కల్వకుర్తిలో 4 ఏళ్లుగా నిత్య అన్నదానం

మాలాధారణ కేవలం అయ్యా సాగర్ క్షేత్రంలోనే జరిగిందని, అయితే నిత్య అన్నప్రసాదం మాత్రం కల్వకుర్తి పట్టణంలోని వెంకటేశ్వర స్వామి దేవాలయంలో నిర్వహించబడుతుందని గురుస్వామి ఆనంద్ గౌడ్ తెలిపారు. ఈ నిత్య అన్నప్రసాదం గత నాలుగు సంవత్సరాల నుంచి దాతల సహకారంతో నిర్వహించడం జరుగుతోందని చెప్పారు. ఈ సంవత్సరం కూడా యథావిధిగా 41 రోజుల పాటు నిత్య అన్నప్రసాదం ఉంటుందని స్పష్టం చేశారు. శివ మండల దీక్షలో ఉన్న స్వాములు నిత్య అన్నప్రసాదానికి వచ్చే ముందు ఫోన్ ద్వారా సంప్రదించాలని గురుస్వామి ఆనంద్ గౌడ్ కోరారు. ముందుగా సంప్రదించడం వల్ల భోజన ఏర్పాట్లలో ఇబ్బంది ఉండదని, అందరికీ సక్రమంగా ప్రసాదం అందించడానికి వీలవుతుందని తెలిపారు. గురుస్వామి ఆనంద్ గౌడ్ మాట్లాడుతూ.. శివ మండల దీక్ష అంటే కేవలం మాల వేసుకోవడం కాదని, మనసును, శరీరాన్ని శివునికి అర్పించడమని చెప్పారు. 41 రోజుల పాటు నియమనిష్ఠలతో, సాత్విక ఆహారంతో, శివనామ జపంతో దీక్ష కొనసాగించాలని స్వాములకు సూచించారు. దాతల సహకారంతోనే ఈ అన్నదాన కార్యక్రమం ఇంత ఘనంగా సాగుతోందని, దాతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

765-D, 765-DG రోడ్ల నిర్మాణంలో భూములు కోల్పోతున్న బాధితులకు పరిహారం అందించాలి

- జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్

- 765 డి765 డిజి రోడ్ల నిర్మాణంలో భూములు కోల్పోతున్న బాధితులకు పరిహారం అందించాలని జిల్లా కలెక్టర్ అన్నారు.



మెదక్, నవంబర్ 10:(విజన్ ఆంధ్ర జిల్లా ప్రతినిధి):మంగళవారం కలెక్టరేట్ నుంచి జాతీయ రహదారుల అధికారులతో గూగుల్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రామాయంపేట నుంచి సిద్దిపేట పరిధిలో ఉన్న 765-D, 765-DG రోడ్ల నిర్మాణం కోసం భూములు కోల్పోతున్న రైతులు, భూయజమానులకు ప్రభుత్వం నిర్ణయించిన నిబంధనల ప్రకారం తగిన నష్టపరిహారం అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. రోడ్ల నిర్మాణం కోసం చేపడుతున్న భూసేకరణ ప్రక్రియలో బాధితులకు ఎలాంటి నష్టం జరగకుండా చూడాలని, భూముల సర్వే, రికార్డుల పరిశీలనను పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. భూములు కోల్పోతున్న బాధితుల వివరాలను సేకరించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ నిబంధనల ప్రకారం పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పరిహారం చెల్లింపులో ఎలాంటి జాప్యం లేకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా చేపడుతున్న రోడ్ల నిర్మాణ పనులతో పాటు భూములు కోల్పోతున్న రైతులు, బాధితుల ప్రయోజనాలను కూడా పరిరక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ రహదారుల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెంచిన పన్నులు తగ్గించాలని 48 గంటల దీక్ష - బీజేపీ బలరాం



ములుగు నవంబర్ 10, విజన్ ఆంధ్ర ప్రతినిధి : ములుగులో పెంచిన ఇంటి పన్నులు, వ్యాపారుల పన్నులను వెంటనే తగ్గించాలని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు సిరికొండ బలరాం డిమాండ్ చేశారు. జిల్లా కార్యాలయంలో పట్టణ అధ్యక్షులు ఇమ్మడి రాకేష్ యాదవ్ ఆధ్వర్యంలో 16వ తేదీ నుంచి జరగబోయే 48 గంటల నిరాహార దీక్ష సన్నాహక సమావేశం, కరపత్రం ఆవిష్కరణ జరిగింది. దీక్షకు జాతీయ, రాష్ట్ర నాయకులు వస్తారని, వర్తక, వ్యాపార సంస్థలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని మద్దతు తెలపాలని బలరాం పిలుపునిచ్చారు.

పుట్టినరోజుకు ప్రజల సొమ్ము.. పాలమూరుకు మాత్రం వలసలేనా?

- ప్రభుత్వ ఖర్చుతో పుట్టినరోజు వేడుకలు జరుపుకున్న ముఖ్యమంత్రిని ఎప్పుడూ చూడలేదు!

- రేవంత్ రెడ్డి ప్రభుత్వ ఖర్చుతో పుట్టినరోజు జరుపుకొని ప్రతిపక్షాలను తిడుతున్నాడు

- మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి ధ్వజం

తెలంగాణ స్టేట్ బ్యూరో, నవంబర్ 10 (విజన్ ఆంధ్ర):

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత నిరంజన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రభుత్వ ఖర్చుతో పుట్టినరోజు వేడుకలు జరుపుకున్న ముఖ్యమంత్రిని తాను ఎప్పుడూ చూడలేదని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వ ఖర్చుతో పుట్టినరోజు జరుపుకొని ప్రతిపక్షాలను తిడుతున్నాడని మండిపడ్డారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు, కొడంగల్‌కు నిధులు, నారాయణపేటకు నీళ్లు తదితర అంశాలపై రేవంత్ రెడ్డిని నిలదీశారు.

ప్రభుత్వ ఖర్చుతో పుట్టినరోజు.. ఎప్పుడూ చూడలేదు

ముఖ్యమంత్రి పుట్టినరోజు వేడుకలను ప్రభుత్వ ఖర్చుతో, ప్రభుత్వ యంత్రాంగాన్ని ఉపయోగించి జరుపుకోవడం ఏమిటని నిరంజన్ రెడ్డి ప్రశ్నించారు. ఇప్పటివరకు తెలంగాణలో ఎంతో మంది ముఖ్యమంత్రులను చూశాం. ఎవరూ ఇలా ప్రభుత్వ ఖర్చుతో పుట్టినరోజు వేడుకలు జరుపుకోలేదని చెప్పారు. సొంత డబ్బుతో జరుపుకుంటే ఎవరూ అడ్డు చెప్పరు. కానీ ప్రజల సొమ్ముతో, ప్రభుత్వ ఖజానా నుంచి డబ్బులు ఖర్చు చేసి పుట్టినరోజు చేసుకోవడం, ఆ వేదికపై నుంచే ప్రతిపక్షాలను తిట్టడం దారుణమని మండిపడ్డారు. ముఖ్యమంత్రి పదవి అంటే ప్రజా సేవ కోసం, ప్రజల సొమ్మును కాపాడటం కోసం తప్ప, సొంత వేడుకల కోసం కాదని హితవు పలికారు.

రేవంత్ రెడ్డి తన పుట్టినరోజు వేడుకలకు ప్రభుత్వ అధికారులను, ప్రభుత్వ వాహనాలను, ప్రభుత్వ నిధులను వాడుకున్నారని నిరంజన్ రెడ్డి ఆరోపించారు. కొడంగల్‌లో జరిగిన వేడుకలు చూస్తే అది ముఖ్యమంత్రి పుట్టినరోజా? లేక ప్రభుత్వ కార్యక్రమమా? అన్న అనుమానం వచ్చిందని ఎద్దేవా చేశారు. ప్రజల కష్టార్జితంతో వచ్చిన పన్నుల డబ్బును ఇలా వృథా చేయడం సరికాదని, దీనిపై ప్రజలే తీర్పు ఇస్తారని హెచ్చరించారు.



కొడంగల్‌కు 10 వేల కోట్లు.. ఈర్ష్య పడుతున్నారా?

రేవంత్ రెడ్డి కొడంగల్‌కు 10 వేల కోట్ల నిధులు తీసుకెళ్తున్నాడని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఈర్ష్య పడుతున్నారని నిరంజన్ రెడ్డి అన్నారు. సొంత పార్టీ నేతలే రేవంత్ రెడ్డి తీరుపై అసంతృప్తితో ఉన్నారని చెప్పారు. కొడంగల్ ఒక్కటే తెలంగాణ కాదు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలు సమానంగా అభివృద్ధి చెందాలని, కానీ రేవంత్ రెడ్డి మాత్రం తన సొంత నియోజకవర్గం కొడంగల్‌లోకే అన్నీ తీసుకెళ్తున్నాడని విమర్శించారు. ఇదే విషయాన్ని కాంగ్రెస్‌లోని సీనియర్ నేతలు, మంత్రులు కూడా బహిరంగంగానే చెబుతున్నారని గుర్తుచేశారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి లాంటి సీనియర్ నేతలు సైతం రేవంత్ రెడ్డి తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చని నిరంజన్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాలకు నిధులు రావడం లేదని, అభివృద్ధి ఆగిపోయిందని గగ్గోలు పెడుతున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి తన నియోజకవర్గానికే నిధులు మళ్లిస్తే మిగతా నియోజకవర్గాల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు.

10 వేల కోట్లలో 1500 కోట్లు పెట్టి ఉంటే..

రేవంత్ రెడ్డి తెచ్చిన రూ.10 వేల కోట్లలో ఒక 1000-1500 కోట్లు మూడేళ్ల కిందే ఖర్చు పెట్టి ఉంటే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులోని మిగతా పనులు పూర్తి అయ్యేవని నిరంజన్ రెడ్డి అన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేసే చిత్తశుద్ధి రేవంత్ రెడ్డికి లేదని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో ఈ ప్రాజెక్టు పనులు వేగంగా జరిగాయని, కానీ కాంగ్రెస్ వచ్చాక పనులు నిలిచిపోయాయని చెప్పారు. కేవలం 1000 నుంచి 1500 కోట్లు ఖర్చు చేసి ఉంటే మిగతా పనులు పూర్తయి లక్షల ఎకరాలకు నీరు అంది ఉండేదని ఆవేదన వ్యక్తం చేశారు.

పాలమూరు-రంగారెడ్డి పనులు పూర్తి అయి ఉంటే ఎన్నో లక్షల ఎకరాలకు సాగునీరు వచ్చేదని నిరంజన్ రెడ్డి చెప్పారు. పాలమూరు జిల్లా రైతుల కళ్లలో ఆనందం కనిపించేదని, వలసలు ఆగిపోయేవని చెప్పారు. కానీ రేవంత్ రెడ్డి ఆ పనులు పూర్తి చేయకుండా కొడంగల్‌కు నిధులు తీసుకెళ్తున్నాడని, ఇది పాలమూరు ప్రజలకు చేస్తున్న ద్రోహమని మండిపడ్డారు.

కొడంగల్-నారాయణపేట కాలువలు క్యాన్సిల్.. చుక్క నీరు లేదు

కొడంగల్-నారాయణపేటకు వచ్చే కాలువలను రేవంత్ రెడ్డి క్యాన్సిల్ చేసి చుక్క నీరు లేకుండా చేశాడని నిరంజన్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో భాగంగా కొడంగల్, నారాయణపేట ప్రాంతాలకు నీరు అందించేందుకు రూపొందించిన కాలువలను రద్దు చేయడం దారుణమని చెప్పారు. తన సొంత నియోజకవర్గం కొడంగల్‌కే నీరు ఇవ్వలేని ముఖ్యమంత్రి, మిగతా ప్రాంతాలకు ఏం న్యాయం చేస్తాడని ప్రశ్నించారు.

రేవంత్ రెడ్డి చేసిన పనికి మళ్లీ పాలమూరు ప్రజలు వలసలు పట్టే పరిస్థితి వచ్చిందని నిరంజన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఒకప్పుడు పాలమూరు అంటే వలసలకు కేరాఫ్ అడ్రస్. బీఆర్ఎస్ హయాంలో సాగునీరు, తాగునీరు అందించి వలసలను ఆపామని, కానీ ఇప్పుడు రేవంత్ రెడ్డి నిర్ణయాలతో మళ్లీ పాలమూరు ప్రజలు బతుకుదెరువు కోసం వలస వెళ్లే పరిస్థితి వచ్చిందని చెప్పారు. ఇది పాలమూరు ప్రజలను అవమానించడమేనని మండిపడ్డారు.

రేవంత్ రెడ్డి తీరుపై ప్రజలే తీర్పు ఇస్తారు

మొత్తంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం పాలమూరు ప్రాంతాన్ని నిర్లక్ష్యం చేస్తోందని, సొంత ప్రయోజనాల కోసమే పనిచేస్తోందని నిరంజన్ రెడ్డి విమర్శించారు. ప్రభుత్వ ఖర్చుతో పుట్టినరోజులు, సొంత నియోజకవర్గానికి నిధులు, ప్రాజెక్టులను పక్కన పెట్టడం, ప్రతిపక్షాలను తిట్టడం తప్ప రేవంత్ రెడ్డి చేస్తున్నదేమీ లేదని ఎద్దేవా చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పాలమూరు ప్రజలు, తెలంగాణ ప్రజలు రేవంత్ రెడ్డికి తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేసి, పాలమూరుకు నీళ్లు ఇవ్వాలని, లేకపోతే ప్రజా ఉద్యమం చేపడతామని నిరంజన్ రెడ్డి స్పష్టం చేశారు.

4 బాసర త్రిబుల్ ఐటీలో దారుణం.. మురికినీరే దిక్కు!

- నల్లగా, బురదతో కూడిన నీరు..

- తాగాలన్నా, స్నానం చేయాలన్నా అదే నీరు!

- కలుషిత నీటితో చర్మ వ్యాధులు..

- భయంతో వణుకుతున్న వేలాది మంది విద్యార్థులు!

తెలంగాణ స్టేట్ బ్యూరో, నవంబర్ 10 (విజన్ ఆంధ్ర):

బాసర రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (త్రిబుల్ ఐటీ)లో విద్యార్థుల పరిస్థితి దారుణంగా మారింది. చదువుకోవడానికి వచ్చిన విద్యార్థులకు కనీసం తాగడానికి స్వచ్ఛమైన నీరు కూడా దొరకడం లేదు. వసతి గృహాలకు నల్లగా, మట్టితో, బురదతో కూడిన మురికినీరు సరఫరా అవుతుండటంతో విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గతంలో నీటి కొరతతో ఇబ్బందులు ఎదుర్కొన్న విద్యార్థులకు ఇప్పుడు మురికినీటి సమస్య కొత్త తలనొప్పిగా మారింది.



ట్యాప్ తిప్పితే బురద నీరు!

హాస్టల్‌లో ట్యాప్ తిప్పితే చాలు నల్లటి, బురదతో కూడిన నీరు వస్తోందని విద్యార్థులు వాపోతున్నారు. బకెట్‌లో పట్టిన నీటిని చూస్తేనే తాగాలనిపించడం లేదని, కడుపులో తిప్పినట్లు అవుతోందని చెబుతున్నారు. కానీ తప్పనిసరి పరిస్థితిలో అదే నీటిని వాడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగడానికి, స్నానాలకు, బట్టలు ఉతకడానికి, వంటలకు, ఇతర అవసరాలకు కూడా ఈ మురికినీటినే వినియోగించాల్సి వస్తోందని వాపోతున్నారు. తెల్లటి బట్టలు ఈ నీటిలో ఉతికితే నల్లగా మారిపోతున్నాయని, స్నానం చేసినా శరీరం శుభ్రంగా అనిపించడం లేదని విద్యార్థులు చెబుతున్నారు. బాత్‌రూమ్‌లు, టాయిలెట్లలో కూడా ఇదే నీరు రావడంతో దుర్వాసన వస్తోందని, అక్కడ ఉండలేకపోతున్నామని వాపోతున్నారు.



కలుషిత నీటితో చర్మ వ్యాధులు..!

సరఫరా అవుతున్న కలుషిత నీటిని ఉపయోగించడం వల్ల చర్మ సంబంధిత సమస్యలు విపరీతంగా వస్తున్నాయని పలువురు విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దురదలు, దద్దుర్లు, చర్మంపై మచ్చలు, జుట్టు రాలడం, కళ్లు మండడం, కడుపు నొప్పి, విరేచనాలు వంటి సమస్యలు వస్తున్నాయని చెబుతున్నారు. ముఖ్యంగా విద్యార్థినులు చర్మ సమస్యలతో ఎక్కువగా బాధపడుతున్నారని తెలిపారు. "స్నానం చేసిన తర్వాత శరీరం మొత్తం దురద వస్తోంది. మందులు వాడినా తగ్గడం లేదు. హాస్పిటల్‌కు వెళ్తే నీరు మార్చండి అని డాక్టర్లు చెబుతున్నారు. కానీ మేము నీరు ఎక్కడి నుంచి తెచ్చుకోవాలి?" అని ఓ విద్యార్థిని ఆవేదన వ్యక్తం చేసింది. మరో విద్యార్థి "ఈ నీరు తాగితే కడుపులో నొప్పి వస్తోంది. బయటి నుంచి వాటర్ బాటిల్స్ తెచ్చుకోవాలంటే డబ్బులు లేవు" అని వాపోయాడు.

సోషల్ మీడియాలో వైరల్.. తల్లిదండ్రుల ఆందోళన!

కలుషిత నీటి సరఫరాకు సంబంధించిన దృశ్యాలను విద్యార్థులు సామాజిక మాధ్యమాల్లో పంచుకోవడంతో ఈ విషయం వైరల్‌గా మారింది. బకెట్లలో నల్లటి నీరు, మట్టితో కూడిన నీరు ఉన్న ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. దీంతో తల్లిదండ్రులు కూడా తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ పిల్లలను ఇలాంటి పరిస్థితుల్లో ఎలా ఉంచాలని, వారి ఆరోగ్యం ఏమవుతుందని ప్రశ్నిస్తున్నారు. ప్రతిష్టాత్మకమైన త్రిబుల్ ఐటీలోనే ఇలాంటి పరిస్థితి ఉంటే ఇక సామాన్య హాస్టళ్ల పరిస్థితి ఏంటని విద్యార్థి సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. వేలాది మంది విద్యార్థులు చదువుతున్న యూనివర్సిటీలో కనీస సౌకర్యాలు కూడా లేకపోవడం సిగ్గుచేటని మండిపడుతున్నారు.



విద్యార్థుల డిమాండ్ - వెంటనే పరిష్కరించాలి!

విశ్వవిద్యాలయ అధికారులు వెంటనే స్పందించి నీటి నాణ్యతను పరీక్షించాలని, విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. సంబంధిత అధికారులు నీటి నమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహించడంతో పాటు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు. నీటి ట్యాంకులు, పైప్‌లైన్లను వెంటనే శుభ్రం చేయాలని, ఫిల్టర్లను మార్చాలని, ప్రతిరోజూ నీటి నాణ్యతను పరీక్షించాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. తక్షణమే మినరల్ వాటర్, ట్యాంకర్ల ద్వారా స్వచ్ఛమైన నీటిని సరఫరా చేయాలని కోరుతున్నారు. అధికారులు స్పందించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వం, విశ్వవిద్యాలయ యాజమాన్యం వెంటనే జోక్యం చేసుకుని విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని, విద్యార్థుల ఆరోగ్యంతో చెలగాటం ఆడవద్దని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

అందెశ్రీ రచనలు చిరస్థాయిగా నిలిచిపోతాయి



ప్రతిధ్వనించాయని అన్నారు. ఆయన రాసిన ప్రతి పాట ప్రజల గుండెల్లో నుంచి వచ్చిందని, అందుకే అది ప్రజల గుండెల్లో నిలిచిపోయిందని చెప్పారు.

కవులు, సాహితీవేత్తలు ఎన్ని పుస్తకాలు రచించారన్నది ముఖ్యం కాదని, వారి రచనలు సమాజానికి ఎంతవరకు ఉపయోగపడ్డాయి, ప్రజల్లో ఎంతటి జాగృతిని, చైతన్యాన్ని తీసుకొచ్చాయన్నదే అసలైన కొలమానమని మంత్రి అభిప్రాయపడ్డారు. ఆ కోణంలో చూస్తే అందెశ్రీ అత్యున్నతమైన ప్రజాకవిగా నిలిచిపోతారని పేర్కొన్నారు. ఆయన రచనలు కేవలం పుస్తకాల్లోనే కాదు, ప్రజల నోళ్లలో, ప్రజల పోరాటాల్లో, ప్రజల జెండాల్లో బతికే ఉన్నాయని అన్నారు. తెలంగాణ వచ్చాక కూడా అందెశ్రీ పాటలు ప్రతి సభలో, ప్రతి ఉద్యమంలో, ప్రతి సాంస్కృతిక కార్యక్రమంలో మోగుతూనే ఉన్నాయని గుర్తుచేశారు. అందెశ్రీ ఆలోచనా విధానం, ఆశయాలను కవులు, కళాకారులు, సాహితీవేత్తలు కొనసాగించాలని మంత్రి పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రజలు ఆత్మగౌరవంతో జీవించాలన్న ఆయన ఆకాంక్షలను మన జీవన విధానంలో, ఆలోచనా విధానంలో భాగం చేసుకుని ముందుకు సాగినప్పుడే అందెశ్రీకి నిజమైన నివాళి అర్పించినవారమవుతామని జూపల్లి పేర్కొన్నారు. కేవలం వర్ధంతి రోజున దండ వేసి, ఫొటోకు నమస్కారం చేస్తే సరిపోదని, ఆయన ఆశయాలను ఆచరణలో చూపించాలని సూచించారు. తెలంగాణ భాష, యాస, సంస్కృతి, చరిత్రను కాపాడుకోవడమే అందెశ్రీకి ఇచ్చే గొప్ప నివాళి అని అన్నారు.

తెలంగాణ ప్రభుత్వం అందెశ్రీ స్మృతిని చిరస్థాయిగా నిలిపేందుకు అనేక చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు. ఆయన రచనలను భావితరాలకు అందించేందుకు, ఆయన పాటలను పాఠ్యాంశాల్లోకి తీసుకురావడానికి, ఆయన పేరుతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. సాంస్కృతిక శాఖ ద్వారా అందెశ్రీ రచనల ప్రచారం, ప్రసారం కోసం ప్రత్యేక కార్యక్రమాలు చేపడతామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో అరుణోదయ విమలక్క మాట్లాడుతూ అందెశ్రీతో తన అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఉద్యమ సమయంలో అందెశ్రీ పాటలు తమకు ఎంతో బలాన్నిచ్చాయని, ఆయన లేని లోటు తీరదని కన్నీటి పర్యంతమయ్యారు. తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్ పర్సన్ వెన్నెల గద్దర్ మాట్లాడుతూ అందెశ్రీ రచనలు యువతకు స్ఫూర్తిదాయకమని, యువ కవులు ఆయన బాటలో నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర పశు గణాభివృద్ధి సంస్థ చైర్మన్ చరణ్ కౌశిక్ యాదవ్, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ నర్సింహారెడ్డి, కవులు, కళాకారులు, సాహితీవేత్తలు, అందెశ్రీ అభిమానులు, కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో అందెశ్రీ పాటలను కళాకారులు ఆలపించి అందరినీ భావోద్వేగానికి గురి చేశారు. చివరగా అందెశ్రీ ఆశయ సాధన కోసం అందరూ కలిసి పనిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు.



యూజీడీ పనులకు శంకుస్థాపన

కీసర, నవంబరు10, విజన్ ఆంధ్ర : నాగారం డివిజన్ రాంపల్లి పరిధిలోని కాకతీయ డైమండ్ కాలనీ, తారక ఎన్‌క్లేవ్ కాలనీలలో సుమారు రూ.2 కోట్ల 10 లక్షల వ్యయంతో చేపట్టనున్న డ్రైనేజీ అభివృద్ధి పనులకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో నాగారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎల్లసాని భూమయ్య యాదవ్, మాజీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పంగ హరిబాబు, కాంగ్రెస్ పార్టీ నాయకులు వంగేటి పర్వత్ రెడ్డి, కౌకుంట్ల జీవన్ రెడ్డి పాల్గొన్నారు.

EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. RNI.NO.70731/1999 EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.